thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 267 కరీంనగర్ గురువారం, 4 డిసెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## రద్దీ ప్రాంతాల్లో మాస్కు ధరించండి..

చెన్నై: రద్దీ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు మాస్క్ ధరించాలని ఆరోగ్యశాఖ సూచించింది. వాతావరణ మార్పుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పగలు ఎండ తీవ్రత, రాత్రి వేళల్లో వర్షం కురుస్తోంది. ఈ కారణంగా చెన్నై సహా పలు జిల్లాల్లో వైరల్ జ్వరాల వ్యాప్తి అధికంగా ఉంది. నగరంలో కూడా జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లునొప్పులు తదితర లక్షణాలతో ఆస్పత్రుల్లో చేరేవారి సంఖ్య అధికమవుతోంది. ఈ క్రమంలో, ఆరోగ్య శాఖ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... వాతావరణ మార్పుల కారణంగా వైరల్ జ్వరాలు వ్యాపిస్తున్నాయని, జ్వరాలు నిరోధించేలా ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించింది. వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు రద్దీ ప్రాంతాలకు వెళ్లొద్దని, ఒకవేళ వెళ్లాల్సి వస్తే మాస్క్ ధరించాలని పేర్కొంది.




# బైరంఘడ్-గంగలూరులో భారీ ఎన్‌కౌంటర్

## -15 మంది మావోలు, ముగ్గురు పోలీసులు మృతి

### -రాత్రి వరకు కొనసాగుతున్న కాల్పులు -మృతుల సంఖ్య పెరిగే అవకాశం

చురకలు ప్రత్యేక ప్రతినిధి

ఛత్తీస్ ఘడ్ లోని బీజాపూర్ జిల్లాలో బైరంఘడ్–గంగులూర్ బుధవారం ఉదయం నుండి సాయంత్రం వరకూ భారీ ఎన్కౌంటర్లో కొనసాగుతోంది. ఈ ప్రాంతంలో దాదాపు 18 మంది మరణించారు అందులో 15 మందిని మావోయిస్టులుగా గుర్తించారు అధికారులు ముగ్గురిని పోలీసులుగా గుర్తించారు.ఒకే ప్రాంతంలో నక్సల్స్ ఉన్నట్లు సమాచారం అందడంతో వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు ఎప్పటి మాదిరిగానే పోలీసులు లొంగిపొమ్మని చెప్పడంతో కాల్పులు మొదలయ్యాయి ఇరు పక్షాలుగా కూడా కాల్పులు అనేక దఫాలుగా జరిగిన కాల్పుల్లో ఉదయం నుంచి రాత్రి నిద్రపోయే వరకూ కాల్పులు నడుస్తూ వస్తున్నాయి.ఉదయం ఐదుగురు మావోలుగా మరణించినట్టు చెబుతూ వచ్చారు కానీ ఈ ఘటనలో మధ్యానం 7 గురు మరణించారు అని సమాచారం సాయంత్రం 12 మందిగా సమాచారం రావడంతో పెద్ద సంఖ్యలో మరణిస్తున్నట్టు సమాచారం బయటకు వచ్చింది ఈ సంఖ్య దాదాపు 15 కు చేరింది వీరే కాకుండా ముగ్గురు డీఆర్జీ సిబ్బంది కూడా ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం అందింది.

**డీఆర్జీ అంటే నిన్నటి సల్వాజుడుం.!!...** –అక్కడక్కడ జరుగుతున్న ఎన్కౌంటర్లో ఒకరిద్దరు నక్స లైట్ల చేతుల్లో డిఆర్జి కి చెందిన వారు ప్రాణాలు కోల్పోవడం జరిగింది.ఈ ఘటనలో ముగ్గురు డీఆర్జీ సిబ్బంది మరణించారు .డీఆర్జీ సిబ్బంది అంటే ఒకప్పటి సల్వాజుడుం అనే పేరుతో ఉన్న వీరు ఈ మధ్య కాలం లో డీఆర్జీ కింద పనిచేస్తున్నారు.ఇంకా డీఆర్జీ లో పని చేస్తున్న వారి లో లొంగిపోయిన మాజీ నక్సల్స్ డీఆర్జీ లో చేరి మావోయిస్టు లను ఏరివేతలో భాగంగానే చురుకుగా పని చేస్తున్నారు ఈ క్రమంలో ఈ రోజు ఎన్కౌంటర్లో మరణించిన వారిలో ముగ్గురు డిఆర్జీ సిబ్బంది ఉన్నారు.మరో నలుగురు డీఆర్జీ సిబ్బంది గాయపడ్డారు..అటు నక్సలైట్లు ఇటు డీఆర్జీ కూడా ఆదివాసీ ప్రజలే కావడం విశేషం.బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ జరిగిన భీకర దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారంతా ఛత్తీస్ఘడ రాష్ట్ర ఆదివాసులే.మరిన్ని వివరాలు రేపు తెలుసుకుందాం




హైదరాబాద్: కోకాపేట నియోపొలిస్ భూములకు మూడో విడత వేలం ప్రక్రియ ముగిసింది. ఇవాళ ప్లాట్ నెంబర్ 19, 20లోని 8.04 ఎకరాలకు అధికారులు ఈ–వేలం నిర్వహించారు. ప్లాట్ నెంబర్ 19లో ఎకరానికి రూ.131 కోట్లు, ప్లాట్ నెంబర్ 20లో ఎకరం రూ.118 కోట్ల ధర పలికింది. ఇవాళ 8.04 ఎకరాలకు హెచ్ఎండీఏకు రూ. వెయ్యి కోట్ల మేర ఆదాయం సమకూరింది. మొత్తం 3 విడతల్లో ఆరు ప్లాట్లలోని 27 ఎకరాలకు రూ.3,708 కోట్ల ఆదాయం లభించింది. ఈసారి మొత్తం 44 ఎకరాల భూమిని నాలుగు విడతల్లో హెచ్ఎండీఏ వేలం వస్తోంది. కోకాపేట గోల్డెన్ మైల్‌లోని 2 ఎకరాలు, మూసాపేటలోని 15 ఎకరాలకు డిసెంబర్ 5న ఈ–వేలం వేయనుంది.

## పల్లెల వైపు చూడని బీఆర్ఎస్ బడా లీడర్లు.. తీవ్ర నిరాశలో పార్టీ లోకల్ కేడర్




ఎన్నికలంటేనే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. వార్డు మెంబర్ నుంచి సర్పంచ్, ఎమ్మెల్యే, ఎంపీ.. ఏ స్థాయి ఎన్నికలైనా డబ్బు ప్రవాహం పారాల్సిందే. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నిక సీజన్ నడుస్తున్నది. గ్రామాల్లో నెలకొన్న స్థానిక సందడి అంతా ఇంతా కాదు. ఇప్పటికే రెండు విడతల్లో నామినేషన్ల ప్రక్రియ సైతం ముగిసింది. అయితే.. ఈ క్రమంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ హోదాలో ఉన్న బీఆర్ఎస్ నేతలు మాత్రం స్థానిక సంస్థల ఎన్నికలను పెద్దగా పట్టించుకోవడం లేదు.

**పార్టీల మద్దతుతో అభ్యర్థులు బరిలోకి..** ఈ ఎన్నికలు పార్టీతో ముడిపడి లేకపోయినప్పటికీ.. గ్రామాల్లో మాత్రం పార్టీల మద్దతుతోనే పోటీలో నిలవడం చూస్తుంటాం. ఇప్పుడు కూడా గ్రామాల్లో అదే ధోరణి కనిపిస్తున్నది. కాంగ్రెస్ ప్యానల్ అని.. బీఆర్ఎస్ ప్యానల్.. బీజేపీ ప్యానల్ అని బరిలోకి దిగుతున్నారు. అయితే.. అధికార పార్టీకి సంబంధించి ఆ పార్టీకి చెందిన కీలక నేతలు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఎన్నికలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీకి వచ్చేసరికి పరిస్థితి పూర్తిభిన్నంగా కనిపిస్తున్నది. గ్రామాల్లో బీఆర్ఎస్ తరఫున ప్యానల్ వేసి పోటీలోకి దిగుతున్నా.. వారికి పార్టీ నుంచి సరైన మద్దతు దొరకడం లేదన్న ప్రచారం జరుగుతున్నది.

**పైసల కోసమేనా ఈ దూరం..** స్థానిక సంస్థల ఎన్నికలు సైతం ప్రస్తుత పరిస్థితుల్లో చాలా ఖర్చుతో కూడుకున్నవిగా మారిపోయాయి. లక్షలు కుమ్మరిస్తే కానీ గెలిచే అవకాశాలు కనిపించడం లేదు. అయితే.. ఇన్నాళ్లు బీఆర్ఎస్ పార్టీని నమ్ముకొని ఉన్నవాళ్లంతా ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల బరిలోకి దిగారు. ఈ సమయంలో వారికి మద్దతుగా నిలవాల్సింది పోయి కీలక నేతలు నియోజకవర్గాల మొఖం చూడడం లేదు. ఎందుకు ఈ పరిస్థితి అంటే.. నియోజకవర్గాలకు, గ్రామాలకు వెళ్తే అభ్యర్థులు ఎక్కడ డబ్బులు అడుగుతారోనని భయపడుతున్నారని టాక్. ఈ ఖర్చు తమకు ఎందుకులే అని ఈ ఎన్నికలను లైట్ తీసుకుంటున్నారన్న వాదన వినిపిస్తున్నది.

ఈ ఆర్థిక భారం నుంచి తప్పించుకునేందుకు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు.. తదితర కీలక నేతలు అటు వైపు తొంగి చూడటం లేదన్న ప్రచారం జరుగుతున్నది.

**మన ఎన్నికల వరకు చూద్దాం..** స్థానిక సంస్థల ఎన్నికలను గులాబీ పార్టీ కీలక లీడర్లు పట్టించుకోకుండా లైట్ తీసుకున్నారు. ఇప్పుడు ఖర్చును భరించే పరిస్థితి లేదని వారికి కనీసం మొఖం కూడా చూపించడం లేదు. అయితే.. తమ ఎన్నికల వరకు చూద్దాంలే అన్న వైఖరితో ఆ నేతలంతా ఉన్నారని తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో పైసలు ఖర్చు చేయడం ఎందుకని పట్టించుకోవడం లేదని ప్రచారం జరుగుతోంది. వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలప్పుడే నియోజకవర్గాలు, గ్రామాల వైపు వెళ్దామని భావిస్తున్నారని తెలుస్తోంది. అయితే.. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల వేళ వీరినే నమ్ముకొని బరిలోకి దిగిన నేతలను పట్టించుకోనప్పుడు.. ఈ నేతలు పోటీ చేసే సందర్భంలో ఎలా మద్దతుగా ఉంటామన్న ప్రశ్న అభ్యర్థుల నుంచి వినిపిస్తున్నది.

# నిరుద్యోగులకు శుభవార్త

## త్వరలో మరో 40వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం

### హుస్నాబాద్ వేదికగా ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి






హుస్నాబాద్: త్వరలో మరో 40వేల ఉద్యోగాల భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో రూ.262 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. "సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ హుస్నాబాద్ నుంచే బహుజన దండు కట్టారు. తెలంగాణ ఉద్యమం ఈ ప్రాంతం నుంచి ఉవ్వెత్తున ఎగసిపడింది. కరీంనగర్‌లో ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకే సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారు. శ్రీకాంతాచారి స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 60వేల ఉద్యోగాలు ఇచ్చాం. ప్రజాపాలన రెండున్నరేళ్లు పూర్తయ్యేలోగా లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తాం. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఎస్ఆర్ఎస్పీ ఎలా ఉందో?.. భారత రాష్ట్ర సమితి కట్టిన కాళేశ్వరం ఎలా ఉందో ప్రజలు ఆలోచించాలి. దేశంలో అత్యధికంగా వరిని పండించేది మన రాష్ట్రంలోనే. వ్యవసాయం అంటే దండగ కాదు.. పండగ అని చేసి చూపించింది మన ప్రభుత్వమే. రాష్ట్రంలో రైతుల కోసం రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు పెట్టాం. రాష్ట్రంలో వందలాది బస్సులకు ఆడబిడ్డలు యజమానులు అయ్యారు. 3.10 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. రూ.22,500 కోట్లు పేదల ఇళ్ల కోసం ఖర్చు చేస్తున్నాం. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో మొదలు పెట్టిన ప్రాజెక్టులు అన్నీ పూర్తయ్యాయి. కానీ, హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరెల్లి ప్రాజెక్టు ఇంకా పూర్తి కాలేదు. గత పాలకుల మాదిరిగా హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చెయ్యం. త్వరలో గౌరెల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తాం" అని సీఎం ప్రకటించారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ హుస్నాబాద్ నుంచే.. బహుజనులు దండు కట్టి ఉద్యమించారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమం ఇక్కడి నుంచే ఉవ్వెత్తున ఎగసిపడిందని గుర్తుచేశారు. 2004లో కరీంనగర్ గడ్డ నుంచే తెలంగాణ ఇస్తానని ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ మాట ఇచ్చి నిలబెట్టుకున్నారని చెప్పుకొచ్చారు. 2014లో స్వరాష్ట్ర ఆకాంక్షను సోనియాగాంధీ నెరవేర్చారని వ్యాఖ్యానించారు. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తున్నామని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో నిధులు ఎక్కువగా ఇచ్చారని.. మిగిలిన ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. హుస్నాబాద్‌కు పదేళ్లు నిధులెందుకు ఇవ్వలేదు..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు ఎన్ని నిధులైనా ఇచ్చి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో లాగా హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చేయబోనని చెప్పుకొచ్చారు. గత పదేళ్లలో ఎవ్వరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదని ఫైర్ అయ్యారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా అలస్వతం ప్రదర్శించారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు సభలో పాల్గొన్నారు.



# ఒకే రోజులో ప్రధాని మోదీ, రాహుల్, ప్రియాంకతో సమావేశం!

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని నేడు ఢిల్లీలో పలువురు కాంగ్రెస్ అగ్రనేతలు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో ప్రత్యేకం భేటీ అయ్యారు.

**ప్రధాని మోదీతో భేటీ.. 'తెలంగాణ రైజింగ్ 2047'కి ఆహ్వానం...** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో పార్లమెంట్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో భేటీ అయ్యారు. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్‌కు రావాల్సిందిగా ప్రధాని మోదీని సీఎం ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ముద్రించిన సమ్మిట్ ఆహ్వాన పత్రికను ఆయన ప్రధానికి అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ఎంచుకున్న వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా, 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధి లక్ష్యంగా తెలంగాణ భవిష్యత్తు సంకల్పంతో ముందుకు సాగుతుందని సీఎం ప్రధానికి వివరించారు. నీతి ఆయోగ్ సలహాలు, సూచనలతో పాటు అన్ని రంగాల నిపుణుల మేధో మథనంతో తయారు చేసిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను ఈ గ్లోబల్ సమ్మిట్‌లో ఆవిష్కరించనున్నట్లు సీఎం ప్రధానికి వివరించారు. ఈ భేటీలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా ఉన్నారు.

**రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో సమావేశం...** అంతకుముందు, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర ఎంపీలు, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కలిసి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో భేటీ అయ్యారు. హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాల్సిందిగా వారిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. భవిష్యత్తులో తెలంగాణ అభివృద్ధి, ఆదాయ వృద్ధి లక్ష్యంగా రూపొందించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ గురించి సీఎం ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలకు వివరించి, ఆహ్వాన పత్రికను అందించారు.

# పార్టీలో అంతర్గతంగా మాట్లాడితే ఎడిట్ చేసి ప్రచారం చేస్తున్నారు: సీఎం రేవంత్



దిల్లీ: తెలంగాణలో పదేళ్లు తన నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. దిల్లీలో ప్రధానితోపాటు పలువురు కేంద్ర మంత్రులను కలిసిన అనంతరం ఆయన మాట్లాడారు. హిందూ సమాజంలాంటిదే కాంగ్రెస్ అని డీసీసీ అధ్యక్షులకు చెప్పానని వివరించారు. పార్టీ నేతగా ఎలా పనిచేయాలనేది వివరించే క్రమంలో చెప్పానన్నారు. జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ కోల్పోవడంతో భాజపా దీన్ని వివాదం చేస్తోందని మండిపడ్డారు. పార్టీలో అంతర్గతంగా మాట్లాడిన వ్యాఖ్యలను ఎడిట్ చేసి ప్రచారం చేస్తున్నారని విపక్షాలపై మండిపడ్డారు. ఉత్తర భారతంలోనూ తనను పాపులర్ చేస్తున్నందుకు సంతోషమని వ్యాఖ్యానించారు.

**మూగ బాలుడిపై వీధి కుక్కల దాడి ఘటన.. స్పందించిన సీఎం రేవంత్**... నగరంలోని మన్సూరాబాద్‌లో మూగబాలుడిపై కుక్కల దాడి ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అతడికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వీధికుక్కల కట్టడి కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. ఎల్బీనగర్ మన్సూరాబాద్ సమీపంలోని శివగంగ కాలనీలో.. 15 నుంచి 20 వీధి కుక్కలు ఒకేసారి దాడి చేయడంతో మూగ బాలుడు తీవ్రగాయాలతో ఆసుపత్రి పాలయ్యాడు. ప్రకాశం జిల్లాకు చెందిన సీహెచ్ తిరుపతిరావు, చంద్రకళ దంపతులు మన్సూరాబాద్ సమీపంలోని కాలనీలో ఉంటున్నారు. వీరి కుమారుడు ప్రేమ్‌చంద్ (చింటు) పుట్టుకతో మూగ. మంగళవారం ఉదయం ఇంటి నుంచి వీధిలోకి వెళ్లినప్పుడు ఒక్కసారిగా కుక్కలు తరుముతూ అతడిపై దాడి చేశాయి. దుస్తులు కొరికేసి మరీ కరిచాయి. గమనించిన ఓ స్థానికుడు కర్రతో కుక్కలను అదిలించి 108కు సమాచారం ఇచ్చారు. తొలుత నల్లకుంటలోని ఫీవర్ ఆసుపత్రికి, వైద్యుల సూచనతో నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అత్యవసర వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనలో బాలుడి చెవి తెగింది. తల, నడుము, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. కాస్త ఆలస్యమైతే కుక్కల దాడిలో ప్రేమ్‌చంద్ ప్రాణాలు కోల్పోయేవాడని వైద్యులు తెలిపారు.




# వివేకా హత్య కేసు.. కోర్టు ఏం చెప్పబోతోంది.. కొనసాగుతున్న హైటెన్షన్..?

కడప : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సమగ్ర దర్యాప్తు జరపాలని సీబీఐ కోర్టులో ఆయన కూతురు సునీతారెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై ఇవాళ న్యాయస్థానం విచారణ చేసింది. ఈ క్రమంలో సునీత వేసిన పిటిషన్‌పై వాదనలు పూర్తి అవడంతో తీర్పును రిజర్వ్ చేసింది సీబీఐ కోర్టు. ఈ నెల 10వ తేదీన తీర్పు వెల్లడించనుంది సీబీఐ కోర్టు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు జరిపించేలా సీబీఐకు న్యాయస్థానం ఆదేశాలు ఇవ్వాలంటూ సునీత న్యాయవాదులు వాదనలు వినిపించారు. తన తండ్రి హత్య కేసులో సమగ్ర దర్యాప్తు జరపకపోతే అసలైన వ్యక్తులు తప్పించుకునే ప్ర మాదం ఉందని పేర్కొన్నారు సునీత. ఇదే కేసులో సప్లమెంటరీ ఛార్జ్‌షీట్ దాఖలు చేసేలా సీబీఐకి ఆదేశాలు ఇవ్వాలని సీబీఐ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు సునీత తరుపు న్యాయవాది. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు జరిపితే ఇప్పటివరకు వెలుగు చూడని సంచలన విషయాలు బయటకు వస్తాయని అభిప్రాయపడ్డారు సునీతారెడ్డి.

# 'స్థానిక' ఎన్నికల తర్వాతే భూధార్ కార్డుల పంపిణీ : మంత్రి పొంగులేటి



హైదరాబాద్: భూ భారతిలో నియమ నిబంధనలు కఠినతరం చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి చిన్న విషయానికి కోర్టుకు వెళ్లకుండా భూ భారతిని సమగ్రంగా తయారు చేశామన్నారు. 9 లక్షల ఫిర్యాదుల్లో న్యాయపరమైనవి పరిష్కరించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ధరణిలోని ఉన్న అనేక సీక్రెట్ లాకర్లు ఓపెన్ చేశామని తెలిపారు. భూభారతిలో చెప్పిన విధంగా భూధార్ కార్డులు సిద్ధం చేశామని, స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత వాటిని పంపిణీ చేస్తామని చెప్పారు.




హైదరాబాద్, డిసెంబర్ 03: టెక్నాలజీపై ఉన్న పట్టుతో కొత్త సినిమాలను పైరసీ చేసి.. చిత్ర పరిశ్రమకు ఐ బొమ్మ రవి చుక్కుల చూపించారు. అలాంటి రవికి పోలీసులు బంపర్ ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అతడి తెలివితేటలను విచారణలో భాగంగా పోలీస్ ఉన్నతాధికారులు గుర్తించారు. పోలీసు శాఖలోని సైబర్ క్రైమ్ విభాగంలో పని చేస్తావా? అంటూ రవిని వారు అడిగినట్లు సమాచారం. మంచి జీతం సైతం ఇస్తామని అతడికి ఆఫర్ చేశారని తెలుస్తోంది. రవి మాత్రం వారి ఇచ్చిన ఆఫర్‌ను తిరస్కరించారట. ఇమ్మడి రవిని కస్టడీలోకి తీసుకుని విచారించిన పోలీసులు అనేక కొత్త విషయాలు రాబట్టినట్లు తెలుస్తోంది. విచారణలో భాగంగా 'ఐ బొమ్మ క్లోజ్ అయింది. కదా.. తర్వాత ఏం చేస్తావంటూ' రవిని పోలీసులు ప్రశ్నించారు. కరేబియన్ దీవుల్లో రెస్టారెంట్ ఏర్పాటు చేస్తానని వారికి చెప్పినట్లు సమాచారం. ఆ రెస్టారెంట్‌లో తెలంగాణ, ఆంధ్రాతోపాటు దేశంలోని వివిధ ప్రముఖ వంటకాలను ఆ దీవుల్లోని ప్రజలకు రుచి చూపించడం ద్వారా డబ్బు సంపాదిస్తానని సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. మరి ఆ రెస్టారెంట్‌కు ఏం పేరు పెడతావంటూ రవిని పోలీసులు ప్రశ్నించగా.. ఐ బొమ్మ పేరే పెడతానని రవి ఈ సందర్భంగా పోలీసులకు స్పష్టం చేసినట్లు సమాచారం.




హైదరాబాద్, డిసెంబర్ 03: నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. హిందూ దేవుళ్లపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు నిరసన చేపట్టాయి. నాంపల్లిలోని పీసీసీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు ర్యాలీగా బయలుదేరిన బీజేపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీజేపీ నేతలు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మరోవైపు గాంధీ భవన్ వద్ద భారీగా పోలీసులను మోహరించారు. మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ కార్యవర్గ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హిందూ దేవుళ్లపై వ్యాఖ్యలు చేశారు. దీనిపై బీజేపీ నేతలు బుధవారం స్పందిస్తూ..నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పే వరకు తాము పోరాటం చేస్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. గాంధీ భవన్‌ను ముట్టడించేందుకు వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ శ్రేణులు సైతం సమాయత్తమవుతున్నట్లు సమాచారం. గాంధీ భవన్ వద్ద పోలీసులను భారీగా మోహరించారు.

ఇక సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యల్లో ఎటువంటి తప్పు లేదని కాంగ్రెస్ పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. నేతల మధ్య ఏమైనా మనస్పర్థలు ఉంటే వాటిని అధిగమించి.. అందరిని కలుపుకుని పోవాలనే ఉద్దేశ్యంతో సీఎం రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లను ఉదాహరించారని చెప్పారు. అంతేకాని హిందూ దేవుళ్లను కించపరిచే ఉద్దేశ్యం సీఎం రేవంత్ రెడ్డికి ఎట్టి పరిస్థితుల్లో లేదని పార్టీ సీనియర్ నేతలు స్పష్టం చేస్తున్నారు. అదీకాక రేవంత్ రెడ్డి పాలనపై విమర్శించేందుకు బీజేపీ నేతలకు ఏ అంశం దొరకలేదని చెప్పారు. అందుకే సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వారు ఆక్షేపిస్తున్నారని చెప్పారు.

# ఎందుకు సీఎం రేవంత్ రెడ్డి మాటల్ని వక్రీకరిస్తున్నారు: ఎంపీ చామల



ఢిల్లీ : హైదరాబాద్‌లో నిన్న జరిగిన డీసీసీ నూతన అధ్యక్షుల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటల్ని ఎందుకు వక్రీకరిస్తున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రతీ విషయాన్నీ రాజకీయం చేసి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నాయని ఆయన మండిపడ్డారు. హిందువుల్లో అనేక మంది దేవుళ్ళు, దేవతలు ఉన్నారని రేవంత్ రెడ్డి చెప్పారు.. కులాన్ని, మతాన్ని ఇబ్బంది పెట్టే విధంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడలేదని ఎంపీ స్పష్టం చేశారు. దీన్ని బీజేపీ,బీఆర్ఎస్ రెండు పార్టీలు కలిసి రాజకీయం చేస్తున్నాయని విమర్శించారు. 'తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా బీజేపీ, బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తున్నాయి.. 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ అన్ని ఎన్నికల్లో ఓడిపోయింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీజేపీకి డిపాజిట్ దక్కలేదు. రేవంత్ రెడ్డి స్థాయిని తగ్గించి తెలంగాణ ప్రజల మనసుల్లో నెగిటివ్ అభిప్రాయాన్ని క్రియేట్ చేయాలని బీజేపీ, బీఆర్ఎస్ ప్రయత్నిస్తున్నాయని.. కాని తెలంగాణ ప్రజలకు వాస్తవాలు తెలుసునని చామల అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్ 2047 పేరుతో కార్యక్రమాలు చేస్తున్నారు.. మెస్సి లాంటి అంతర్జాతీయ ఫుట్ బాల్ క్రీడాకారుడిని తీసుకువచ్చి హైదరాబాద్ లో ఫుట్ బాల్ మ్యాచ్ ఆడిస్తున్నారని.. ఇదంతా హైదరాబాద్ కీర్తిని ఇనుమడింపచేస్తుందని ఎంపీ చెప్పుకొచ్చారు.

# క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే తెలంగాణ హిల్ట్ పాలసీ: కిషన్‌రెడ్డి



దిల్లీ: క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండానే తెలంగాణ ప్రభుత్వం 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్' (హిల్ట్) పాలసీని తీసుకొచ్చిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. దిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడారు. పారిశ్రామికవాడలో పనిచేస్తున్న వారితో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు సహకారం అందించకుండా పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూరుస్తోందని విమర్శించారు. పారిశ్రామికవేత్తలకు ఒక విధానం.. రైతులకు ఒక విధానమా? అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూర్చేలా అవినీతి జీవోను తెచ్చారన్నారు. హైదరాబాద్ పారిశ్రామిక ప్రాంతాల్లోని వేల ఎకరాల్లో కమర్షియల్ కాంప్లెక్స్‌లకు అనుమతిస్తే ట్రాఫిక్ పరిస్థితి ఏంటని నిలదీశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అనుకూలంగా హిల్ట్ పాలసీ ఉందని ఆరోపించారు.




**దిత్వా తుపాను ప్రభావంతో తిరుమలలో దట్టంగా పొగమంచు కమ్మేసింది. మంచుతో పాటు తేలికపాటి వర్షానికి ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. ఓ వైపు మంచు, మరోవైపు జల్లులు రావడంతో అందమైన దృశ్యాలను భక్తులు ఫోన్లలో బంధిస్తున్నారు. చలి తీవ్రత అధికమవడంతో వృద్ధులు, చంటి పిల్లలు వణుకుతున్నారు. పొగ మంచు కారణంగా ఘాట్ రోడ్డులో ప్రయాణించే వాహనదారులను తితిదే సిబ్బంది అప్రమత్తం చేస్తున్నారు.**

# సార్వత్రిక విశ్వ విద్యాలయ పితామహుడు గడ్డం రాంరెడ్డి


## డిసెంబర్ 4... విద్యా రంగ సంస్కర్త రాంరెడ్డి జయంతి



మారుమూల పల్లెలో జన్మించి, అంచెలంచలుగా పైకి ఎదుగుతూ, ఉన్నత చదువులు చదివి, విదేశాలలో విద్యనభ్యసించి, విద్యారంగంలో వినూత్న, విప్లవాత్మక కార్యక్రమాలు చేపట్టిన మేధావి ప్రొఫెసర్ గడ్డం రాంరెడ్డి. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ గా, వైస్ ఛాన్సలర్ గా, బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ప్రథమ వైస్ ఛాన్సలర్ గా, ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ గా, భారత సమాజ విజ్ఞాన పరిశోధనా మండలి దక్షిణ ప్రాంతీయ కేంద్ర వ్యవస్థాపక డైరెక్టర్ గా, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఛైర్మన్ గా తన మేధో సంపత్తిని ధారబోసిన మహనీయుడు ఆయన. దూరవిద్య ప్రముఖులు, సమాజ శాస్త్ర విజ్ఞానంలో మేటి వ్యక్తి, సార్వత్రిక విశ్వవిద్యాలయ పితామహుడు" గా గుర్తింపు పొంది, జి.రాంరెడ్డిగా సుపరిచితులైన గడ్డం రాంరెడ్డి (డిసెంబరు 4, 1929 – జూలై 2, 1995) 1929 డిసెంబరు 4న కరీంనగర్ జిల్లా మైలారం గ్రామంలో జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రాజ నీతి శాస్త్రంలో ఎమ్.ఎ. పట్టా పొంది పి.హెచ్.డి. స్వీకరించారు. 1977 వరకు అదే యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా పనిచేశారు. 1977 నుండి 1982 మధ్య కాలంలో వైస్ ఛాన్సలర్ గా పనిచేశారు. హైదరాబాదులోని భారత సమాజ విజ్ఞాన పరిశోధనా మండలి, దక్షిణ ప్రాంతీయ కేంద్రానికి వ్యవస్థాపక డైరెక్టర్ గా సమాజ శాస్త్రంలో పలు ప్రయోగాలు చేసి సఫలీకృ తులైనారు. 1980 దశాబ్దంలో దూరవిద్య వైపు దృష్టి మళ్ళించి, ప్రపంచ ప్రసిద్ధిచెందిన బ్రిటిష్ ఓపెన్ యూనివర్సిటీ గురించి నిశితంగా పరిశీలించి, దూర విద్యపై విశేషాధ్యయనం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కోరిక మేరకు సార్వత్రిక విశ్వవిద్యాలయం మన రాష్ట్రంలో ప్రారంభించే విషయంలో ఒక నివేదిక సమర్పించారు. వెంటనే ప్రభుత్వం ఆమోదించి 1982 లో దేశంలో మొట్టమొదటగా ఆంధ్ర ప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఏర్పడింది. దీనికే డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయముగా నామకరణం చేశారు. దీనికి మొదటి వైస్ ఛాన్సలర్ గా రాంరెడ్డి నియమితులైనారు. అయన చేస్తున్న కృషిని గుర్తించిన భారత ప్రభుత్వం 1985లో ప్రారంభించిన ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ గా ఆయనను నియమించింది. అక్కడ రాంరెడ్డి తన మేతోమధనంతో చేసిన కృషి అంతర్జాతీయ గుర్తింపు పొందింది. తరువాత 1991లో భారత ప్రభుత్వం రాంరెడ్డిని కొత్త ఢిల్లీలోని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఛైర్మన్ గా నియమించింది. ప్రపంచంలోని ప్రముఖ సార్వత్రిక విశ్వ విద్యాలయాలను పరిశీలించి సార్వత్రిక వ్యవస్థకు ఒక చక్కని నమూనా తయారుచేసి తొలిసారిగా ఆసియా అభివృద్ధి బ్యాంకు ఏర్పాటుచేసిన అంతర్జాతీయ సదస్సులో ప్రకటించారు. ఆ నమూనా పలుదేశాలలో సార్వత్రిక విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేసుకోడానికి తోడ్పడింది. బంగ్లాదేశ్ ప్రభుత్వం తమ మొదటి సార్వత్రిక విశ్వవిద్యాలయానికి రాంరెడ్డి సలహాదారుగా నియమించు కోవడం విశేషం. ఆంధ్ర ప్రదేశ్ లోను, భారతదేశంలోను రాంరెడ్డి కి కొన్ని విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్ పట్టాలు ప్రదానం చేశాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని దూరవిద్యా విభాగానికి ఆయన పేరు పెట్టారు. రారెడ్డికి 1994లో ప్రతిష్ఠాత్మకమైన శ్రీ రాజా లక్ష్మీ పురస్కారం ప్రదానం చేశారు. ఒక వ్యక్తి ఉన్నత విద్యను అభ్యసించడం సాధారణం. కానీ దేశంలోని ఎంతో మందికి ఆ విద్యను అభ్యసించే అవకాశం కల్పించడం అసాధారణం.దేశ ఆర్థిక సామాజిక సమగ్రాభివృద్ధికి విద్య ఒక్కటే మార్గమని నిర్దేశిస్తూ మారుమూల గ్రామాల ప్రజలు సైతం దూర విద్య ద్వా రా విద్యను పొందవచ్చని నిరూపించారు. విద్యా రంగంలో ఎన్నో సంస్కరణలను తీసుక వచ్చిన రాంరెడ్డి నిరంతర స్ఫూర్తిదాతగా నిలిచారు. స్నేహ పూర్వక పరిపాలన అధ్యక్షునిగా ఉప కులపతులకు ఆదర్శప్రాయులైనారు. ఉన్నత విద్యలో, ప్రధానంగా దూరవిద్యకు ఊతమిచ్చి, నేడు సర్వత్రా దూర విద్య అందుబాటు లోకి రావడానికి కారణభూతులైన దూర విద్య పితామహులు రాంరెడ్డి లండన్ లో జూలై 2, 1995లో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**


# ప్రతిభావంతుడైన దౌత్యవేత్త మాజీ ప్రధాని గుజ్రాల్ - డిసెంబర్ 4...ఇందర్ కుమార్ గుజ్రాల్ జయంతి



ఇందర్ కుమార్ గుజ్రాల్ భారతదేశ రాజకీయ రంగంలో తన శాంతియుత దృక్పథం, దౌత్య చాతుర్యం, పరిసర దేశాలతో సత్సంబంధాలను నెలకొల్పడంలో ప్రత్యేకమైన ఘనత సాధించిన నేత. 1997 నుండి 1998 వరకు భారతదేశ 12వ ప్రధాన మంత్రిగా పనిచేసిన ఆయన, తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎన్నో కీలక బాధ్యతలు నిర్వహించారు. "గుజ్రాల్ సిద్ధాంతం" అనే తన ప్రత్యేక దౌత్య విధానంతో దక్షిణాసియా దేశాల మధ్య శాంతి, సౌభ్రాతృత్వం, మరియు సహకారం పెంపొందించే ప్రయత్నం చేశారు. ఇందర్ కుమార్ గుజ్రాల్ 1919 డిసెంబర్ 4న, అప్పటి అవిభజిత పంజాబ్ లోని జీలం (ప్రస్తుత పాకిస్తాన్)లో ఒక దేశభక్తుల కుటుంబంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. చిన్ననాటి నుంచే గుజ్రాల్‌లో దేశభక్తి భావం కలిగింది. విద్యాభ్యాసం కోసం లాహోర్ ఫోర్మాన్ క్రిస్టియన్ కాలేజీలో చేరి, ఆ తర్వాత పంజాబ్ యూనివర్శిటీలో పట్టభద్రుడయ్యారు. విద్యార్థి దశలోనే స్వాతంత్ర్య ఉద్యమంలో చేరి, 1942లో మహాత్మా గాంధీ నేతృత్వంలో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. ఈ కారణంగా ఆయన కొన్ని నెలలు జైలు శిక్ష అనుభవించారు. గుజ్రాల్ రాజకీయ జీవితం 1950లలో ప్రారంభమైంది. 1964లో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. సమాచార మరియు ప్రసార మంత్రిగా పనిచేసినప్పుడు, ప్రత్యేకించి 1971 పాకిస్తాన్–భారత్ యుద్ధ సమయంలో, దేశానికి మార్గదర్శకత్వం వహించారు.1975 ఎమర్జెన్సీ సమయంలో ఇందిరా గాంధీతో విభేదించి, జనతా పార్టీలో చేరారు. 1989లో గుజ్రాల్ విదేశాంగ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. పదవిలో ఉన్నప్పుడు, ఆయన భారతదేశం – సోవియెట్ సంబంధాలను మరింత బలపరిచారు. అలాగే, పాకిస్తాన్‌తోనూ శాంతియుత సంబంధాలు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించారు. 1997లో దేవగౌడ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కూలిపోవడంతో, గుజ్రాల్ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రధానమంత్రి పదవిలో ఉన్న సమయంలో, భారతదేశం ఆర్థిక సమస్యలతో పాటు, రాజకీయ అస్థిరతను కూడా ఎదుర్కొంది. అయినప్పటికీ, ఆయన శాంతి, సహకారంపై దృష్టి సారించి, పొరుగు దేశాలతో సత్సంబంధాలను మెరుగు పరిచేందుకు కృషి చేశారు. గుజ్రాల్ సిద్ధాంతం అనే దౌత్య విధానం గుజ్రాల్ సిద్ధాంతంలో కేంద్రంగా ఉంది. ఇది ముఖ్యంగా భారతదేశం తన పొరుగు దేశాలతో శాంతి మరియు సౌభ్రాతృత్వాన్ని ఎలా మెరుగుపరచు కోవాలో చూపించే ఆచరణాత్మక దృక్పథం. ఈ సిద్ధాంతం ఐదు ముఖ్య సూత్రాలపై ఆధారపడి ఉంది: 1.భారతదేశం ఎప్పుడూ ఇతర దేశాలకు నష్టపరిచే విధంగా వ్యవహరించరాదు. 2. పొరుగు దేశాల సహకారం కోసం ఇండియా ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా కొన్ని రాయితీలు ఇవ్వాలి. 3. ఏ సమస్యలైనా శాంతియుతంగా పరిష్కరించుకోవడం ముఖ్య లక్ష్యం. 4. ఏ ఇతర దేశం వ్యతిరేకంగా జట్టు కట్టకుండా ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడం. 5.దక్షిణాసియా ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించేందుకు సహకారం అందించడం. గుజ్రాల్ అత్యంత ప్రతిభావంతమైన దౌత్యవేత్త. ఆయన విదేశాంగ శాఖలో చేసిన కృషి అంతర్జాతీయ వేదికలపై ప్రశంసలు పొందింది. గుజ్రాల్ ప్రధాన ఉద్దేశ్యం భారతదేశం పొరుగు దేశాలతో శాంతి పరమైన సంబంధాలు కొనసాగించడం. కాశ్మీర్ సమస్యను శాంతియుతంగా పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేశారు. రాజకీయాలకు ఆపాదమానస్కుడిగా ఉంటూ, సామాజిక సేవలో కూడా తన సంతకం వేశారు. ఇందర్ కుమార్ గుజ్రాల్ 2012లో 92 సంవత్సరాల వయసులో మరణించారు. తన ఆత్మకథ "%మీఫ్వతీం శీట ఱఅంఎతీవ్ఱశీఅ%" ద్వారా ఆయన జీవితం, అనుభవాలను పంచుకున్నారు. ఆయన గడిచిన కాలం శాంతి, సౌభ్రాతృత్వం మరియు సహకారం కోసం గుర్తుండి పోతుంది. ఆయన ప్రతిష్టించిన గుజ్రాల్ సిద్ధాంతం భారతదేశం యొక్క విదేశాంగ విధానానికి ఇప్పటికీ మార్గదర్శిగా ఉంది. ఇందర్ కుమార్ గుజ్రాల్ భారతదేశ రాజకీయ చరిత్రలో తనదైన ముద్ర వేశారు. దౌత్యకళ, శాంతి పరమైన సంబంధాలపై నమ్మకం, పొరుగు దేశాల మధ్య సత్సంబంధాలు నెలకొల్పడంలో చేసిన కృషి భారతీయ ప్రజలకు స్ఫూర్తిదాయకం. గుజ్రాల్ సిద్ధాంతం వంటి సిద్ధాంతాలు, భారతదేశం యొక్క భవిష్యత్ దౌత్య విధానానికి పునాది వేసిన పాఠాలు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# డిసెంబర్ 4... దివంగత రాష్ట్రపతి ఆర్.వెంకట్రామన్ జయంతి



ఆర్. వెంకట్ రామన్ గా చిర పరిచితులయిన రామస్వామి వెంకట్రామన్, తమిళ నాడుకు చెందిన సీనియర్ రాజకీయ నాయకులు, న్యాయవాది, భారత మాజీ రాష్ట్రపతి (1987 నుండి 1992) 1910 డిసెంబర్ 4న తమిళనాడు లోని తంజావూరు సమీపంలోని పట్టుకొట్టైలో జన్మించారు. మద్రాసు విశ్వ విద్యాలయంలో న్యాయశాస్త్రం అభ్యసించి 1935లో న్యాయవాద వృత్తిని చేపట్టారు.1947–1950 మధ్య కాలంలో మద్రాసు ప్రొవిన్షియల్ బార్ ఫెడరేషన్ కార్యదర్శిగా పని చేశారు. అలాగే పలు వాణిజ్య సంఘాలకు ఆయన నాయకత్వం వహించారు. 1953–54 మధ్యకాలంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యదర్శిగా పని చేశారు. రక్షణ రంగం పటిష్టతకు ఆయన విశేష కృషి చేశారు. మద్రాసు హైకోర్టులోను, 1951లో సుప్రీం కోర్టులోను తన పేరును నమోదు చేయించుకున్నారు. ఆయన క్విట్ ఇండియా ఉద్యమం, స్వాతంత్రోద్యమాల్లో కీలక పాత్ర పోషించారు. వెంకట్రామన్ 1950లో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ సభ్యుడిగా తాత్కాలిక పార్లమెంటుకు ఎన్నికయ్యారు. వెంకట్రామన్ 1952 నుండి 1957 వరకు, తర్వాత 1977 నుండి లోక్ సభ సభ్యులుగా ఉన్నారు. 1957 నుండి 1967 వరకు తమిళనాడు రాష్ట్రానికి పారిశ్రామిక, కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారు. వెంకట్రామన్ కేంద్ర ప్రభుత్వంలో చేరి ఆర్థిక, పరిశ్రమల శాఖ (1980%–%82) మరియు రక్షణ శాఖ మంత్రిగా (1982%–%84) పనిచేశారు. వెంకట్రామన్ ఆర్థిక మంత్రిగా పని చేస్తూ, 1980–81, 1981–82 ఆర్థిక సంవత్సరాలకు బడ్జెట్ ప్రవేశ పెట్టారు. 1984–87 లో భారత ఉప రాష్ట్రపతిగా పనిచేసిన తరువాత, 1987 జూలైలో రాష్ట్రపతి పదవికి ఎన్నిక కాబడ్డారు. జూలై 25, 1987 నుండి జూలై 25, 1992 వరకు దేశ ప్రథమ పౌరునిగా ఉన్నారు. 1987 - 92 మధ్య రాష్ట్రపతిగా పని చేసిన ఆర్ వెంకట్రామన్ హయాంలోనే సంకీర్ణ ప్రభుత్వాల పాలన మొదలైంది. రాజీవ్‌గాంధీ 1989 ఎన్నికల్లో పరాజయం పాలు కాగా వి.పి.సింగ్ ప్రధాని అయ్యారు. ఆయన ప్రభుత్వం పతనం కావడంతో చంద్రశేఖర్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం విశేషం. దక్షిణాది రాష్ట్రాల నాయకులు ఈ అత్యున్నత రాజ్యాంగ పదవిని అందుకుని తమ తమ ముద్రలు వేశారు. తమిళనాడు నుంచి ఏకంగా ముగ్గురు (సర్వేపల్లి రాధాకృష్ణన్, ఆర్.వెంకట్రామన్, అబ్దుల్ కలాం) ఎన్నికయ్యారు. కేరళ నుండి కే. ఆర్.నారాయణన్ తొలి దళిత రాష్ట్రపతికి రాష్ట్రపతి భవన్ లో అడుగు పెట్టారు. కాగా ఉమ్మడి అంధ్రప్రదేశ్ నుండి నీలం సంజీవరెడ్డి రెండు సార్లు దేశ అత్యున్నత పదవికి పోటీ చేసి ఒక్కసారి విజయం సాధించారు. వెంకట రామన్ రచనల్లో ప్రసిద్ధి చెందినది "మై ప్రెసిడెన్సియల్ ఇయర్స్". వెంకట రామన్ 98 సంవత్సరాల వయసులో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. అవయవాల వైఫల్యం కారణంగా 2009 జనవరి 27న న్యూఢిల్లీలోని ఆర్మీ రీసెర్చ్ అండ్ రిఫరల్ హాస్పిటల్ లో మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# అజరామరం ఆ గానం - డిసెంబర్ 4... ఘంటసాల జయంతి





భారతావనిలో ఎందరో గాయకులు ఉద్భవించారు. ఎందరో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. కాని సంగీత ప్రియుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొందిన ఘనత ఘంటసాల మాస్టారుకే దక్కుతుంది. ప్రముఖ గాయకులుగా, తెలుగు సినీ సంగీత దర్శకులుగా, జైలు కెళ్ళిన స్వాతంత్ర్య సమర యోధులుగా ఎనలేని కీర్తినార్జించిన గాన గంధర్వుడు తెలుగువాడు కావడం గర్వకారణం. 1922 డిసెంబర్ 4న గుడివాడ సమీప చౌటపల్లి గ్రామంలో ఘంటసాల సూర్యనారాయణ, రత్నమ్మలకు జన్మించిన వేంకటేశ్వరరావు నామాంకితుడైన ఘంటసాల, బాల్యం నుండే సంగీతం పట్ల మక్కువ కలిగి ఉన్నారు. కచేరీలలో తండ్రి మృదంగం సహకారం అందించడానికి వెళుతూ, కుమారుడిని భుజంపై ఎత్తుకుని పాటలు పాడుకుంటూ తీసుకెళ్ళేవారు. కచేరీలలో నాట్యం చేస్తూ, బాల భరతుడు అనిపించు కున్నారు, తాము గొప్ప సంగీత విద్వాంసుడు కావాలనే తమ 11వ ఏట మరణించిన తండ్రి ఆకాంక్షను సాకారం చేయ దృఢ సంకల్పులై, ఒకసారి ఒక సంగీత కచేరీలో పోటీపడి ఓటమి చెందగా, పట్టుదల మరింత పెరిగి, గురుకులాలలో చేరి, కట్టుబాట్లకు తట్టుకోలేక తిరిగి వచ్చేసారు. కొందరు విద్వాంసుల ఇళ్ళల్లో బట్టలుతికి, వంటచేసి, సంగీతా భ్యాసం చేసి, తర్వాత తమ దగ్గరున్న నలభై రూపాయల విలువైన బంగారు ఉంగరాన్ని కేవలం ఎనిమిది రూపాయలకే విక్రయించి, ఆంధ్రరాష్ట్రంలోని ఏకైక సంగీత కళాశాల ఉన్న విజయ నగరానికి చేరుకున్నారు. రోజుకో ఇంటిలో భోజనం చేస్తూ, జోలెకట్టి అడుక్కుంటూ, ఎల్లమ్మ గుడిలో తల దాచుకున్న ఘంటసాలను పట్రాయని సీతారామశాస్త్రి యాదృచ్ఛికంగా చూడడం, తన ఇంట ఉచితంగా శిక్షణ నివ్వడానికి శాస్త్రి అంగీకరించడం ఘంటసాల జీవితాన్ని మలుపు తిప్పిన సంఘటన. పేదవాడైన శాస్త్రి, ఘంటసాలకు మధూకర (ఉంఛ వృత్తి) నేర్పించారు. తర్వాత కళాశాలలో చేరి, 4ఏళ్ళ కోర్సును రెండేళ్లకే పూర్తి చేశారు. కొన్నాళ్ళు విజయ నగరంలో కచేరీలు చేసి స్వగ్రామం చౌటపల్లికి చేరుకుని, ఉత్సవాలలో, వివాహ తదితర సందర్భాలలో గాన కచేరీలు చేసి, పాఠాలు నేర్పారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని, రెండేళ్ళు అలీపూర్ జైల్లో కఠిన కారాగార శిక్ష అనుభవించారు. 1944 మార్చి 4న తమ మేనకోడలు సావిత్రిని పరిణయమాడారు. తమ వివాహ సందర్భంలో స్వయంగా సంగీత కచేరీ చేశారు. అత్తవారి ఊరిలో సముద్రాల రాఘవాచారిని కలవగా, ఆయన సూచనపై, రెండు మాసాలు కచేరీలు చేసి, సమకూర్చుకున్న డబ్బుతో, అప్పు చేసి మద్రాసుకు చేరుకున్నారు. రాఘవాచారి ద్వారా నాటి సినీ ప్రముఖులైన చిత్తూరు నాగయ్య, బి.ఎన్.రెడ్డిల సమక్షంలో పాటలు పాడి, ప్రశంసాపాత్రు లైనారు. పానగల్ పార్కులో నిద్రిస్తూ సముద్రాల చొరవతో మద్రాసు రేడియో కేంద్రంలో లలిత సంగీత గాయకునిగా అవకాశం పొందారు. కొన్ని గీతాలు రచించి, స్వరకల్పన చేసి, స్టేషన్ ద్వారా పాడారు. తర్వాత కాలంలో భువన విజయం పేరుతో వాటిని గ్రంథస్థం గావించారు. సినిమాలలో చిన్నచిన్న వేషాలు వేసారు. "స్వర్గసీమ" చిత్రంలో తొలిసారి నాగయ్య, బి.ఎన్.రెడ్డిలు అవకాశం ఇవ్వగా, భానుమతితో పాడిన పాటకు 118 రూపాయల పారితోషికం పొందారు. భానుమతి రామకృష్ణలు తీసిన రత్నమాల చిత్ర సహాయ సంగీత దర్శకత్వ అవకాశం పొంది, తర్వాత బాలరాజు, మనదేశం లకు సంగీత దర్శకులైనారు. 1951లో విడుదలైన "పాతాళ భైరవి" ఘన విజయం ఘంటసాలకు ఎనలేని పేరు తెచ్చి పెట్టింది. మల్లీశ్వరి తర్వాత 1953లో దేవదాసు, 55లో అనార్కలి, 57లో మాయాబజార్ లాంటి హిట్ సినిమాలు ఘంటసాలను సాటిలేని మేటి గాయకునిగా నిలబెట్టాయి. 1970 వరకూ హీరో లకు, విలన్లకు, కమేడియర్లకు పాడిన ప్రతి పాటా మాస్టరుదే కావడంతో ఆయన సినీ సంగీత సామ్రాజ్యానికి మకుటం లేని మహారాజయ్యారు. 1970లో పద్మశ్రీ పురస్కారం గ్రహించారు. 71లో ఐరోపా, అమెరికాలలో ప్రదర్శనలు నిర్వహించారు. ఆరోగ్యం క్రమేపీ క్షీణించి చివరకు 1974 ఫిబ్రవరి 11న యావదాంధ్ర సంగీత ప్రియులను శోకసంద్రంలో ముంచి, స్వర్గస్తులైనారు. కరుణశ్రీ, జాషువా, మల్లాది రామకృష్ణశాస్త్రి వంటి వారి ప్రశంసలకు పాత్రులై, వారి రచనలను వీధి పాటలుగా, నూతన ఒరవడితో శైలితో పద్యాలుగా, సామాన్య జన బాహుళ్యానికి అందుబాటులోకి తెచ్చిన ఘనత మాస్టారుదే. సాంప్రదాయ సంగీతానికి భంగం వాటిల్ల నీయకుండా, సామాన్య సంగీత ప్రియులకు సైతం హృదయ రంజకంగా పాడిన "శేషశైలావాసా", "ఏడు కొండ స్వామి", రహస్యం, లవకుశ, నర్తనశాల, ఒకటేమిటి పాడిన పాటలెన్నో పండిత పామర ప్రశంసాపాత్రాలైనాయి. జన్మతః లభ్యమైన సుమధుర గంభీర గాత్రంతో గానం చేసిన "భగవద్గీత అజరామర సుస్వరాన్ని కలిగిన ఘంటసాలను అనునిత్యం స్మరణీయునిగా చేస్తూనే ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# తెలుగు నవలా సాహిత్య వైతాళికుడు ఉన్నవ

## - డిసెంబర్ 4... ఉన్నవ లక్ష్మీనారాయణ జయంతి




గాంధేయ వాదిగా, న్యాయవాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధుడుగా, ఉద్యమ నాయకునిగా, స్త్రీ విద్య ప్రోత్సాహికునిగా, కాంగ్రెస్ నేతగా, దళిత జనోద్ధారకునిగా, ప్రధానంగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా ఉన్నవ లక్ష్మీనారాయణ తెలుగు వారికి సుపరిచితుడే. ముఖ్యంగా నాటి సాంఘిక దురాచారాలను ప్రతిబింబించే, మాలపల్లి నవల నాడు ఒక సంచలనమే. సాంఘిక, ఆర్థిక అసమానతలను తొలగించి, కులవ్యవస్థను నిరసించి, అందరూ సమానులే అన్న భావనతో, అగ్రవర్ణాలు, హరిజనులు అందరూ కలసి మెలసి ఉండాలని కోరుకుంటూ, మాలపల్లి అనే విప్లవాత్మకమైన నవలను రచించడం, తన దృక్పథానికి మద్దతుగా, సహ పంక్తి భోజనాలు నిర్వహించడం ఆ రోజులలో సాహసమే. మాలపల్లి తెలుగు సాహితీ చరిత్రలోనూ, సామాజిక దృక్పథంలోనూ ఒక నూతన ఒరవడిని సృష్టికి, చర్చోప చర్చలకు కారణభూతమైంది. ఉన్నవ లక్ష్మీనారాయణ గుంటూరు జిల్లా అప్పటి సత్తెనపల్లి తాలూకా వేములూరుపాడు గ్రామంలో 1877 డిసెంబరు 4వ తేదీన శ్రీరాములు, శేషమ్మ దంపతులకు జన్మించి, ప్రాథమిక విద్య స్వగ్రామంలోనే సాగించాడు. 1897లో గుంటూరులో మెట్రిక్యులేషన్ చదివాడు. 1906లో రాజమండ్రి ఉపాధ్యాయ శిక్షణా కళాశాలలో శిక్షణ పొందాడు. 1916లో బర్లాండ్, డబ్లిన్ ?లలో బారిష్టర్ చదువు సాధించాడు. గాంధేయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధుడుగా, తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా విశేషమైన కీర్తి పొంది, సాహిత్యం ద్వారా హరిజనోద్ధరణకు కృషి చేశాడు. గుంటూరులో శ్రీ శారదా నికేతన్ ను స్థాపించి, స్త్రీ విద్యను ప్రోత్సహించాడు. కందుకూరి వీరేశలింగం పంతులు అధ్యక్షతలో తొలి వితంతు వివాహం జరిపించిన సంస్కర్తగా నిలిచాడు. 1900 లో గుంటూరులో ''యంగ్?మెన్స్ లిటరరీ అసోసియేషన్?''ను స్థాపించాడు. 1902లో అక్కడే వితంతు శరణాలయాన్ని స్థాపించాడు. వీరేశలింగం స్థాపించిన వితంతు శరణాలయాన్ని 1906 లోను, పూనాలోని కార్వే మహిళా విద్యాలయాన్ని, 1912 లోను సందర్శించి అనుభవాలను లక్ష్యానికి జోడించారు. 1913 లో జొన్నవిత్తుల గురునాథంతో కలసి విశాలాంధ్ర పటం తయారు చేశాడు. లక్ష్మీనారాయణ 1900లో గుంటూరులో ఉపాధ్యాయ వృత్తి, 1903లో అక్కడే న్యాయవాద వృత్తిని, 1908లో ర్యాలీ కంపెనీలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించాడు. రష్యాలో 1917లో జరిగిన బోల్షవిక్ విప్లవం వల్ల స్ఫూర్తి పొందిన మొదటి తెలుగు కవి ఉన్నవ. కూలీల పక్షం వహించి కవులు రచనలు చేయడానికి ప్రేరణ నిచ్చింది సదరు రష్యా విప్లవ ప్రభావమే.1917 లో మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశాడు. 1922లో గుంటూరులో శారదానికేతన్?ను స్థాపించి బాలికలకు విద్య నేర్చుకునే అవకాశం కల్పించాడు. 1922 లో మాలపల్లి నవలను బెల్లంకొండ రాఘవరావు ముద్రించగా, మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై నిషేధం విధించింది. రాజకీయ వాతావరణాన్ని, గాంధీ మహాత్ముని ఆశయాల్ని, తెలుగువారి జీవన విధానాన్ని ప్రతిబింబించిన నవల మాలపల్లి. ఆ నవలలో సాంఘిక దురాచారాలు, జాతీయ సత్యాగ్రహ ఉద్యమాలు, వర్ణ , వర్గ వ్యత్యాసాలు తదితర ఆ నాటి పరిస్థితులను కల గలిపి, కళ్ళకు కట్టినట్లు ఉన్నవ చిత్రించడం విశేషం. ఆనాడు హరిజనుల కుటుంబ గాథను ఇతివృత్తంగా ఎన్నుకొని నవల వ్రాయడమే సాహసం. 1926 లో మద్రాసు శాసన మండలిలో మాలపల్లి నిషేధంపై చర్చలు జరగడం, 1928 లో కొన్ని మార్పులతో మాలపల్లి ప్రచురణకు తిరిగి అనుమతి లభించడం, మద్రాసు ప్రభుత్వం ఆంధ్ర విశ్వ విద్యాలయం మాలపల్లిని ప్రచురించి, ఆ నవలను పాఠ్య గ్రంథంగా ఎంపిక చేయడం, 1936 లో మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై రెండోసారి నిషేధం తెలిపి ఆ నవలను పాఠ్యగ్రంథంగా తొలగించడం, 1937లో చక్రవర్తుల రాజగోపాలా చారి మద్రాసు ప్రధానిగా ఎన్నికైనప్పుడు తొలి కాంగ్రెసు మంత్రి వర్గంచే మాలపల్లి నవలపై నిషేధపు ఉత్తర్వులను రద్దు చేయించడం క్రమానుగతంగా జరిగి పోయాయి. సామాన్య ప్రజల సంక్షేమం, అభ్యుదయాన్ని కోరే కవిత్వం ప్రజలకు సులభంగా అర్థమయ్యే వాడుక భాషలో ఉండాలన్న లక్ష్యంతో మాలపల్లి నవలలో చరమగీతం, సమతాధర్మం అనే రెండు గేయ కవితల్ని సామాన్య ప్రజలకు అర్థమయ్యే నిత్య వాడుక భాషలో జానపద గేయ రీతుల్లో రచించాడు. ఆ నవలకు కాశీనాథుని నాగేశ్వరరావు పీఠిక వ్రాస్తూ, "ఆంధ్ర సాహిత్య హృదయ పరిణామాన్ని గ్రహించడానికి మాలపల్లి ఉత్తమ కావ్యం అని, తెనుగు మాటలు, తెనుగు దేశము, తెనుగు హృదయము, తెనుగు సంకల్పము, మాలపల్లి నవలకు అనిర్వచనీయ ప్రతిభను సమకూర్చాయి" అని కొనియాడాడు. అందుకే తెలుగు సాహిత్యంలో వచ్చిన తొలి విప్లవ నవలగా గుర్తింపు పొందింది. మాలపల్లి, నాయకురాలు, బుడబుక్కల జోస్యం, స్వరాజ్య సోది, భావ తరంగాలు తదితర రచనలు చేశాడు. ఇక 1923 లో కాంగ్రెసు స్వరాజ్య పార్టీలో చేరాడు. ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటీ కార్యదర్శిగా ఎన్నికై, పల్నాడు సత్యాగ్రహ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. 1931లో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో చేరినందుకు, 1942 లో క్విట్ ఇండియా ఉద్యమంలో చేరినందుకు జైలు శిక్ష అనుభవించాడు. గాంధేయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధునిగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా కీర్తి పొందిన ఉన్నవ 1958 సెప్టెంబరు 25 న మరణించాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# చురకలు


## సంపాదకీయం

# పెట్రోల్.. రూపాయి..

## చరిత్రలో మోడీని మర్చిపోరంతే!

మెరుపులు ఎన్ని సాధించినా..కొన్ని మరకలు వాటిని మాత్రం ప్రత్యేకంగా కనిపించేలా చేస్తుంటాయి. ఎంతటి తెల్ల వస్త్రమైనా సరే.. చిన్నపాటి మరకను ప్రత్యేకంగా.. హైలెట్ అయ్యేలా చేస్తుంది. స్వతంత్ర్య భారతంలో అరుదైన పాలనా విషయానికి వస్తే సమకాలీన కాలంలో తిరుగులేని రికార్డును క్రియేట్ చేసినోళ్లలో ప్రధానమంత్రి మోడీనే కనిపిస్తారు. ముచ్చటగా మూడు సార్లు ప్రధానమంత్రిగా బాధ్యతల్ని నిర్వహిస్తున్న ఆయన.. తన ప్రభుత్వ హయాంలో రెండు మరకల్లాంటి ఘటనల్ని నమోదు చేసుకున్నారు. అందులో ఒకటి పెట్రోల్ అయితే రెండోది రూపాయి మారక విలువ. విచిత్రంగా ఈ రెండు అంశాలు సంపన్నుడి మొదలు సామాన్యుడి వరకు అందరూ ప్రభావితం అయ్యేవే. క్రూడాయిల్ ధర గరిష్ఠంగా నమోదైన వేళలోనూ నాటి ప్రభుత్వాలు పెట్రోల్.. డీజిల్ ధరల విషయంలో ఆచితూచి అన్నట్లుగా వ్యవహరించేవి. కానీ.. మోడీ సర్కారు మాత్రం అలాంటి మొహమాటాలకు పోలేదు. క్రూడాయిల్ ధరలు కనిష్ఠంగా ఉన్న రోజుల్లోనూ ధరలు తగ్గని పరిస్థితి. లీటరు పెట్రోల్ ధర వందరూపాయిల మార్కును టచ్ చేసింది 2021 ఫిబ్రవరి 17న. అది కూడా రాజస్థాన్ లోని శ్రీగంగానగర్ పట్టణంలో. దీనికి కారణం.. పెట్రోల్, డీజిల్ ధరల విషయానికి వస్తే ఆయా రాష్ట్రాలు అనుసరించే రాష్ట్ర పన్నుల (వ్యాట్) ఆధారంగా అన్నది తెలిసిందే. రాజస్థాన్ లోని శ్రీగంగా నగర్ లో పెట్రోల్ లీటరు ధర రూ.100 చేరుకున్న తర్వాత దేశంలోని నాలుగు ప్రధాన మెట్రో నగరాలైన ముంబయిలో (మే 29, 2021), చెన్నైలో (జులై 2, 2021), ఢిల్లీ.. కోల్ కతాలలో 2021 జులై నాటికి రూ.100 మార్కును టచ్ చేసింది. లీటరు పెట్రోల్ రూ.100 చేరుకోవటానికి ముందు రూ.75 మార్క్ ను 2018 మేలో టచ్ చేస్తే.. రూ.90 మార్కును 2021 ఫిబ్రవరి వరకు పట్టింది. అంటే లీటరు పెట్రోల్ రూ.75 నుంచి రూ.90 చేరుకోవటానికి సుమారు 2 సంవత్సరాల 9 నెలలు పట్టింది. అదే సమయంలో లీటరు పెట్రోల్ రూ.90 నుంచి రూ.100 చేరుకున్న వైనం చూస్తే.. 2021 ఫిబ్రవరిలో రూ.90గా ఉన్న లీటరు పెట్రోల్.. 2022 మార్చి నాటికి రూ.100 మార్కును టచ్ చేసింది. అంటే రూ.90 నుంచి రూ.100 చేరుకోటానికి ఒక ఏడాది ఒక నెల పట్టింది. సింపుల్ గా చెప్పాలంటే 13 నెలల సమయం తీసుకుంది. పెట్రోల్ సంగతి ఇలా ఉంటే డాలర్ తో రూపాయి మారకం విలువను తీసుకుంటే.. అంతకంతకూ బక్కచిక్కిపోతున్న రూపాయి కనిపిస్తుంది. డాలర్ తో రూపాయి మారకం విలువ తొలిసారి రూ.50 మార్కును టచ్ చేసింది 2008లో. ప్రపంచ ఆర్థిక సంక్షోభ వేళలో డాలర్ తో రూపాయి మారకం విలువ భారీగా పడిపోయి తొలిసారి రూ.50కు చేరుకుంది. ఆ తర్వాత కిందకు పైకి లేవటం.. పడిపోవటం లాంటివి జరిగి 2011-12 నాటికి రూపాయి విలువ మళ్లీ పడిపోయి 2012 ప్రారంభంలో రూ.50 మార్కును స్థిరంగా దాటేసింది. అలా పడటం మొదలైన రూపాయి ఒక అమెరికన్ డాలర్ కు రూ.75 మార్కు పడిపోవటానికి దాదాపు ఎనిమిదేళ్ల వరకు పట్టిందని చెప్పాలి. తొలిసారి రూ.75 మార్కుకు కొవిడ్ వేళలో చోటు చేసుకుంది. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి కారణంగా 2020 మార్చిలో రూ.75 మార్కును చట్ చేసింది. రూ.50 నుంచి రూ.75 చేరుకోటానికి అంటే రూ.25 పడిపోవటానికి సుమారు పదేళ్ల సమయం తీసుకుంది. ఇక.. రూ.75 నుంచి రూ.90 చేరుకోటానికి మాత్రం ఐదేళ్ల సమయం తీసుకుంది. తాజాగా ఒక డాలర్ తో రూపాయి మారకం విలువ రూ.90 మార్కును టచ్ చేసి.. రూపాయి జీవిత కాలం కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఇలాంటి వేళలోనే డాలర్ తో రూపాయి మారకం విలువ రూ.100 మార్కును చేరుకుంటుందా? ఆ పరిస్థితి ఎప్పటికి ఏర్పడుతుందన్న ఆలోచనలు మొదలవుతాయి. అయితే.. రూ.90 మార్కును టచ్ చేసిన వేళ.. రూపాయి మరింత బక్కచిక్కకుండా ఉండేందుకు ఆర్ బీఐ చర్యలు తీసుకోవటంతో పాటు.. వేగంగా పడిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకునే వీలుందని మాత్రం చెప్పక తప్పదు. ఆర్థిక రంగ నిపుణుల అంచనా ప్రకారం వచ్చే ఏడాది (2026)లో డాలర్ తో రూపాయి మారకం విలువ రూ.92 వరకు చేరుకోవచ్చునిన చెబుతున్నారు. మరి.. వంద మాటేమిటి? అంటే.. కనీసం 2030 వరకు సమయం తీసుకుంటుందని చెబుతున్నారు. అనూహ్య రీతిలో ఏమైనా ప్రపంచ ఆర్థిక సంక్షోభం లాంటివి.. దేశీయ ఆర్థిక వ్యవస్థలో అనూహ్యమైన ప్రతికూల పరిణామాలు చోటు చేసుకుంటే తప్పించి వందకు చేరుకోవటానికి మాత్రం 2030 వరకు టైం తీసుకుం టుందని చెప్పక తప్పదు. మోడీ సర్కారు 2029 మే వరకు అధికారంలో ఉంటుంది. మరి.. ఆయన హయాంలోనే వందను టచ్ అయితే మాత్రం పెట్రోల్.. రూపాయి మారకం విలువలో సెంచరీ దాటేసిన మరక మాత్రం ఆయన మూటగట్టుకోవటం ఖాయమని చెప్పక తప్పదు.

# శత వసంతాల మాలపల్లి నవల - డిసెంబర్ 4... ఉన్నవ లక్ష్మీనారాయణ జయంతి సందర్భంగా...




గాంధేయ వాదిగా, న్యాయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధుడుగా, ఉద్యమ నాయకునిగా, స్త్రీ విద్య ప్రోత్సాహికునిగా, కాంగ్రెస్ నేతగా, దళిత జనోద్ధారకునిగా, ప్రధానంగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా ఉన్నవ లక్ష్మీ నారాయణ తెలుగు వారికి సుపరిచితుడే. ముఖ్యంగా నాటి సాంఘిక దురాచారాలను ప్రతిబింబించే, మాలపల్లి నవల నాడు ఒక సంచలనమే. సాంఘిక, ఆర్థిక అసమానతలను తొలగించి, కుల వ్యవస్థను నిరసించి, అందరూ సమానులే అన్న భావనతో, అగ్రవర్ణాలు, హరిజనులు అందరూ కలసి మెలసి ఉండాలని కోరుకుంటూ, "మాలపల్లి" అనే విప్లవాత్మకమైన నవలను రచించడం, తన దృక్పథానికి మద్దతుగా, "సహ పంక్తి భోజనాలు" నిర్వహించడం ఆ రోజులలో సాహసమే. మాలపల్లి తెలుగు సాహితీ చరిత్రలోనూ, సామాజిక దృక్పథంలోనూ ఒక నూతన ఒరవడిని సృష్టికి, చర్చోప చర్చలకు కారణభూతమైంది. ఒక దళిత కుటుంబం సమా జంలో కలిసి మెలసి ఉండడానికి చేసే ప్రయత్నం, సదరు ప్రయత్నంలో ఎదురైన చేదు అనుభవాలు, ఆ అనుభవాలతో రాటుదేలిన వ్యక్తులు చైతన్యమై సంఘటి తమై సమాజంలో నిర్లక్షం చేయబడ్డ తమ ఉనికి కోసం, మెరుగైన స్థానం కోసం చేసే పోరాటాలు వంటి అంశాలతో మాలపల్లి నవలలోని పాత్రలు ఉదాత్తంగా చిత్రీకరించ బడ్డాయి. సామాజిక మార్పు కోసం బలహీన దళిత, పీడిత వర్గాలు చైతన్యంతో సుసంఘ టితం కావాలని, పోరాటా లకు సిద్ధపడాలని మాలపల్లి ప్రబోధించింది. 1922లో పల్నాడు పుల్లరి సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయి రాయ వెల్లురు జైలుకు ఉన్నవ లక్ష్మీనారాయణ తరలించ బడిన సమయం లోనే అక్కడే తన లక్ష్య సాధనకై విప్లవాత్మకమైన తెలుగు నవలా సాహిత్యంలో చిరస్మరణీయమైన 'మాలపల్లి' నవలను ఆయన రచించారు. మాలపల్లి నవల దళిత కుటుంబాన్ని ప్రధాన కథాశంగా రచించిన తొలి రాజకీయ నవల. 1922 లో మాలపల్లి నవలను బెల్లంకొండ రాఘవరావు ముద్రించగా, మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై నిషేధం విధించింది. రాజకీయ వాతావర ణాన్ని, గాంధీ మహాత్ముని ఆశయాల్ని, తెలుగువారి జీవన విధానాన్ని ప్రతిబింబించిన నవల మాల పల్లి. ఆ నవలలో సాంఘిక దురాచారాలు, జాతీయ సత్యాగ్రహ ఉద్యమాలు, వర్ణ , వర్గ వ్యత్యాసాలు తదితర ఆ నాటి పరిస్థితులను కల గలిపి, కళ్ళకు కట్టినట్లు ఉన్నవ చిత్రించడం విశేషం. ఆనాడు హరిజనుల కుటుంబ గాథను ఇతివృత్తంగా ఎన్నుకొని నవల వ్రాయడమే సాహసం. 1926 లో మద్రాసు శాసన మండలిలో మాలపల్లి నిషేధంపై చర్చలు జరగడం, 1928 లో కొన్ని మార్పులతో మాలపల్లి ప్రచురణకు తిరిగి అనుమతి లభించడం, మద్రాసు ప్రభుత్వం ఆంధ్ర విశ్వ విద్యాలయం మాలపల్లిని ప్రచురించి, ఆ నవలను పాఠ్య గ్రంథంగా ఎంపిక చేయడం, 1936 లో మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై రెండోసారి నిషేధం తెలిపి ఆ నవలను పాఠ్య గ్రంథంగా తొలగించడం, 1937లో చక్రవర్తుల రాజగోపాలాచారి మద్రాసు ప్రధానిగా ఎన్నికైనప్పుడు తొలి కాంగ్రెసు మంత్రి వర్గంచే మాలపల్లి నవలపై నిషేధపు ఉత్తర్వులను రద్దు చేయించడం క్రమానుగతంగా జరిగి పోయాయి. సామాన్య ప్రజల సంక్షేమం, అభ్యుదయాన్ని కోరే కవిత్వం ప్రజలకు సులభంగా అర్థమయ్యే వాడుక భాషలో ఉండాలన్న లక్ష్యంతో మాలపల్లి నవలలో చరమ గీతం, సమతా ధర్మం అనే రెండు గేయ కవితల్ని సామాన్య ప్రజలకు అర్థమయ్యే నిత్య వాడుక భాషలో జానపద గేయ రీతుల్లో రచించాడు. ఆ నవలకు కాశీనాథుని నాగేశ్వర రావు పీఠిక వ్రాస్తూ, "ఆంధ్ర సాహిత్య హృదయ పరిణామా న్ని గ్రహించడానికి మాలపల్లి ఉత్తమ కావ్యం అని, తెనుగు మాటలు, తెనుగు దేశము, తెనుగు హృదయము, తెనుగు సంకల్పము, మాలపల్లి నవలకు అనిర్వచనీయ ప్రతిభను సమ కూర్చాయి" అని కొనియాడాడు. అందుకే తెలుగు సాహిత్యంలో వచ్చిన తొలి విప్లవ నవలగా గుర్తింపు పొందింది. ఆయన సాహిత్యం ద్వారా హరి జనోద్ధరణకు కృషి చేశాడు. గుంటూరులో శ్రీ శారదా నికేతన్ ను స్థాపించి, స్త్రీ విద్యను ప్రోత్సహించాడు. కందుకూరి వీరేశలింగం పంతులు అధ్యక్షతలో తొలి వితంతు వివాహం జరిపించిన సంస్కర్తగా నిలిచాడు. రష్యాలో 1917లో జరిగిన బోల్షవిక్ విప్లవం వల్ల స్ఫూర్తి పొందిన మొదటి తెలుగు కవి ఉన్నవ. కూలీల పక్షం వహించి కవులు రచనలు చేయడానికి ప్రేరణ నిచ్చింది సదరు రష్యా విప్లవ ప్రభావమే. ఉన్నవ... మాల పల్లి, నాయకురాలు, బుడబుక్కల జోస్యం, స్వరాజ్య సోది, భావ తరంగాలు తదితర రచనలు చేశాడు. గాంధేయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధునిగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా కీర్తి పొందిన ఉన్నవ లక్ష్మీనారాయణ గుంటూరు జిల్లా అప్పటి సత్తెనపల్లి తాలూకా వేములూరు పాడు గ్రామంలో 1877 డిసెంబరు 4న జన్మించి, 1958 సెప్టెంబరు 25 న మరణించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# గురు శ్రేష్ఠుడు దత్తాత్రేయుడు - మార్గశిర పౌర్ణమ దత్త జయంతి

**జటాధరం పాండురంగం**
**శూలహస్తం కృపానిధిం**
**సర్వరోగహరం దేవం**
**దత్తాత్రేయమహంభజే...**

అంటూ దత్తుడు ఆరోగ్య ప్రదాతగా పూజించ బడతాడు. శ్రీ దత్తాత్రేయ స్వామి త్రిమూర్తుల (బ్రహ్మ, విష్ణుమూర్తి, మహేశ్వరుడు) స్వరూపం. గురుతత్వానికి మొదటివాడు అవడంవల్ల ఈయనకు ఆదిగురువనే పేరు ఉంది. తమ పరీక్షలో నెగ్గిన అనసూయ త్రిమూర్తులు తనకు బిడ్డలుగా పుట్టాలని కోరిన విధంగా త్రిమూర్తుల వరం ప్రకారం విష్ణుంశతో మార్గశిర శుద్ధ పౌర్ణమి రోజున అత్రి, అనసూయ దంపతులకు దత్తాత్రేయుడు జన్మించాడు. దత్తా అనే పదానికి "సమర్పించిన" అనే అర్థముంది, త్రిమూర్తులు అత్రి మహర్షి మరియు అనసూయ దంపతులకు పుత్రుడి రూపంలో తమను తాము "సమర్పించు కున్నారు" కనుక అతడికి దత్తా అని పేరు వచ్చింది. ఇతడు అత్రి కుమారుడు కాబట్టి తన పేరు "ఆత్రేయ" అయింది. ఆయన ఎందరో మహా పురాణపురుషులకు, దేవతలకు జ్ఞానబోధ, సహాయము చేసిన ఉదాహరణలు వివిధ పురాణాలలో ప్రస్తావించ బడ్డాయి. శ్రీమహావిష్ణువు ఇరవై ఒక్క అవతారాలలో ఆరవది దత్తాత్రేయ అవతారమని శ్రీమద్భాగవతం చెబుతోంది. దత్తాత్రేయుడు శ్రీమన్నారాయణుడి అవతారమని భాగవతం మరియు విష్ణుపురాణం ఘోషిస్తున్నాయి. అత్రి మహర్షి, అనసూయ దంపతుల తనయుడిగా జన్మించాడు దత్తాత్రేయుడు. ఆ దంపతులు ఓంకారాన్ని ధ్యానిస్తూ మహాతపస్సు చేశారు. ఆ సాధనకు మెచ్చి ఓ దివ్య తేజస్సు ప్రత్యక్షమైంది. ఆ కాంతిపుంజంలో త్రిమూర్తులు దర్శనమిచ్చారు. ఆ ముగ్గురు మూర్తుల అంశగా దత్తుడు వారికి జన్మించాడు. అత్రి...అంటే త్రిగుణాతీత స్థితికి చేరుకున్నవాడని అర్థం. అతడి అర్ధాంగి అనసూయ...అసూయ లేనిది. నిజానికి ఇవి పేర్లు కాదు...ఆ ఆలుమగల సుగుణాలు. ఆ సద్గుణ సంపన్నుల బిడ్డగా జన్మించాడు దత్తుడు. దత్తుడిది జ్ఞానావతారం. మహాభారతంలో దత్తాత్రేయుడు అత్రి పుత్రుడిగా కాకుండా అత్రి మహర్షి వంశ వృక్షంగా ప్రస్తావించ బడతాడు . మాఘ కవి రచించిన శిశుపాల వధ కావ్యం కూడా దత్తాత్రేయుని అత్రి పుత్రుడిగా కాకుండా అత్రి వంశవృక్షంగా పేర్కొంటోంది. కార్తవీర్యార్జునుడికీ, పరశు రాముడికీ, యదువంశ మూల పురుషుడు యదువుకూ...ఇలా ఎంతోమందికి జ్ఞానాన్ని బోధించాడు దత్తగురుడు. దత్తజయంతినాడు ఆస్తికులు...జప తపాలతో, పూజలతో గడుపుతారు. పగలంతా ఉపవాసం చేసి, సాయంత్రం భజనలూ సత్సంగాలూ నిర్వహించు కుంటారు. దత్తచరిత్ర, అవధూత గీత తదితర గ్రంథాల్ని పారాయణ చేస్తారు. 'ఆది గురువు' అని పురాణ గ్రంథాల, గురుచరిత్ర'ల ప్రకారం, అయిదు దత్తాత్రేయ అవతారాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. షిరిడీ సాయిబాబా ని దత్తాత్రేయ అవతారంగా భావిస్తారు. అలాగే

**శ్రీపాద వల్లభుడు...** శ్రీపాద వల్లభ స్వామి దత్తాత్రేయుడి తొలి అవతార మనీ, ఆయన 13వ శతాబ్దం నాటి వాడనీ ప్రతీతి. అప్పలరాజు శర్మ, సుమతి దంపతులకు ఆంధ్రప్రదేశ్‌లోని పిఠాపురంలో జన్మించిన శ్రీపాద వల్లభుడు పదహారేళ్ళ వయసులో కురువ పురానికి చేరి, ఆ ప్రాంతాన్నే తన కార్యక్షేత్రంగా చేసుకున్నారనీ, కృష్ణా తీరంలోనే అవతార సమాప్తి చేశారనీ గురుచరిత్రలు చెబుతున్నాయి. దేశంలోని మూడు గయ క్షేత్రాల్లో పాదగయ పిఠాపురంలో ఉంది. అంతేకాదు, అష్టాదశ శక్తి పీఠాల్లో పురుహూతికా పీఠం కూడా ఇక్కడే ఉంది.

**శ్రీ నరసింహ సరస్వతి...** దత్తాత్రేయుడి రెండవ అవతారంగా భక్తులు పూజించే శ్రీ నరసింహ సరస్వతి మహారాష్ట్రలోని కరంజ గ్రామంలో జన్మించారు. ఆయన 1378-1459 మధ్య జీవించినట్టు చెబుతారు. ఎనిమిదేళ్ళ వయసులో సన్యాసాశ్రమం స్వీకరించిన నరసింహ సరస్వతి జీవిత గాథనూ, ఆయన మహిమలనూ ఆయన శిష్యుడు శ్రీ సిద్ధ సరస్వతి 'శ్రీ గురు చరిత్ర'గా రాశారు. దాన్ని గంగాధర సరస్వతి మరాఠీలోకి అనువదించారు. అనేక భాషల్లోకి అనువాదమైన ఈ రచన దత్త భక్తులకు నిత్య పారాయణ గ్రంథం. మహారాష్ట్రలోని గంధర్వపురం (గాణగాపురం)లో నివసించిన నరసింహ సరస్వతి శ్రీశైలం వద్ద కృష్ణా నదిలో అంతర్ధాన మయ్యారట. భీమ-అమరజ నదీ సంగమ స్థలమైన గాణగాపురం దత్త క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది.

**శ్రీ స్వామి సమర్థ...** అక్కల్‌కోట మహారాజ్‌గా ప్రాచుర్యం పొందిన శ్రీ స్వామి సమర్థను అపర దత్తావతారంగా భక్తులు పూజిస్తారు. భారతదేశంలోని వివిధ పుణ్య క్షేత్రాలనే కాకుండా, నేపాల్, చైనా, టిబెట్ లను కూడా ఆయన సందర్శించారని కథనాలు. సన్నిహితులైన భక్తులకు వారి వారి అభీష్టాలను అనుసరించి ఆయన దర్శనమిచ్చే వారట. 1856లో మహారాష్ట్రలోని అక్కల్ కోట చేరుకున్న స్వామి సమర్థ 1878లో పరమపదించే వరకూ అక్కడే గడిపారు. అక్కల్‌కోటలోని ఆయన సమాధి, ఆలయం ఆరాధనీయ స్థలాలుగా ఉన్నాయి.

**శ్రీ మాణిక్య ప్రభు...** సాధువు, వేదాంతి, కవి అయిన మాణిక్య ప్రభువు ఆధ్యాత్మిక ఐక్యతను బోధించిన దత్తాత్రేయ అవతారంగా పూజలందు కుంటున్నారు. 1817లో కర్నాటకలోని బసవ కల్యాణ



సమీపంలో ఉన్న లదవంతిలో ఆయన జన్మించారు. దేశమంతటా ఆధ్యాత్మిక యాత్రలు సాగించిన ఆయన చివరికి మాణిక్‌నగర్ చేరుకొని, 1865లో అవతార సమాప్తి వరకూ తన శేష జీవితాన్ని అక్కడే గడిపారు. అక్కడ ఆయన దర్బారు, మహా సమాధి ఉన్నాయి. మతాలన్నీ ఒక్కటే అని చాటిన ఆయన ప్రతి రోజూ దర్బార్ నిర్వహించి, భక్తుల సందేహాలను తీర్చేవారు. మార్గశిర శుక్ల పక్ష చలి కాలం పిత్త ప్రాధాన్యత కలిగి, అజీర్ణ సంబంధమ్కెన రోగాలు ఎక్కువగా వస్తాయి. ఇది పగలు తక్కువ, రాత్రి ఎక్కువగా ఉండేకాలం. కావుననే ఈ కాలంలో వ్రతాచరణ పేరుతో మన పెద్దలు ఉపవాసాలు విధించారు. ఆ ఆచరణలో భాగంగానే దత్త నవరాత్రులు, దత్తజయంతి జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# తీర ప్రాంత పరిరక్షణలో నౌకాదళ అసమాన సేవలు - డిసెంబర్ 4...భారత దేశ నౌకాదళ దినోత్సవం




భారత దేశములో నౌకాదళ దినో త్సవం ప్రతి సంవత్సరం డిసెంబరు 4 వ తేదీన జరుపు తారు. 1971 డిసెంబరు 4న భారత నేవీ, పాకి స్తాన్ అతిపెద్ద నౌకాశ్రయం అయిన కరాచి పోర్టుపై మెరుపు దాడి చేసి మూడు ఓడలను ముంచి వేసింది. రాత్రి సమయంలో భారత్ చేసిన ఈ దాడిని ఆపరేషన్ ట్రైడెంట్ అని అంటారు. దాని జ్ఞాపకార్థం, భారత దేశంలో నౌకాదళ దినోత్సవం ను జరుపుకుంటారు. నౌకా దళాల విజయాలు, దేశ రక్షణలో వారి పాత్రను గుర్తుచేసు కోవటానికి జరుపు కుంటారు. భారత దేశంలో క్రి.పూ.2300లో ప్రస్తుత గుజరాత్ లోని మంగ్రోల్ దగ్గర మొట్టమొదటి నౌకాతీరం నిర్మించబడినది. క్రీ.పూ. 4వ శతాబ్దంలో మౌర్య సామ్రాజ్యంలో మొదటిసారి నౌకా విభాగాన్ని ఏర్పరిచారు. చంద్రగుప్త మౌర్యుడి ప్రధానమంత్రి అయిన చాణక్యుడు తాను రచించిన అర్థ శాస్త్రంలో నవాధ్యక్ష పేరుతో నదీ జలాల వినియోగం గురించి నిర్దేశించాడు. బ్రిటిష ప్రభుత్వం భారత దేశాన్ని పాలిస్తున్నప్పుడు 1830లో రాయల్ ఇండియన్ నేవిని ఏర్పరిచారు. ఇది 1946 నాటికి 78 ఓడలు, 2000 మంది నిబ్బంది కలిగి ఉండేది. 26 జనవరి 1950 న భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చిన రోజున నౌకా దళానికి ఇండియన్ నేవీగా, వాహకాలకు ఇండియన్ నావల్ షిప్ గా పేరు పెట్టారు. 1961లో జరిగిన ఆపరేషన్ విజయ్ లోఇండియన్ నేవి మొట్ట మొదటి సారి యుద్ధంలో పాల్గొన్నది. 1965లో జరిగిన భారత్ - పాక్ యుద్ధంలో నేవి ఎక్కువ పాల్గొనక పోయిన తీర ప్రాంతాల పరిరక్షణలో కీలకపాత్ర వహించింది. 1971లో జరిగిన భారత్ - పాక్ యుద్ధంలో నేవి విశిష్టమైన పాత్ర పోషించింది. ఈ యుద్ధంలో పాకిస్తాన్ దగ్గర ఉన్న అత్యంత ప్రమాదకరమైన పి ఎన్ ఎస్ ఘాజి జలాంతర్గామిని ధ్వసం చేసి సముద్రంలో ముంచి వేసిన ఘనత ఐ ఎన్ ఎస్ - రాజ్ పుత్ కు దక్కుతుంది. ఐ ఎన్ ఎస్ నిర్ఘాట్, ఐ ఎన్ ఎస్ నిపత్ లు కరాచీ పోరను చుట్టిముట్టి మిగిలిన పాకిస్తాన్ పోర్టులతో రాకపోకలను, పాక్ సైన్యానికి సహాయాన్ని అడ్డుకొని భారత దేశానికి విజయాన్ని అందించడంలో ముఖ్యపాత్ర వహించాయి. భారతదేశ నావికా దళం భారత సైనిక దళాల యొక్క సముద్ర విభాగం, భారతదేశ రాష్ట్రపతి నౌకాదళానికి సర్వ సైన్యాధ్యక్షుడు. కేవలం దేశ రక్షణకే కాకుండా మానవతా సహాయాలకు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నపుడు సహాయం కొరకు భారత ప్రభుత్వం నేవీని వినియోగిస్తుంది. 2004లో దక్షిణ భారత దేశాన సునామి సంభవించి నపుడు కొద్ది గంటల్లోనే నేవి 27 నౌకలు, 19 హెలికాప్టర్లు, 06 యుద్ధ విమానా నౌకలు, 5000 మంది సిబ్బందితో ముందుగా సహాయ చర్యలు చేపట్టింది. నేవి చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున సహాయ చర్యలు చేపట్టడం ఇదే ప్రథమం. భారత నావికాదళం దేశం యొక్క సముద్ర సరిహద్దులను భద్ర పరచుటలో, ఓడరేవు సందర్శనల ద్వారా, భారతదేశం అంతర్జాతీయ సంబంధాలను విస్తరించుటలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఉమ్మడి వ్యాయా మాలు, మానవతావాద మిషన్లు, విపత్తు ఉపశమనం మొదలైనవి వారి కర్తవ్యాలు. ఆధునిక భారతీయ నౌకాదళం హిందూ మహాసముద్ర ప్రాంతంలో తన స్థానాన్ని మెరుగు పరిచేందుకు వేగవంతమైన పునర్నిర్మాణంలో భాగంగా ఉంది. ఈ నివేదిక ప్రకారం 58,000 మంది సిబ్బంది, విమాన వాహక నౌక, పెద్ద రవాణా ఓడ, 15 యుద్ధ నౌకలు, 8 గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్లు, 24 కొర్వెట్టెలు, 13 సంప్రదాయ జలాంతర్గాములు, 1 అణు దాడి జలాంతర్గామి, 30 పెట్రోల్ ఓడలు, వివిధ సహాయక నౌకలు మొదలైనవి భారత నావికాదళంలో భాగం.భారత నావికా దళంలో తూర్పు కమాండ్ - విశాఖపట్నం, పశ్చిమ కమాండ్ - ముంబాయి దక్షిణ కమాండ్ - కోచి, అండమాన్ నికోబార్ నావల్ - పోర్ట్ బ్లెయిర్ అనే 4 కమాండ్ లు ఉన్నాయి. 1985 నుండి అణు జలాంతర్గాములను నిర్మించడానికి కల్పాక్కం వద్ద ఉన్న అణు కేంద్రంతో కలసి నేవి కృషి చేస్తోంది. 1987లో భారత నౌకా దళంలో జలాంతర్గాముల విభాగాన్ని ఏర్పాటు చేశారు. జలాంత ర్గాముల నుండి టార్పీడో అను క్షిపణులను ప్రయోగిస్తారు.పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన మొట్ట మొదటి సబ్ మెరైన్ - ఐ ఎన్ ఎస్ షల్కి. 8 డిసెంబర్ 1967లో భారత నౌకాదళంలో ప్రవేశపెట్టబడిన తొలి జలాంతర్గామి - ఐ ఎన్ ఎస్ కల్వరి. కల్వరిని భారత నౌకాదళంలో ప్రవేశ పెట్టబడిన రోజైన 08 డిసెంబర్ న జలాంతర్గామి దినంగా భారత నావికాదళం జరుపు కుంటుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# తేమ..ఓ డ్రామా..!

సూర్యాపేట : ఆత్మకూర్(ఎస్) మండలంలో ఓ రైతు పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో 83 క్వింటాళ్ల ధాన్యం విక్రయించారు. సదరు రైతు బ్యాంకు, పట్టా పుస్తకాలు, ఆధార్‌కార్డు నకలును కేంద్రం నిర్వాహకులకు ఇచ్చేందుకు రాగా.. మిల్లర్లు మీ ధాన్యానికి బస్తాకు రెండు కిలోల చొప్పున కోత విధించారని చెప్పడంతో నిర్ఘాంతపోయారు. ఈ లెక్కన 208 బస్తాలకు రెండు కిలోల చొప్పున నాలుగు క్వింటాళు కోతపెట్టారు. వెరసి క్వింటాకు రూ.2,389 చొప్పున రూ.9,556 నష్ట పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో పీఏసీఎస్, ఐకేపీ, మెప్మా ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నారు. సన్న, దొడ్డు రకాలకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేశారు. కోత కొచ్చే సమయంలో వర్షాలతో పైరు నేల వాలి, ధాన్యం కొంత వరకు నల్లగా మారింది. అయినా కష్టనష్టాలకోర్చి పంట కోసి కేంద్రాల్లో రోజుల తరబడి ఆరబోశారు. తేమ 17 శాతం వస్తేనే కొనుగోలు చేస్తున్నారు. తీరా తేమ శాతం వచ్చాక బస్తాల్లో నింపి, లారీలోకి ఎక్కించి మిల్లులకు తరలించి విక్రయించాక అక్కడ మిల్లర్లు ధాన్యం నల్లగా ఉందని, తేమ రాలేదని మళ్లీ కోత పెడుతున్నారు. కేంద్రాల్లో వ్యవసాయ అధికారులు, సెంటర్ నిర్వాహకులు పలుమార్లు తేమ శాతాన్ని పరిశీలించి వచ్చిన తరువాత తరలిస్తున్నా.. తీరా అక్కడికి వెళ్లాక మళ్లీ తేమ రాకపోవడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. బస్తాకు



రెండు కిలోల చొప్పున కోత పెడుతుండటంతో భారీ నష్టాన్ని చవి చూడాల్సి వస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో కొనుగోలు కేంద్రాలు 348
సేకరించిన ధాన్యం 1,39,500 మె.ట.
రైతులు 23,129
జమ అయిన నగదు రూ.170 కోట్లు

**మిల్లర్లకు సూచించాం**
ప్రవీణ్, డీసీవో, సూర్యాపేట
కేంద్రాల నుంచి తరలించాక మిల్లుల్లో దిగుమతి చేసేందుకు రెండు రోజుల సమయం పడుతోంది. ఈ లోపు బస్తాలోని ధాన్యం తేమ శాతం పెరిగే అవకాశం ఉంటుంది. ఈ కారణంతోనే మిల్లర్లు కోత పెడుతున్నారు. వారికి ఇప్పటికే కోత విధించొద్దని సూచించాం. మరోమారు చెబుతాం. రైతులు ఆందోళన చెందొద్దు.

# బాబోయ్ పోస్టల్ బ్యాలెట్!

ఖమ్మం: గత పంచాయతీ ఎన్నికల్లో ఖమ్మం గ్రామీణ మండలంలో ఓ ప్రభుత్వ ఉద్యోగి ఎన్నికల విధుల్లో ఉండటంతో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. తానుండే వార్డులో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నది అతనొక్కరే. వార్డులో పోటీలో ఉన్నదీ అతని బంధువే. ఒక్క ఓటు తేడాతే ఆ బంధువు ఓటమి పాలయ్యారు. పోస్టల్ ఓటు బంధువుకు కాకుండా వేరే వారికి పడినట్టు తేలటంతో రెండు కుటుంబాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది.
పోస్టల్ బ్యాలెట్ వినియోగం విషయంలో ఉద్యోగుల పరిస్థితి ముందు నుయ్యి వెనక గొయ్యి చందంలా మారింది. వినియోగానికి విముఖత చూపితే జిల్లా, మండలాధికారుల తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాల్సిందే అని ఆదేశిస్తున్నారు. ఒకవేళ వినియోగించుకుంటే ఓటు ఎవరికి వేశారన్న విషయం తెలిసే అవకాశం ఉంటోంది.
గ్రామ వార్డుల్లో సాధారణంగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే



వారు ఒకరిద్దరే ఉంటారు. వారి ఓటు ఎవరికన్నది తెలిసే అవకాశం ఉండటం, గెలుపోటముల మధ్య స్వల్ప తేడా ఉంటుండటంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. కొందరు మాకెందుకీ తిప్పల అంటూ వెనకాడుతున్నారు. పలు మండలాల్లో పీఓ, ఓపీఓ శిక్షణ సమయంలో పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు తీసుకోవడానికి సగం మంది ఉద్యోగులు విముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. మన దేశంలో రహస్య ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. పోస్టల్ బ్యాలెట్ విషయంలో ఓటు రహస్యంగా వేస్తున్నా లెక్కింపునకు వచ్చేసరికి తేడావస్తోంది. నేపథ్యంలో పరిస్థితిని చక్కదిద్దాలని ఉద్యోగులు కోరుతున్నారు.

# రాముడి జాగాకు రక్షణ కవచం

భద్రాచలం : దేవాదాయశాఖ భూముల పరిరక్షణకు చర్యలు మొదలయ్యాయి. క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకొని న్యాయ పోరాటం చేసేందుకు ఆ శాఖ సన్నద్ధమవుతోంది. ఇందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి కొండా సురేఖ నిర్ణయించారు. దీంతో భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి వారి దేవస్థానం భూములపైనా దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ చర్చిస్తున్నారు. రెవెన్యూ, పోలీసు, గ్రామ పంచాయతీల సహకారం తీసుకునే వీలుంది.

**భద్రాచలంలో కమిటీ**
రాములోరి భూములను భద్రంగా ఉంచేందుకు దాదాపు 2 నెలల కిందట అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటైంది. ఇందులో కలెక్టర్, దేవాదాయశాఖ అదనపు కమిషనర్, సబ్ కలెక్టర్, దేవాదాయ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారులు కీలక భూమిక పోషిస్తారు. భద్రాచలంలో ఒక దఫా ఈ బృందం సమీక్ష నిర్వహించింది. నిబంధనలకు విరుద్ధంగా దేవుడి మాన్యాన్ని కాజేస్తే తగు చర్యలు తీసుకునేందుకు ఈఓలకు అధికారం పెంచాల్సి ఉంది.

**ఏపీ పరిధే కీలకం**
రాములవారికి తెలంగాణ, ఏపీల్లో 1,340 ఎకరాల భూమి ఉంది. ఉమ్మడి ఖమ్మం, మెదక్, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కర్నూలు జిల్లాల్లో 1,100 ఎకరాల వరకు ఆక్రమణలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఒక్క పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోనే 889.5 ఎకరాలు ఉండగా వందల ఎకరాలు ఆక్రమణకు గురైంది. దశాబ్దాల ఈ సమస్యను ఇకనైనా సమన్వయంతో పరిష్కరించాలి. ప్రభుత్వం బృహత్ ప్రణాళికపై దృష్టి సారించడంతో రాములవారి స్థలంలో అభివృద్ధి పనులకు మార్గం ఏర్పడింది. ఆక్రమణలో ఉన్న అంగుళం జాగాను కూడా వదలం. టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు మంచి పరిణామం. ఖాళీ పోస్టుల భర్తీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి.
దామోదర్‌రావు, ఈఓ

# నిబంధనలకు నీళ్లొదిలితే వడ్డించేస్తారు!



హైదరాబాద్ : నిబంధనలకు విరుద్ధంగా భవనాలను నిర్మించి భారీ మొత్తంలో తాగునీటిని వినియోగించుకుంటున్న వారిపై జలమండలి కొరడా ఝులిపిస్తోంది. వారి నుంచి మూడింతల బిల్లులు వసూలు చేస్తోంది. జలమండలి పరిధిలో 14.6 లక్షల నీటి కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి నెలా 3 వేల వరకు అదనంగా చేరుతున్నాయి. కనెక్షన్లు పెరుగుతున్నా రాబడి పెరగకపోవడంపై జలమండలి దృష్టిసారించింది.
**ఏం జరుగుతుందంటే..** జీహెచ్ఎంసీ పరిధిలో నిర్మాణ నిబంధనల ఉల్లంఘనలు యథేచ్ఛగా సాగుతున్నాయి. రెండు, మూడు అంతస్తులకు అనుమతులు తీసుకుని నాలుగు లేదా ఐదు నిర్మిస్తున్నారు. సెట్‌బ్యాక్స్ పాటించకుండా ఆ స్థలాల్లోనూ నిర్మాణాలు చేస్తున్నారు. జలమండలి నీటి కనెక్షన్‌కు జీహెచ్ఎంసీ నుంచి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) తప్పనిసరి. అది ఉంటే జలమండలి సాధారణ నీటి ఛార్జీలనే వసూలు చేస్తుంది. చాలా చోట్ల నిర్మాణాల్లో అనుమతులను ఉల్లంఘించడం లేదా ఓసీ తీసుకున్న తర్వాత కొత్త నిర్మాణాలు చేయడం సాధారణంగా మారింది. దీంతో జలమండలి నీటికి డిమాండ్ పెరుగుతోంది.
మరోవైపు జలమండలి సిబ్బందితో లోపాయికారీ అవగాహనతో నీటిని ఎక్కువ పరిమాణంతో వినియోగించుకుంటున్నారు.
ఇలా చేస్తారు.. కొత్త నిర్మాణాలకు నీటి కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకుంటే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఉన్నా జలమండలి ప్రత్యేకంగా నిర్మాణాల కొలతలు తీసుకుని నిర్ధారించుకుంటుంది. పాత కనెక్షన్లు ఉన్నచోట అనుమతుల మేరకు భవన నిర్మాణాలు ఉన్నాయా? లేదంటే మార్పులు చేశారా? ఫ్లోర్‌లు పెరిగాయా? అని పరిశీలిస్తున్నారు. నిబంధనల ఉలంఘన ఉంటే సాధారణం కంటే మూడు రెట్లు నీటి ఛార్జీలు వసూలు చేస్తున్నారు.

# ముక్కిపోయి.. పిండిగా మారి!



భగత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేసిన నాటి నుంచి దొడ్డు బియ్యం గోదాంలలో ముక్కిపోతున్నాయి. పురుగు పట్టి బియ్యం పిండిగా మారిపోతున్నాయి. మరో వైపు నిల్వలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో రూ.కోట్ల విలువ చేసే సరకుకు పురుగు పట్టి, ప్రజాధనానికి నష్టం వాటిల్లుతోంది. గోదాంలలో దొడ్డు బియ్యం నిల్వలు పేరుకుపోయి ఉండటంతో సన్నవి నిల్వ చేయడానికి స్థలంలేక ప్రతి నెలా పంపిణీలో ఆలస్యమవుతోంది.

**సన్నబియ్యం నిల్వకు కష్టం**
పౌరసరఫరా సంస్థ జిల్లాలో బియ్యం నిల్వలను మొదటి దశ బఫర్‌స్టాక్ పాయింట్, రెండో దశ మండల స్థాయి నిల్వల కేంద్రాలుగా నిర్వహిస్తోంది. మొదటి దశ కింద హుజూరాబాద్‌లో మూడు, జమ్మికుంట, రుక్మాపూర్‌లలో ఒకటి చొప్పున అయిదు గోదాంలున్నాయి. ఈ గోదాంలలో పౌరసరఫరా సంస్థ రేషన్ బియ్యం బఫర్ స్టాక్ కింద నిల్వ చేస్తుంది. దొడ్డు బియ్యం పంపిణీని నిలిపివేయడంతో అయిదు గోదాంలలో 4732.223 మెట్రిక్ టన్నుల నిల్వలు పేరుకుపోయాయి. సన్నవి నిల్వ చేయడానికి స్థలంలేకుండా పోయింది.
రెండో దశలో మిల్లుల నుంచి నేరుగా మండల స్థాయి నిల్వల కేంద్రానికి (ఎంఎల్ఎస్) రవాణా చేయాల్సి వస్తోంది. ఎంఎల్ఎస్ పాంట్లు కరీంనగర్, చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంటలలో ఉన్నాయి. ఈ గోదాంలలో 5213.471 మె.ట దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయి. సన్నరకం బస్తాలను దిగుమతి చేసుకునే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో అధికారులు నేరుగా ప్రజా పంపిణీ దుకాణాలకు రవాణా చేస్తున్నారు. దీంతో రెండు నెలలుగా రవాణాలో జాప్యం జరగడంతో.. లబ్ధిదారులు రేషన్ దుకాణాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.
మరో వైపు చౌకధరల దుకాణాల్లోనూ దొడ్డు బియ్యం నిల్వలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. జిల్లాలో 566 దుకాణాల్లో 10-20 క్వింటాళ్ల వరకు దొడ్డువి ఉన్నట్లు సమాచారం.
వేలం వేస్తే మేలు..
ఆరు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం దొడ్డు బియ్యంపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా తాత్సారం చేస్తుండటంతో పురుగుపట్టి ముక్కిపోయి.. పిండి రూపంలోకి మారుతున్నాయి. రూ.కోట్లాది విలువ చేసే ప్రజాధనం మురిగిపోతోంది. దొడ్డు బియ్యం వేలం వేస్తే ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. ఇదే సమయంలో గోదాంల్లో సన్న రకాలకు చోటు లభించే అవకాశముంది.

**ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా..**
గోదాంలో పేరుకుపోయిన దొడ్డు బియ్యం నిల్వలు ఉన్న మాట వాస్తవమే. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం.
రజనీకాంత్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్

# 'మత్తు' వదిలిస్తున్నారు..!



నల్గొండ : ఎవరైనా జన్మించినా, చనిపోయినా, గెలిచినా, ఓడినా మందు ఉండాల్సిందే. ఇక వారాంతం వస్తే చాలు యువత, చిన్నా పెద్దా తేడాల్లేకుండా మద్యం లేనిదే జీవితం లేనట్లుగా బతికేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మత్తుతో చిత్తవుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుంది. చాపకింద నీరులా విస్తరిస్తున్న మద్యం, మత్తుల మహమ్మారిని 'డి-అడిక్షన్' కేంద్రాలు కొంత నియంత్రిస్తున్నాయి.

**ఏయే ప్రాంతాల్లో అంటే..**
కల్తీ మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలు కల్లు కంపౌండ్లతో పాటు నల్గొండ, మిర్యాలగూడ, నకిరేకల్ ప్రాంతాల్లోనూ విరివిగా లభ్యమవుతున్నాయి. యాదాద్రి జిల్లాలోని యాదగిరిగుట్టలో ఉన్న 20 కల్లు కేంద్రాల్లో నిత్యం వందలాది మంది యువత ఎక్కువ మత్తును కలిగించే కల్తీకల్లును తాగుతున్నారనే ఆరోపణలున్నాయి. సూర్యాపేట జిల్లా కేంద్రం, తుంగతుర్తి, కోదాడ, మోత్కూరు ప్రాంతాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ఒక ప్రభుత్వ కేంద్రం ఉన్నా.. విరివిగా ఈ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

**వచ్చే నష్టాలివి**
సరదాగా మొదలై అలవాటుగా మారిన వ్యసనాలు కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. ఆల్కహాలిక్స్‌గా మారిన వారికి సమాజంతో పాటు కుటుంబంలో గౌరవం ఉండదు.
కల్తీ కల్లు, గంజాయి తాగితే ఫిట్స్, నురగలు కక్కుతుండటం, వాంతులు, విరేచనాలు ప్రబలడం వంటి అనారోగ్య సమస్యలు వస్తుంటాయి.
ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిశోధన ప్రకారం. శారీరక, మానసిక రుగ్మతలు వస్తాయి.
పరిస్థితులు విషమించిన 16 మంది 'మత్తు' బాధితులను హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఆసుపత్రికి తరలించినట్లు నల్గొండ జిల్లాసుపత్రి వైద్యులు నగేశ్ తెలిపారు.

**పరివర్తన కలిగించేలా మెరుగైన సేవలు**
డా.సిహెచ్.శివ కుమార్, సైక్రియాటిస్ట్, జిల్లాసుపత్రి, నల్గొండ
మద్యం, మత్తు పదార్థాలకు వ్యసనపరులైన వారిని ఆల్కాహాలిక్స్ అంటాం. వీరికి ప్రతి 6 గంటలకొకసారి ఎలాగైనా..ఏం చేసైనా..మత్తు తీసుకోవాలనే ఆరాటం ఉంటుంది. సకాలంలో తీసుకోకపోతే కాళ్లు చేతులు వణకడం, అధిక రక్తపోటు, కోపం, డిప్రెషన్‌కు లోనవుతుంటారు. ఒక్కోసారి సైకోలా ప్రవర్తిస్తుంటారు. వీరి స్టేజీని బట్టి చికిత్స ఉంటుంది.

# దూరం భారమైంది!

కొత్తగూడెం : ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభమైన ప్రభుత్వ వైద్య కళాశాలలో అసౌకర్యాలు తిష్ట వేశాయి. కనీస సదుపాయాలు కరవై వైద్య విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మన్యం జిల్లాగా పేరొందిన భద్రాద్రికొత్తగూడేనికి ప్రభుత్వ వైద్య కళాశాల రావటంతో పూర్తి స్థాయి సేవలు అందుబాటులోకి వస్తాయని భావించినా పరిస్థితి భిన్నంగా ఉంది. కాలేజీలో పూర్తి స్థాయి అధ్యాపకులు లేరు. విద్యాలయం, వసతి గృహాల నిర్మాణం పూర్తికాలేదు. పర్యవేక్షించే అధికారులు కరవయ్యారు. కొత్తగూడెం పట్టణంలో 2022-23 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ వైద్య కళాశాలలో తరగతులు ప్రారంభించారు. కేఎంసీలోని ఒకే ఆవరణలో 40 ఎకరాల విస్తీర్ణంలో నర్సింగ్, ప్రధాన కళాశాల, క్యాంటీన్, వసతి గృహాల భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. నర్సింగ్ కాలేజీ పూర్తి కావటంతో అందులో మెడికల్ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. మూడేళ్లుగా మెడికల్ కాలేజీ నిర్మాణం కొలిక్కికాలేదు. నిధుల మంజూరులో జాప్యంతో గుత్తేదారులు మొండికేస్తున్నారు. అడపాదడపా పనులు చేపడుతున్నా పనుల్లో పురోగతి లేకుండా పోయింది. క్యాంపస్ వాతావరణం కన్పించేలా వసతి గృహాల పనులు ప్రారంభించారు. 70 శాతం వరకు పూర్తయినా మిగులు పనులు ఉండిపోయాయి. ఇప్పటికే మూడు విద్యా సంవత్సరాలు పూర్తయ్యాయి. నాలుగో ఏడాదికి సంబంధించి విద్యార్థులు చేరారు. మొత్తం 600 మంది విద్యార్థులున్నారు. వీరికి వసతి గృహ సదుపాయాలను పాల్వంచ పరిసర ప్రాంతాల్లోని అద్దె భవనాల్లో ఏర్పాటు చేశారు. కిక్కిరిసిపోతూ ఉన్న గదుల్లోనే సర్దుబాటు చేసుకుంటున్నారు.



**ఇబ్బందులు ఇలా..**
1. హాస్టళ్లలో సదుపాయాల లేమితో విద్యార్థులు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు.
2. ఉదయం, రాత్రి తేడా లేకుండా వెళ్లాల్సి ఉండటంతో రాత్రివేళల్లో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు.
3. విద్యార్థులు జిల్లా సర్వజనాసుపత్రి, రామవరం ఎంసీహెచ్ ఆసుపత్రుల్లో ప్రాక్టికల్, బోధన తరగతులు వినేందుకు వస్తున్నారు. ఇందుకోసం 12 కి.మీ. రాకపోకలు సాగించాల్సి వస్తోంది.
4. ఏకీకృతంగా హాస్టళ్లు లేకపోవటంతో కళాశాల బాధ్యుల పర్యవేక్షణ కొరవడింది. విద్యార్థినుల విషయంలో ఇదే పరిస్థితి.
5. పర్యవేక్షణ లేక కొన్నిసార్లు విద్యార్థులు గాడితప్పుతున్నారు. కొన్ని నెలల క్రితం ఆటో బోల్తాపడి వైద్య విద్యార్థులు గాయపడ్డ ఘటనలున్నాయి. ఇటీవల వైద్య విద్యార్థుల కారణంగా ఓ యువకుడు రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు.
6. ఈ విషయమై మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ పరిధిలో ఉన్న మేర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# భూమి లేదు.. పట్టాలివ్వరు

సిరికొండ: నిజామాబాద్ గ్రామీణం నియోజకవర్గంలోని పేదలకు 2009లో అప్పటి ప్రభుత్వం ఎకరం చొప్పున భూమిని పంపిణీ చేసి పట్టాలిచ్చింది. కానీ, ఆ భూములు అటవీ పరిధిలోకి వస్తాయని ఆ శాఖ అధికారులు సాగును అడ్డగించడంతో సిరికొండ, ధర్పల్లి, ఇతర మండలాల లబ్ధిదారులకు నిరాశే మిగిలింది. పలుమార్లు రెవెన్యూ, అటవీ శాఖ ఆధ్వర్యంలో సంయుక్త సర్వేలు నిర్వహించినా సమస్య పరిష్కారం కావడం లేదు. రెవెన్యూ పరిధిలోకే భూములొస్తాయని తేల్చినా అటవీ శాఖ భీష్మించుకుకూర్చుంటోంది. పలుచోట్ల సర్వే నిర్వహించాల్సి ఉంది.
**పథకాలకు దూరం..:** పలు గ్రామాల్లో పంపిణీ చేసిన భూముల్లో రైతులు పంటలు సాగుచేసుకుంటున్నారు. డిజిటల్ సంతకాలతో నూతన పట్టా పాసుపుస్తకాలు రాకపోవడంతో తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలైన పీఎం కిసాన్, రైతు భరోసా, బ్యాంకు రుణాలకు నోచుకోవడం లేదు.
ఈ చిత్రంలో కనిపిస్తోంది సిరికొండ శివారు 532 సర్వే నంబరులోని భూమి. ఇందులో 207 ఎకరాలు భూమి ఉంది. 2009లో అప్పటి ప్రభుత్వం 166 మంది లబ్ధిదారులకు ఎకరం చొప్పున కలెక్టర్ చేతుల మీదుగా పట్టాలు అందజేసింది. కానీ, భూమి తమదంటూ అటవీ శాఖ సాగు చేయకుండా అడ్డుకుంటోంది. రైతుల పక్షాన హైకోర్టు నిలిచినా.. న్యాయం కోరుతూ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకునే వారు లేరు.
ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో పంటల సాగుకు ఏళ్లుగా పోరాడుతున్నాం. రెవెన్యూ భూమి అని తేలినా అటవీ శాఖ సాగుచేసుకోనివ్వడం లేదు. ప్రభుత్వం న్యాయం చేయాలి.జైరాబి, సిరికొండ

# పోరు రసవత్తరం.. తీరు ఆసక్తికరం

కామారెడ్డి : గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన మొదటి విడత నామినేషన్ల స్వీకరణ పూర్తయింది. రెండో విడత నామినేషన్ల ఘట్టం ప్రారంభమైంది. దీంతో జిల్లాలో పల్లెపోరు రసవత్తరంగా మారింది. సర్పంచిగా గెలిచేందుకు ఉవ్విళ్లూరుతున్న ఒక్కో అభ్యర్థి ఒక్కో పంథా అవలంబిస్తున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి కొందరు సామాజిక మాధ్యమాలను విరివిగా వినియోగించుకుంటే.. మరికొందరు 'నేను ఇవి చేసి చూపిస్తా'నంటూ బాండ్‌పేపర్లు రాసిస్తున్నారు.
**సహాయ కార్యక్రమాలతో..**సదాశివనగర్ మండలానికి చెందిన ఓ వ్యక్తి.. ఆ ప్రాంతంలోని రహదారులపై ఎక్కడ ప్రమాదం జరిగినా ముందుంటారు. సమాచారం అందగానే పగలూరాత్రి అన్నతేడా లేకుండా ఘటనాస్థలానికి వెళ్లి బాధితులకు సహాయం చేస్తుంటారు. మానసిక స్థితి సరిగాలేని వారికి కూడా చేతనైన సహాయం చేస్తారు. ఆయన భార్య ప్రస్తుతం సర్పంచిగా పోటీ చేస్తున్నారు. ఓటర్లకు చేరువ అయ్యేందుకు ఇప్పటివరకు తాను చేపట్టిన సేవాకార్యక్రమాలను ఓటర్లకు సామాజిక మాధ్యమాల ద్వారా వివరిస్తున్నారు. స్టేటస్ వేదికగా..మరికొందరు సర్పంచి అభ్యర్థులు వాట్సప్ స్టేటస్‌లను తమ ప్రచార వేదికగా మలుచుకుంటున్నారు. ప్రజలకు తాము ఏం చేస్తామో వివరిస్తూ స్టేటస్‌లో పెడుతున్నారు. ఓటర్లకు దగ్గరయ్యేలా తమ ఫొటోలు, వీడియోలకు పాటలు, సంగీతం జతచేస్తున్నారు. బంధువులు, మిత్రుల వాట్సప్ గ్రూప్‌ల్లో, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలో షేర్ చేస్తూ ప్రచారం చేసుకుంటున్నారు.సొంత మేనిఫెస్టోతో..ఓటర్ల మద్దతు కూడగట్టుకునేందుకు రామారెడ్డి మండలకేంద్రంలో పోటీ చేస్తున్న ఓ యువకుడు సొంత మేనిఫెస్టోను తెరపైకి తీసుకొచ్చారు. తాను గెలిస్తే ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. పెద్దకొడప్‌గల్‌కు చెందిన ఓ మహిళ.. తాను గెలిస్తే ప్రజలకు నిస్వార్థంగా పనిచేస్తానని హామీ ఇస్తున్నారు. అక్రమ ఆస్తులు కూడబెట్టనని, అలా సంపాదిస్తే అవన్నీ ప్రజలకే చెందుతాయంటూ రూ.100 విలువైన బాండ్ పేపర్‌పై రాసి ఓటర్లకు వివరిస్తున్నారు.

చురకలు



## ఆపేది అక్కడ... ఎక్కేది ఇక్కడే

కాచిగూడ: కాచిగూడ స్టేషన్లో రైళ్లను నిలపడానికి సరిపోను స్టేబుల్ లైన్లు లేకపోవడం పెద్ద సమస్యగా తయారైంది. ఈ కారణంగా ఇక్కడి నుంచి నడపాల్సిన అనేక రైళ్లను ఇతర స్టేషన్ల నుంచి నడుపుతున్నారు. ప్రయాణికులు మాత్రం సింహ భాగం కాచిగూడ స్టేషన్‌లోనే ఎక్కుతున్నారు. కొన్ని రైళ్లు ఇక్కడి నుంచే బయలుదేరుతున్నా ఇతర స్టేషన్లలో నిలిపి ఉంచుతున్నారు. రైలు బయలుదేరడానికి ముందు ఇక్కడికి తీసుకొస్తున్నారు. విలువైన సమయం, ఇంధనం వృథా అవుతోంది.

**పదుల్లో రైళ్లు:** రోజూ పదుల సంఖ్యలో ఇక్కడి నుంచి రైళ్లు బయలుదేరి వెళుతున్నాయి. గోవా, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి పలు రైళ్లు కాచిగూడ మీదుగా ఉత్తరాది రాష్ట్రాలైన మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, యూపీ, ఢిల్లీకి రాకపోకలు సాగిస్తాయి.



నిత్యం నగరం, ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకుంటారు.

ఇతర స్టేషన్లలో ఇలా.. కాచిగూడలో సరిపోను స్టేబుల్ లైన్లు లేకపోవడంతో రైళ్లు రాగానే మేడ్చల్, బొల్లారం, క్యావలెరి బ్యారక్స్, ఫలక్‌నుమా, ఉందానగర్, దూకల్, షాద్‌నగర్ తదితర స్టేషన్లకు తీసుకెళ్లి నిలుపుతున్నారు.

ప్లాట్‌ఫారాలు: 5
స్టేబుల్, ఫిట్ లైన్లు : 3 చొప్పున
రోజువారీ రైళ్లు: 100 కు పైగా
ప్రయాణికులు: 55 వేలు
వారంతాలు, సెలవుల్లో : 65 వేల వరకు

## తాళ్లతో కట్టి.. కత్తితో బెదిరించి..!

హైదరాబాద్ :గాజుల వ్యాపారిని కత్తితో బెదిరించి నగదు కాజేసిన ఘటన ఆదివారం పాతబస్తీలోని భవానీనగర్ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితులు వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన మహ్మద్ సుల్తాన్(34), భార్య పర్వీన్‌బేగం(28) జీవనోపాధికి ఆరేళ్ల క్రితం నగరానికి వచ్చారు. తలాబ్‌కట్ట సల్మామజీదు సమీపంలోని అమాన్‌నగర్‌లో ఉంటున్నారు. చాచానగర్ గ్యారేజీ వద్ద రాళ్ల గాజులు తయారు చేసే ముడిసరకు విక్రయించే దుకాణాన్ని నడుపుతున్నారు. ఇటీవల బిహార్‌లో భార్యాభర్తల పేరిట ఉన్న భూములను అమ్ముకొని వచ్చిన సొమ్మును ఇంట్లో భద్రపరిచారు. గర్భిణి అయిన పర్వీన్‌బేగం రెండు నెలల క్రితం సొంతూరికి వెళ్లడంతో ఒంటరిగా నివాసం ఉంటున్నాడు.



ఆదివారం తెల్లవారుజామున మాస్కులు ధరించిన దుండగులు సుల్తాన్ తలుపులు కొట్టారు. చెత్తను తీసుకెళ్లే వారు అనుకుని తీయగా.. వెంటనే ఇంట్లోకి చొరబడిన దుండగులు అతడిని తాళ్లతో బంధించారు. కత్తితో బెదిరించి రూ.40లక్షలు, చరవాణి, బైక్ తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న దక్షిణ మండలం డీసీపీ కిరణ్ ఖరే ప్రభాకర్, మీర్‌చౌక్ ఏసీపీ శ్యామ్ సుందర్, భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి, డీఐ నర్సింహ నాయక్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడి పరిసర ప్రాంతాల సీసీ కెమెరాలను పరిశీలించారు. ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నారు.

## పాత వాహనం కొంటున్నారా..!

చౌటుప్పల్ : బైకు, కారు ఈ రోజుల్లో ప్రతి కుటుంబానికి తప్పనిసరిగ్గా మారింది. కొత్తది కొనే స్థాయిలో డబ్బు లేక చాలామంది తమ బడ్జెట్‌కు అనుగుణంగా సెకండ్ హ్యాండ్‌లో వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. ఇంకొందరు కొత్త మోడళ్లు రాగానే పాతవాటిని పక్కన పెట్టేస్తుండటంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలో సెకండ్ హ్యాండ్ వాహనాల కొనుగోళ్ల వ్యాపారం వృద్ధి చెందింది. మరి వీటిని కొనేముం దు కొన్ని సూచనలు పాటిస్తే పాత బండిని కొత్తగా పరుగులు తీయించొచ్చు. వెచ్చించిన సొమ్ముకు తగ్గ నాణ్యమైన వాహనాన్ని ఎంచుకోవచ్చని ఆటోమొబైల్ రంగ నిపుణులు సూచిస్తున్నారు. అప్రమత్తంగా లేకపోతే నిలువునా మోసపోయే



ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. మరీ వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏంటో ఒకసారి చూద్దాం.పాత వాహనం ఏ సంవత్సరంలో తయారై మార్కెట్‌లోకి వచ్చిందో గమనించాలి. మన మెకానిక్‌ను తీసుకెళ్లి గుండెకాయలాంటి ఇంజిన్ నాణ్యతను పరిశీలించాలి. వాహనంలోని కీలక విడిభాగాల ప్రస్తుత పనితీరును, వాటి మన్నిక ఎంత కాలం ఉండొచ్చో చూడాలి. లీటర్ పెట్రోల్‌కు ఎన్ని కిలోమీటర్లు ప్రయాణించగలదో తెలుసుకోవాలి. లైట్ల పని తీరును రాత్రి వేళ గమనించాలి. దీంతో పాత వాహనం కొన్న తర్వాత తక్కువ మరమ్మతు ఖర్చులతో సరిపెట్టొచ్చు.

పాత వాహనాలు కొనుగోలు చేసే సమయంలో దాని పత్రాలు సరిగా ఉన్నాయో లేదా పరిశీలించాలి. వాటిలో ఉన్న వివరాలతో ఇంజిన్, ఛాసిస్ సంఖ్య సరిచూసుకోవాలి. చోరీ చేసిన వాహనమైతే దాని ఛాసిస్ సంఖ్యను చెరిపేసి అమ్మజూపుతారు. ఆర్టీఏ అధికారులను సంప్రదించి ఆ వాహన యజమాని పేరును నిర్ధారించుకోవాలి. వాహనంపై ఏమైనా కేసులున్నాయా, చోరీ చేసినదా అని సమీప ఠాణాలో విచారణ చేయాలి. వాహనం కొనుగోలు చేయగానే మన పేరుపై వెంటనే మార్చుకోవాలి.

# నకిలీ వేషాలు.. దర్జాగా మోసాలు



హైదరాబాద్ : నందికొట్కూరుకు చెందిన బత్తిని శశికాంత్. బీకామ్ చదివి ఐఏఎస్ అధికారినంటూ ఎంతో మందిని మోసం చేశాడు. కాంట్రాక్టులు, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ రూ.లక్షలు వసూలు చేశాడు. అక్కడ కేసు నమోదు కావటంతో హైదరాబాద్‌కు మకాం మార్చాడు. ఖరీదైన ప్రాంతంలో నివాసం.. కారు.. వాకీటాకీలతో ఆర్భాటంగా తయారై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల నివాసాల వద్ద చక్కర్లు కొట్టేవాడు. తాను ఐపీఎస్, ఎన్ఐఏ అధికారినంటూ ప్రాంతానికో వేషం వేసి బోల్తా కొట్టించాడు. ఒకరి నుంచి రూ.40 లక్షలు, మరొకరి వద్ద రూ.25 లక్షలు కాజేశాడు. తాజాగా ఫిల్మ్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

బిహార్‌కు చెందిన మహ్మద్ షజాద్ అలమ్ సైదాబాద్ పరిధిలోని వృద్ధాశ్రమంలో పనిచేశాడు. అక్కడ మానేశాక బెంగళూరు చేరాడు. కొద్దికాలానికి తనకు ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగం వచ్చిందంటూ సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు ఉంచాడు. తరచూ హైదరాబాద్ వచ్చి వెళ్తుండేవాడు. వైమానిక దళంలో కీలక పదవిలో ఉన్నానంటూ కొందరు మహిళలకు దగ్గరయ్యాడు. మరికొందరిని ఉద్యోగాలిప్పిస్తాంటూ డబ్బు వసూలు చేశాడు. బాధితుల ఫిర్యాదుతో సైదాబాద్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

వారిని చూస్తే పెద్ద అధికారి అనుకుంటారు.. అలా అనుకునేలా మాయ చేస్తారు.. మీ పని క్షణాల్లో అయిపోనట్లే అన్నట్టు నమ్మిస్తారు.. రూ.లక్షలు చేతిలో పడగానే బిచాణా ఎత్తేస్తారు. మరోచోట మకాంవేసి దర్జాగా మోసాలకు పాల్పడుతారు. వారే పోలీసు, రెవెన్యూ, రవాణా, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, రైల్వేశాఖల్లో అధికారులమంటూ సామాన్యులను తేలికగా బురిడీకొట్టిస్తున్న మోసగాళ్లు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఈ తరహా నకిలీరాయుళ్ల మోసాలపై 23 కేసులు నమోదయ్యాయి. 250మందికి పైగా బాధితులున్నారు. వరుస ఘటనల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తించినా, ప్రభుత్వ కొలువులు, రుణాలు ఇప్పించేందుకు డబ్బు డిమాండ్ చేసినా సమాచారం ఇవ్వాలని పశ్చిమమండలం డీసీపీ చింతమనేని శ్రీనివాస్ సూచించారు.


**ఇటీవల డూప్లి 'కేటుగాళ్ల' లీలలెన్నో**

మాదాపూర్-జూబ్లీహిల్స్ వైపు వస్తున్న వాటర్‌ట్యాంకును ఓ వ్యక్తి ఆపి తాను రవాణాశాఖ అధికారినంటూ బెదిరించాడు. వాహనానికి అనుమతుల్లేవంటూ రూ.2 వేలు కాజేశాడు.

జీడిమెట్ల పరిధిలో నకిలీ మహిళా కానిస్టేబుల్‌ను అరెస్ట్ చేశారు. పోలీసు ఉద్యోగానికి ఎంపిక కాకపోవడంతో డూప్లికేట్‌గా మారినట్టు గుర్తించారు.రైల్వేశాఖలో ఉన్నతహోదాలో ఉన్నానంటూ వరంగల్‌కు చెందిన ఘరానా మోసగాడు సుమారు 400 మంది నుంచి డబ్బు వసూలు చేశాడు.

ఇద్దరు మాయగాళ్లు నకిలీ ఐడీ కార్డులతో సచివాలయంలోకి వెళ్లారు. ఒక మంత్రి వద్ద ఓఎస్డీనంటూ నమ్మించి రూ.2.5 కోట్లు కాజేశారు. ప్రభుత్వ కాంట్రాక్టులు ఇప్పిస్తామంటూ ఎంతోమందిని మోసగించినట్టు పోలీసులు గుర్తించారు.

# పేదల స్థలం.. పెద్దల పరం



హైదరాబాద్ : "శంషాబాద్ మండలం గొల్లపల్లిలో 18 ఎకరాల ఎసైన్డ్ భూములున్నాయి.విమానాశ్రయం సమీపంలో ఉండడంతో అక్రమార్కుల కన్ను వాటిపై పడింది. ప్రభుత్వం భూములను వెనక్కి తీసుకుంటుందంటూ ఎసైనీలను బెదిరించి వారి భూముల్లో కొన్నింటిని ఆర్నెళ్ల క్రితం తీసుకున్నారు. వీటిని తమ పేర్లతో మార్చుకునేందుకు ప్రైవేటు పట్టా ఉందంటూ రిజిస్ట్రేషన్ చేయించుకుని వాటి ద్వారా ఇంటి నంబర్లు సృష్టించారు. వారి స్వాధీనంలోని భూముల విలువ రూ.300 కోట్లు"

-ప్రభుత్వ భూములను కొట్టేసేందుకు కొందరు అక్రమార్కులు చేస్తున్న మాయాజాలమిది. నిజాం కాలం నాటి దస్త్రాలంటూ నకిలీ పత్రాలు తీసుకొచ్చి సేత్వారు రికార్డుల్లో ఉన్నాయంటూ రెవెన్యూ అధికారులను నమ్మిస్తున్నారు. ఈ ఏడాదిలో ఇలా ఇప్పటివరకూ రూ.900 కోట్ల విలువైన భూములను సొంతం చేసుకున్నారు. వాటికి ఈ-పాస్‌పుస్తకాలు తీసుకున్నారు.

ఎసైన్డ్, మిగులు భూముల వివరాలు సేకరించి.. కబ్జాకు పాల్పడుతున్న అక్రమార్కులు నిషేధిత భూములపైనే గురిపెడుతున్నారు. ఎసైన్డ్ భూములు, మిగులు భూముల వివరాలను సేకరించి వాటి కబ్జాకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. నిజాం కాలం నాటి పత్రాలను సృష్టించి వాటితో కోర్టులను ఆశ్రయిస్తున్నారు. ఆయా పత్రాలను పరిశీలించండి అంటూ న్యాయస్థానాలు ఉత్తర్వులు జారీ చేయగానే నకిలీ పత్రాలు, కోర్టు ఉత్తర్వులతో రెవెన్యూ అధికారులను సంప్రదిస్తున్నారు. ముడుపులు సమర్పించి ఈ-పాస్ పుస్తకాలు వచ్చేలా చేసుకుంటున్నారు.

**తెరవెనక స్థిరాస్తి వెంచర్ల ప్రతినిధులు**

శేరిలింగంపల్లి, గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల్లో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములున్నాయి. వాటిని సొంతం చేసుకునేందుకు రూ.లక్షల్లో నగదు ఇస్తామంటూ కొందరు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. ఈ తతంగం తెరవెనుక రియల్ వెంచర్ల ప్రతినిధులుంటున్నారు. "ఎసైన్డ్ భూముల ఆక్రమణల అంశం తమ దృష్టికి వచ్చిందని, రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకటరెడ్డి తెలిపారు."

## నివాస ప్రాంతాల్లో మద్యం.. అధికారుల చోద్యం




హైదరాబాద్ :ఈ చిత్రంలో కనిపిస్తున్న మద్యం దుకాణం.. ఎల్బీనగర్- నాగోల్ మార్గంలో ఉంది. ఇన్నర్‌రింగురోడ్డుకు ఆనుకునిఉన్న ఈదుకాణం వద్ద సాయంత్రం రోడ్డుమీది వరకూ వాహనాలు పార్కింగ్ చేస్తారు. చీకటిపడితే పర్మిట్‌రూముకు వెలుపల దుకాణం బయట మద్యం తాగుతూ కనిపిస్తారు. పక్కనే బస్టాపు ఉండటంతో మందుబాబుల హంగామా కారణంగా మహిళలు బస్సు కోసం ఎదురు చూడాలన్నా ఇబ్బంది పడుతున్నారు. సాయంత్రం దాటితే ఆ ప్రాంతాల నుంచి వెళ్లాలంటే మహిళలు, చిన్నారులు ఆలోచించాల్సిందే.. ఎప్పుడు గొడవ జరుగుతుందో.. ఎటువైపు నుంచి ఎవరొచ్చి దాడి చేస్తారోనని తెలియక స్థానికుల ఆందోళన.. చీకటిపడితే ఎక్కడపడితే అక్కడ మద్యం తాగుతూ అలజడి సృష్టించే పోకిరీలు.. పొరపాటున ప్రశ్నిస్తే దాడులు.. ఇదీ నగరంలోని కొన్ని ప్రాంతాల్లో మద్యం దుకాణాల వద్ద నిత్యం కనిపించే పరిస్థితులు. రాజధానిలోని కొన్ని ప్రాంతాల్లో నివాస ప్రాంతాలకు సమీపంలో ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాలు తొలగించాలంటూ స్థానికులు ఆందోళనకు దిగుతున్నారు. షాప్‌లను ఇతర ప్రాంతాలకు మార్చాలని ఏళ్ల తరబడి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నా, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తులు చేస్తున్నా పరిస్థితిలో మార్పు లేదు. డిసెంబరు 1 నుంచి రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీ ప్రారంభమవుతోంది. లైసెన్సులు దక్కించుకున్న దుకాణదారులు నుంచి విక్రయాలు ప్రారంభిస్తున్నారు. కొత్త మద్యంపాలసీలో భాగంగానైనా దుకాణాలను నివాసాలకు దూరంగా తరలించాలని కాలనీ సంఘాలు, స్థానికులు అధికారులకు విజ్ఞప్తులు చేస్తున్నారు.

నిబంధనలకు నీళ్లు రాజధానిలో మూడు జిల్లాల పరిధిలో 615 మద్యం దుకాణాలున్నాయి. ప్రతి దుకాణానికి 100 చదరపు మీటర్లు లోపు పర్మిట్ రూము ఉండాలి. ప్యాకేజ్డ్ ఫుడ్ మాత్రమే విక్రయించాలి. పర్మిట్ రూము వెలుపల మద్యం తాగడానికి వీల్లేదు. కొన్ని దుకాణాలు ఈ నిబంధనల్ని బేఖాతరు చేస్తున్నాయి. సరైన పార్కింగ్ లేకపోవడంతో మందుబాబులు రోడ్ల మీదే వాహనాలు నిలిపేస్తున్నారు. చీకటి పడ్డాక కొందరు పర్మిట్ రూము వెలుపల మద్యం తాగుతున్నారు. ఈ సమయంలో ఆఫీసు, ఇతర పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకునే మహిళలు, చిన్నారలు దుకాణాల ముందు నుంచి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కేపీహెచ్‌బీ మూడో ఫేజ్‌లోని ఎల్ఐజీ, ఎంఐజీ నివాసాల సమీపంలో రెండు మద్యం దుకాణాలు కొనసాగడంపై స్థానికులు ఏళ్లుగా ఆందోళన చేస్తున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఆలయం సమీపంలోనే ఉన్నాయి. దీనిపై ఇటీవల స్థానికులు ప్రజాభవన్‌లోని ప్రజావాణిలోనూ ఫిర్యాదు చేశారు.నాగారం మున్సిపాలిటీ పరిధిలో సత్యనారాయణ కాలనీలోని రోడ్డు నంబరు 2, 12 దగ్గర రెండు మద్యం దుకాణాలున్నాయి. ఈ కాలనీలో సుమారు 400 కుటుంబాలు నివసిస్తున్నా యి. రెండు మద్యం దుకాణాలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సమీపంలో పాఠశాల, చిన్నారుల ఆసుపత్రి ఉన్నాయి. కొత్తగా ఏర్పాటయ్యే దుకాణాన్ని తొలగించాలంటూ ఇటీవల కొందరు మేడ్చల్ కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు.

## ప్రయోజనం రెండింతలు

ఖానాపురం : అసంఘటిత రంగ కార్మిక కుటుంబాలకు భద్రత, భరోసా అందించటంలో శ్రామిక (లేబర్) కార్డులు ఎంతో ఉపయోగపడుతున్నాయి. గుర్తింపు కార్డున్న కార్మికులకు విపత్కాలంలో కార్మిక శాఖ అండగా నిలుస్తోంది. గాయపడ్డా, ప్రమాదవశాత్తు చనిపోయినా ఆర్థికంగా ఆదుకుంటుంది. 2025, జూన్ నుంచి ప్రభుత్వ సాయం కొన్నింట్లో రెండింతలు చేశారు. దీనిపై అవగాహనలేని వారు పేరు నమోదులో, రెన్యువల్‌లో శ్రద్ధ చూపటం లేదు.

**ఎవరు అర్హులు**తవ్వకం పని, రాళ్లు కొట్టేవారు, తాపీ, సెంట్రింగ్, రాడ్ బెండింగ్, ప్లంబింగ్, శానిటరీ, వడ్రంగి, రంగులు వేయటం, టైల్స్, మార్బుల్, ఎలక్ట్రీషియన్, రవాణా మార్గ నిర్మాణ పనులు, నీటిపారుదల నిర్మాణం, వెల్డింగ్, రిగ్గర్లు, బోర్‌వెల్, ఇంటీరియల్, ఇటుక, సున్నం బట్టీలు, క్వారీలు, కాంక్రీట్ మిక్చర్, నిర్మాణ రంగ వాహనాలపై పనిచేసేవారు. ఎలక్ట్రికల్, టెలిఫోన్ లైన్ల నిర్మాణం, విద్యుత్తు ఉత్పత్తి లేదా పంపిణీ, ల్యాండ్ స్కేపింగ్, గ్లాస్, టన్నెల్, రోలర్ డ్రైవర్, లిఫ్ట్ వర్కర్లు, వాచ్‌మెన్, మేస్త్రీల వద్ద పనిచేసే కూలీలు. భార్య లేదా ఇద్దరు కుమార్తెల మొదటి, రెండో కాన్పులకు రూ.30వేల సాయం అందుతుంది. ప్రసూతి తేదీ నుంచి ఏడాది లోపు దరఖాస్తు చేసుకోవాలి. కుమార్తెల వివాహానికి రూ.30వేలు ఇస్తారు. కార్మికుడు మరణిస్తే అంత్యక్రియల నిమిత్తం నామినీకి రూ.30వేలు



ఇస్తారు. క్యాన్సర్, హృద్రోగం, దయాలసిస్, కాలేయ సంబంధిత వ్యాధులు, పార్కిన్సన్, ఎయిడ్స్ తదితర దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స పొందుతున్న వారికి నెలకు రూ.4,500 చొప్పున మూడు నెలలు సాయం అందుతుంది.

**వయసు?**

18-60 ఏళ్లలోపు కార్మికులు. గడిచిన ఏడాదిలో 90 రోజులు భవన నిర్మాణ రంగంలో పనిచేసి ఉండాలి.

**దరఖాస్తు ఇలా..**

మీ-సేవా కేంద్రంలో రూ.110 చెల్లించి దరఖాస్తు చేసుకుంటే సంబంధిత సహాయ కార్మిక అధికారి పరిశీలించి రిజిస్ట్రేషన్ చేస్తారు. తర్వాత గుర్తింపు కార్డు పొందవచ్చు. ఐదేళ్లకోసారి సభ్యత్వాన్ని తప్పనిసరిగా పునరుద్ధరించుకోవాలి.

'గ్రామాల్లో కార్మిక శాఖ ఏజెంట్లు అంటూ కొంతమంది వచ్చి డబ్బులు వసూలు చేస్తున్నారు. వారిని నమ్మొద్దు. ఏ దరఖాస్తు అయినా మీ సేవా ద్వారా ఆన్‌లైన్ చేయించుకోండి. జిల్లాలో బోగస్ కార్డులు చాలా ఉన్నాయి. సమస్య ఉంటే నేరుగా మా కార్యాలయంలో సంప్రదించవచ్చు.' విజయభాస్కర్‌రెడ్డి, కార్మిక శాఖ ఉప కమిషనర్, ఖమ్మం.

## రామాలయానికి పన్ను పోటు

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం ఆదాయాన్ని పెంచుకుంటున్నా ఏదో ఒక రూపంలో పన్ను పోటు తప్పడం లేదు. భక్తులు సమర్పించిన కానుకలు, విరాళాల ద్వారా సమకూరే నికర ఆదాయం నుంచి సుమారు 21.5 శాతం వేర్వేరు పద్దుల రూపంలో సర్కారుకు ఏటా చెల్లించాల్సి వస్తోంది. యాత్రికుల సందడి పెరిగి ఏడాదికి రూ.100 కోట్ల ఆదాయం వచ్చిందంటే అందులో రూ.21.5 కోట్లను నాలుగు రకాల రుసుముల రూపంలో ప్రభుత్వం వసూలు చేస్తోంది. శ్రీరామ క్షేత్రం సుమారు రూ.23.34 కోట్ల బకాయి ఉందంటే మాటలు కాదు. సర్కారు కనికరించి ఇందులో కొంత మినహాయింపు ఇవ్వాలని రామ భక్తులు కోరుతున్నారు. ముక్కు పిండి వసూలు చేస్తామని పట్టుపడితే ఖజానాకు భారం తప్పదని అంచనా వేస్తున్నారు.

**పన్ను భారం తగ్గేనా...**

రామాలయానికి ఏడాదికి రూ.80 కోట్ల మేర ఆదాయం సమకూరు తోంది. ఇందులో నికరంగా రూ.30 కోట్ల వార్షిక ఆదాయం ఉంటుంది. సాధారణ ప్రయోజన నిధి(కామన్ గుడ్ ఫండ్) 5 శాతం, ఆడిట్ రుసుం 1.5 శాతం, దేవాదాయ పరిపాలన నిధి(ఎండోమెంట్ అడ్మినిస్ట్రేషన్ ఫండ్) 12 శాతం, అర్చక సంక్షేమ నిధి 3 శాతం.. ఇలా 21.5 శాతాన్ని నికర ఆదాయం నుంచి చెల్లించాలన్నది నిబంధన. ఏడాదికి రూ.5 కోట్లకు పైగా పన్నులు భరించాలి. 2016 నుంచి 2025-26 లెక్కలను పరిశీలిస్తే ఎప్పటి పన్నును అప్పుడు పూర్తిస్థాయిలో చెల్లించలేకపోతున్నారు. గల్లా పెట్టెలో కాస్త మిగులు కనిపిస్తే చాలు బాకీ చెల్లిస్తున్నారు. సాధారణ ప్రయోజన నిధి రూపంలో రూ.2 కోట్లకు పైగా చెల్లించారు. మిగతా వాటిని ఆయా ఖాతాలకు జమ చేయాలంటే అది కచ్చితంగా ఆలయ ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం పడుతుంది. కనీసం ఇప్పటి వరకు ఉన్న బాకీ రద్దు చేసి ఇక నుంచి క్రమం తప్పకుండా వసూలు చేసుకోవాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విజిలెన్స్ అధికారులు 2016 నుంచి 2025 వరకు గల లావాదేవీల పత్రాలను తనిఖీ చేస్తుండడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. పన్నుల్లో కొంత బకాయి ఉన్నప్పటికీ చెల్లింపులన్నీ పారదర్శకంగా ఉన్నాయని ఈఓ దామోదర్‌రావు తెలిపారు.

**ఆడిటింగ్‌పై దృష్టి సారించాలి**

రామాలయం ఆధ్వర్యంలో జరిగే క్రయవిక్రయాలపై జీఎస్టీ ప్రభావం




పడుతూనే ఉంది. ఈ తరహా పన్ను ఏ మేరకు ఉందన్నది తేలాలి. ఇదే క్రమంలో ఆడిటింగ్ అభ్యంతరాలు రూ.కోట్లలో పేరుకున్నాయి. ఈ అంశంపై భిన్న వాదనలు, ఫిర్యాదులు ఉన్నందున దృష్టి సారించాలి.

| పద్దు.. | రూ.(కోట్లలో) |
|---|---|
| దేవాదాయ పరిపాలన నిధి | 14.75 కోట్లు |
| అర్చక సంక్షేమ నిధి | 5.52 |
| ఆడిట్ రుసుము | 3.06 |
| సాధారణ ప్రయోజన నిధి | |

## నేర ప్రవర్తన.. ఏదీ పరివర్తన..?

నిజామాబాద్ : ఇటీవల నిజామాబాద్‌లో కానిస్టేబుల్ ప్రమోద్‌ను వాహన దొంగ రియాజ్ (24) హత్య చేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. కొద్దిరోజుల వ్యవధిలో హైదరాబాద్‌లో కరుడుగట్టిన నేరస్థుడు అన్సారీ (32) డీఎస్పీ గన్‌మెన్‌పై కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఇలాంటి ఘటనలు వరుసగా చోటుచేసుకుంటున్నాయి. పోలీసులపై తిరగబడేవారిలో యువకులైన నేరగాళ్లే ఎక్కువగా ఉంటున్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోనూ మొత్తం 355 మందిపై రౌడీషీట్లు కొనసాగుతుండగా.. వీరిలో మూడోవంతు మంది 20-35 ఏళ్ల లోపువారే కావడం గమనార్హం.

**వాహనం మాయమైనా.. చోరీ జరిగినా**

జిల్లాలో చోరీలు, ముఖ్యంగా వాహన దొంగలు పేట్రేగిపోతున్నారు. కొందరు యువకులు జల్సాలు, సులువైన సంపాదనకు పక్కదారి పడుతున్నారు. సెప్టెంబరు 28న.. ఐదో ఠాణా పరిధి బ్రాహ్మణ కాలనీలోని ఇంట్లో దొంగతనం జరిగింది. 33 తులాల బంగారం, నగదు మాయమైంది. ఇది.. ఐదుగురు సభ్యుల ముఠా పని. పట్టుబడిన షేక్ సల్మాన్(25), మరాఠి ఆకాశ్‌రావు(20)లు చిన్నవయసు వారే. పారిపోయిన మరో ముగ్గురిదీ పాతికేళ్ల లోపు వయసే. మరో ఘటనలో వాహనాలు చోరీ చేసే అంతర్రాష్ట్ర ముఠాను నిజామాబాద్ పోలీసులు ఇటీవల పట్టుకున్నారు. వారి వద్ద 9 ఆటోలు, 3 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ముఠా సభ్యులంతా 20-30 ఏళ్లలోపు వారే.

**మారకుండా.. మరింత ద్వేషంతో..**

ఏ నేర ఘటన జరిగినా, మూడు పదుల వయసు దాటని వారు నేరస్థులుగా చిక్కుతుండటంపై జిల్లా పోలీసు అధికారులు నివ్వెరబోతున్నారు. సత్ప్రవర్తనతో జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాల్సింది పోయి, చిన్న వయసులో కటకటాల పాలవుతున్నారని వారు పేర్కొంటున్నారు. కొందరు బెయిల్‌పై విడుదలైన తర్వాత బుద్ధి మార్చుకోకపోవడం, సమాజం పట్ల మరింత ద్వేషంతో పాత నేర ప్రవృత్తిని కొనసాగిస్తుండటం అందరినీ కలవరపరుస్తోంది. ఇటీవల పోలీసు కాల్పుల్లో మరణించిన రియాజ్ నేపథ్యమే ఓ ఉదాహరణ. మూడుసార్లు బెయిల్‌పై బయటకొచ్చినా అతడు మారలేదు. చిన్నతనం నుంచే పిల్లల ప్రవర్తనను గమనించి, వారిని సరైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత కన్నవాళ్లపైనే ఎక్కువగా ఉంటుందని పోలీసు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. మత్తు అనర్థాలపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల్లో సమాజ చైతన్యానికి కృషిచేస్తున్నారు.

**మందలించో.. ప్రేమతో నచ్చజెప్పో**

కులమతాలకు అతీతంగా పండగలు, సంబరాలు జరుపుకొనే ఇందూరులో.. కొందరు ఆర్థిక, రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు యువతను పెడదోవ పట్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఒకరు వర్గ విభేదాల సృష్టికి, ఇంకొకరు గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాల్లో ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు యువతను కరుడుగట్టిన నేరస్థులుగా తయారు చేస్తున్నారు. జిల్లాలో అర్ధాంతరంగా చదువు మానేస్తున్న వారిలో ఎక్కువ మంది మెకానిక్, ఆటోవాలా, కూలి తదితర పనులపై ఆధారపడుతున్నారు. కొందరు సులువుగా ఎదిగేందుకు గంజాయి సరఫరా, దొంగతనాల బాటపడుతున్నారని పోలీసు చెబుతున్నారు. తొలి నేరం సమయంలోనే కన్నవాళ్లు, కుటుంబీకులు గట్టిగా మందలించో, ప్రేమతో నచ్చజెప్పో పిల్లలను మార్చాలని సూచిస్తున్నారు. నేరగాళ్లతో స్నేహం చేయకుండా, గ్యాంగ్‌ల వెంట తిరగకుండా జాగ్రత్తపడాలన్నారు.


## మూడడుగులు ముందుకు.. రెండడుగులు వెనక్కు!

ఖమ్మం : వరదల నుంచి ఖమ్మం నగరవాసులను రక్షించేందుకు మున్నేరు నదికి రెండువైపులా కరకట్టలు (రిటైనింగ్ వాల్స్) నిర్మించేందుకు 'భూసేకరణ' అడ్డంకిగా మారింది. 2024 సెప్టెంబరులో మున్నేరుకు భారీ వరదలు రావటంతో దానవాయి గూడెం, పద్మావతినగర్, ఎఫ్‌సీఐ గోదాములు, సారథినగర్, వెంకటేశ్వరనగర్, కాల్వొడ్డు, బొక్కలగడ్డ, మోతీనగర్, రంగనాయకులగుట్ట, ప్రకాశ్‌నగర్, అగ్రహారం, ధంసలాపురం కొత్తకాలనీ, ఖమ్మం గ్రామీణ మండలం పెద్దతండా, జలగంనగర్, ఏదులాపురం, పోలేపల్లి ప్రాంతాలు నీటమునగటంతో స్థానికులు తీవ్ర నష్టం చవిచూశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు వరదపాలయ్యాయి. అందుకే వరద నిరోధానికి నదికి రెండువైపులా కరకట్టలు నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించింది. నదికి ఒక్కోవైపు 8.50 కి.మీ. పొడవున 35 అడుగుల ఎత్తులో కరకట్ట నిర్మించాలని నిర్ణయించింది. నదికి రెండువైపులా అందుబాటులోని ప్రభుత్వ భూమిలో నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇదంతా వరుసగా లేదు. అక్కడక్కడ ముక్కలుగా ఉంది. మధ్యలో పట్టా భూములు ఉండటం గమనార్హం.

**నష్టపరిహారంపై స్పష్టత వస్తేనే..**

ఖమ్మం గ్రామీణ మండలం వైపు కరుణగిరి చర్చి నిర్వాహకులు ఏడెకరాల భూమిని స్వచ్ఛందంగా అప్పగించారు. ఈస్థలంలో రక్షణ గోడ నిర్మాణం పూర్తయింది. పోలేపల్లి, గోళ్లపాడు, గుదిమళ్ల, గుర్రాలపాడు, ఏదులాపురం రెవెన్యూ పరిధిలో పట్టాభూములు సేకరించాల్సి ఉంది. ఖమ్మం అర్బన్ మండలంలో మామిళ్లగూడెం, దానవాయి గూడెం, బుర్హాన్‌పురం, ఖమ్మం రెవెన్యూ గ్రామాల్లోని పట్టా భూములు కోల్పోతున్న రైతులు ఎక్కువ మంది వ్యతిరేకతతో ఉన్నారు. తమ భూములు విలువైనవని, నష్టపరిహారం ఎంత చెల్లిస్తారో ముందుగా తేల్చాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ఖమ్మం గ్రామీణ మండలంలో 56.04 ఎకరాల పట్టా భూమి సేకరించాల్సి ఉండగా 24.07 ఎకరాలు ఇచ్చేందుకు రైతులు



అంగీకరించారు. ఖమ్మం అర్బన్ మండలంలో 82.27 ఎకరాలకు 45.05 ఎకరాలు అప్పగించేందుకు కర్షకులు మొగ్గుచూపారు. ఖమ్మం గ్రామీణ మండలం వైపు మున్నేరులో 8.50 కి.మీ. కరకట్ట (సిమెంట్ కాంక్రీట్ రిటైనింగ్ వాల్) నిర్మించాలి. 3,018 మీటర్ల పనులు పురోగతిలో ఉన్నాయి. 90 మీటర్ల గోడ నిర్మాణం పూర్తయింది. ఖమ్మం అర్బన్ మండలం వైపు మున్నేరులో 8.50 కి.మీ. కరకట్ట నిర్మాణంలో 2,379 మీటర్ల పనులు పురోగతిలో ఉన్నాయి. 980 మీటర్ల గోడ నిర్మాణం పూర్తయింది.

'భూసేకరణలో సమస్యలున్నా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచనలతో ముందుకు సాగుతున్నాం. భూమి కోల్పోయిన వారికి అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వాలని నిర్ణయించాం. ప్రకాశ్‌నగర్ నుంచి ధంసలాపురం కొత్తకాలనీ వరకు మున్నేరు నదికి రెండువైపులా సుమారు 12 కి.మీ. పొడవుతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సర్వే జరుగుతోంది' అని ఖమ్మం నీటిపారుదలశాఖ ఎస్‌ఈ మంగళపుడి వెంకటేశ్వర్లు తెలిపారు.

## బడ్జెట్ కూర్పులో సాటిలేని మేటి కొణిజేటి - డిసెంబర్ 4.. కొణిజేటి రోశయ్య వర్ధంతి



ఆయన సీనియర్ రాజకీయ నాయకుడు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వివిధ కీలక శాఖల మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కర్ణాటక, తమిళ నాడు గవర్నర్ గా విధులు నిర్వర్తించిన అరుదైన అవకాశాలు పొందిన రాజకీయ దురంధరుడు. బడ్జెట్ తయారీ స్పెషలిస్టుగా, తన వాగ్ధాటితో శాసన సభ్యులను, మండలి సభ్యులను ఆకట్టుకున్న ప్రత్యేక శైలిని కలిగి ఉన్న ఘనుడు. విపక్షాలకు శాసన సభలో, మండలిలో ధీటైన సమాధానాలు చెప్పి ఒప్పించిన చతురుడు. 15సార్లు రాష్ట్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన అరుదైన గౌరవం పొందిన మంత్రి. ఆయనే కొణిజేటి రోశయ్య. ఆచార్య ఎన్జీ రంగా శిష్యుడిగా రాజకీయ రంగ ప్రవేశం చేసిన రోశయ్య అనేక పదవులు నిర్వహించారు. ఎమ్మెల్యేగా ..ఎమ్మెల్సీగా..ఎంపీగా చట్ట సభల్లో సుదీర్ఘ కాలం పని చేసిన ఘనత ఆయనకే దక్కింది. 1968-85: శాసనమండలి సభ్యుడుగాబీ 1978-79: శాసన మండలిలో ప్రతిపక్ష నేతగాబీ 1979-83: రాష్ట్ర మంత్రిగాబీ 1985-89: తెనాలి శాసన సభ్యునిగాబీ 1989-94: మంత్రిగాబీ 2004-09: చీరాల శాసన సభ్యునిగాబీ 2004 : మంత్రిగాబీ 2009 : రాష్ట్ర శాసన మండలి సభ్యునిగాబీ 2009, సెప్టెంబరు - 2010 నవంబరు 24: ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రిగాబీ 3 సెప్టెంబరు 2009 %-% 25 జూన్ 2011 వరకు, కర్ణాటక గవర్నర్ గా 28 జూన్ 2014 %-% 31 ఆగస్టు 2014 వరకు, తమిళ నాడు గవర్నర్ గా 31 ఆగస్టు 2011 %-% 30 ఆగస్టు 2016 వరకు పని చేశారు. వివిధ పదవులు అనుభవించిన, సమర్ధ వంతంగా నిర్వహించిన సుధీర్ఘ రాజకీయ అనుభవ శాలి రోశయ్య. 1933, జూలై 4న గుంటూరు జిల్లా వేమూరు గ్రామములో జన్మించారు. గుంటూరు హిందూ కళాశాలలో కామర్స్‌లో డిగ్రీ పూర్తి చేశారు. రోశయ్య విద్యార్థి దశలోనే ఎన్జీ రంగా శిష్యుడిగా రాజకీయ రంగ ప్రవేశం చేసారు. ఆయన 1968,1974, 1980,2009 లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 1979లో టంగుటూరి అంజయ్య ప్రభుత్వంలో రవాణ, గృహ నిర్మాణం, వాణిజ్య పన్నుల శాఖలు, 1982లో కోట్ల విజయ భాస్కరరెడ్డి ప్రభుత్వంలో హెూం శాఖ, 1989లో మర్రి చెన్నారెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక, రవాణ, విద్యుత్తు శాఖలు, 1991లో నేదురుమల్లి జనార్ధనరెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక, ఆరోగ్య, విద్య, విద్యుత్తు శాఖలు, 1992లో కోట్ల విజయ భాస్కర రెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక, ఆరోగ్య, విద్య, విద్యుత్తు శాఖలకు మంత్రిగా పనిచేసారు. 1994 నుంచి 1996 వరకు ఆయన పీసీసీ అధ్యక్షుడిగా పని చేసారు. 1998లో నరసరావుపేట నియోజకవర్గం నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2004, 2009లో వై.యస్. రాజశేఖర రెడ్డి ప్రభుత్వములో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిం చారు. ఆయన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ (ఆర్థిక ప్రణాళిక)ను ఇప్పటికి 15 సార్లు ఆంధ్ర ప్రదేశ్ శాసనసభలో ప్రవేశపెట్టారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలో సుదీర్ఘకాలం పాటు ఆర్థికమంత్రిగా పనిచేసిన రోశయ్య 2009-10 బడ్జెటుతో కలిపి మొత్తం 15 సార్లు రాష్ట్ర బడ్జెటును ప్రవేశ పెట్టారు. ఇందులో చివరి 7 సార్లు వరుసగా ప్రవేశ పెట్టడం విశేషం. అలా బడ్జెట్ కూర్పులో రోశయ్య సాటిలేని మేటి గా పేరు పొందారు. ముఖ్యమంత్రిగా వై.ఎస్. రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందడంతో 2009, సెప్టెంబర్ 3 న రోశయ్య ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసారు. పద్నాలుగు నెలలు అధికారంలో కొనసాగిన అనంతరం 2010 నవంబరు 24 వ తేదీన తన పదవికి రాజీనామా చేసారు . 2011 ఆగస్టు 31న రోశయ్య తమిళనాడు రాష్ట్ర గవర్నరుగా ప్రమాణ స్వీకారం చేశారు. 2016 ఆగస్టు 30 వరకూ గవర్నరుగా తన సేవలు అందించారు. 2007లో ఆంధ్ర విశ్వవిద్యాలయం రోశయ్యకు గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. 2018 ఫిబ్రవరి 11 నాడు టి.సుబ్బి రామిరెడ్డి లలిత కళాపరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్యను గజమాలతో సత్కరించి జీవన సాఫల్య పురస్కారం అందించారు. ఈ వేడుకలో ముఖ్య అతిథిగా వెంకయ్య నాయుడు... రోశయ్యకు స్వర్ణ కంకణం బహుకరించారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ రోశయ్య (88) గత సంవత్సరం డిసెంబర్ 4న ఉదయం రక్త పోటు తగ్గి, ఆస్పత్రికి తరలించ బడి, మార్గమధ్యలోనే మృతి చెందారు. రోశయ్య తెలుగు ప్రజల హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించు కున్నారు. **రామ కిష్టయ్య సంగన భట్ల...9440595494**

## ఇంధన రహితం.. కేంద్రం అభిమతం




భగత్‌నగర్ : జిల్లా ఎలక్ట్రికల్ ఛార్జింగ్ స్టేషన్లకు అడ్డా కాబోతోంది. కేంద్ర ప్రభుత్వం శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గిస్తూ పునరుత్పాదక వనరుల వినియోగాన్ని పెంచడానికి ఎలక్ట్రికల్ వాహనాలను ప్రోత్సహిస్తోంది. మరో వైపు కాలుష్యాన్ని తగ్గించాలని చూస్తోంది. దీనిలో భాగంగా ఎలక్ట్రికల్ వాహనాలు(ఈవీ)లకు ఆర్థికంగా ప్రోత్సాహకాలు ఇస్తున్నా.. వినియోగం మాత్రం అనుకున్న స్థాయిలో లేదు. అందుబాటులో ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడమే దీనికి కారణమని తెలుస్తోంది. ఈ ఇబ్బందులను తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం జిల్లాలో 150 స్టేషన్లు మంజూరు చేసింది.

**నూరు శాతం రాయితీ..**

జిల్లావ్యాప్తంగా 14 ఈవీ ఛార్జింగ్ స్టేషన్లే ఉన్నాయి. ప్రయాణం మధ్యలో ఛార్జింగ్ తగ్గితే తిరిగి పెట్టుకోవడానికి అందుబాటులో కేంద్రాలు లేకపోవడంతోనే వీటి కొనుగోళ్లలో పురోగతి లేదు. ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే స్థలాలను ఏ, బీ, సీ, డీ నాలుగు విభాగాలుగా గుర్తించి రాయితీలు ప్రకటించింది.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్థలాలను 'ఏ' కేటగిరీగా గుర్తించింది. దీని కింద ఏర్పాటు చేసే వాటికి కేంద్రం నూరు శాతం మౌలిక సదుపాయాలకు నిధులు ఇస్తుంది. ఎలక్ట్రిక్ వెహికిల్ సప్లయ్ ఎక్విప్‌మెంట్ (ఈవీఎస్‌ఈ)కు అయ్యే ఖర్చు నిధులు అందజేస్తుంది.

ఏ, బీ కేటగిరీలో లేని ప్రాంతాలు షాపింగ్ మాల్‌లు, మార్కెట్ కాంప్లెక్స్‌లలో ఏర్పాటు చేసే వాటికి మౌలిక సౌకర్యాలకు మాత్రం 80 శాతం రాయితీ ఇవ్వనుంది

బ్యాటరీ మార్చే కేంద్రాలను 'సీ' కేటగిరీగా గుర్తించారు. మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు 80 శాతం రాయితీ కింద కేంద్రం నిధులు ఇస్తుంది.

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, పబ్లిక్ సెక్టార్ల ఆధీనంలో లేదా నిర్వహణలో ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేసే ఈవీ ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవచ్చు. ఆయా ప్రాంతాలను 'బీ' కేటగిరీగా గుర్తించింది. రైల్వే స్టేషన్లు, విమానాశ్రమాలు, ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల విక్రయ కేంద్రాలు, బస్‌స్టేషన్లు, నగర, పురపాలక పార్కుల్లో ఏర్పాటు చేసేవాటికి మౌలిక సౌకర్యాల ఏర్పాటుకయ్యే ఖర్చులో 80 శాతం, ఈవీఎస్‌ఈకి అయ్యే ఖర్చుకు 70 శాతం నిధులను కేంద్రం ఇస్తుంది. మిగతా నిధులు సంబంధిత శాఖ పెట్టాల్సి ఉంటుంది.

**జిల్లాలో 48 ప్రాంతాల గుర్తింపు**

విద్యుత్తు అధికారులు జిల్లా కేంద్రంతోపాటు హైవేలలో ప్రభుత్వ, పబ్లిక్ రంగ సంస్థల స్థలాల్లో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడానికి 48 ప్రాంతాలను గుర్తించాం. ఇందులో 24 ప్రభుత్వ స్థలాలు, 12 ప్రభుత్వ రంగ సంస్థల స్థలాలు ఉన్నాయి. బ్యాటరీ మార్చుకునే స్థలాలను ఇంకా గుర్తించలేదు. మేక రమేశ్‌బాబు, ఎస్‌ఈ, విద్యుత్తు శాఖ

## వంట కార్మికులకు ఉపశమనం

కరీంనగర్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం వంట ధరలను ప్రభుత్వం పెంచడంతో వంట కార్మికులకు కొంత ఉపశమనం లభించింది. కొన్ని రోజులుగా మెస్ ఛార్జీలు పెరగక ఇక్కట్లు పడుతున్నామని పేర్కొన్న కార్మికులు ప్రభుత్వ నిర్ణయంతో సంతోషపడుతున్నారు. ఈ నేపథ్యంలో పెంచిన వంట ధరలను వెంటనే అమలు చేయాలని జిల్లా విద్యాశాఖకు ఉత్తర్వులు జారీ చేశారు.

**1050 మందికి లబ్ధి..** జిల్లాలోని 619 ప్రభుత్వ విద్యాసంస్థల్లో మధ్యాహ్న భోజనం వంట ఏజెన్సీలు ఉన్నాయి. వాటిల్లోని 1050 మంది కార్మికులకు పెంచిన వంట ధరలతో ఊరట లభిస్తుంది. ఒక్కో విద్యార్థికి ప్రాథమిక పాఠశాలల్లో 74 పైసలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో రూ.1.12 పైసల చొప్పున వంట ధరలు పెంచారు. ఈ నిర్ణయంతో వంట కార్మికులకు కొంత ప్రయోజనం చేకూరనుంది.

**619 పాఠశాలల్లో..**

జిల్లాలోని 619 ప్రభుత్వ విద్యాసంస్థల్లో 1-10వ తరగతి వరకు విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రస్తుతం దీని కింద 37,055 మంది ప్రయోజనం పొందుతున్నారు. మధ్యాహ్న భోజనం కోసం ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం అందిస్తోంది. మిగిలిన వంట సరకులను వంట ఏజెన్సీల నిర్వాహకులు స్వతహాగా కొనుగోలు చేస్తున్నారు. వాటికి నెలనెలా విద్యాశాఖ బిల్లుల రూపంలో నిధులను చెల్లిస్తున్నారు. ఈ సరకులకు ఖర్చుల కోసం వంట కార్మికులకు చెల్లించే ధరలను ప్రభుత్వం పెంచింది.



**వేతనాలు పెంచాలి** ప్రభుత్వం వంట ధరలను పెంచడంతో కార్మికులకు ఊరట కల్గింది. బిల్లులను నెలనెలా చెల్లించేలా ప్రభుత్వం దృష్టి నిలపాలి. వంట కార్మికులకు నెల వేతనం రూ.10 వేల చొప్పున చెల్లిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వ హామీని వెంటనే అమలు చేయాలి. బాబాయమ్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం

## త్వరలో టీడీఆర్ సమస్యకు స్వస్తి

హైదరాబాద్: గ్రేటర్ పరిధిలో రహదారుల అభివృద్ధికి చాలా మంది తమ భూములను ఇచ్చారు.. చెరువుల సుందరీకరణకు ఆస్తులను అప్పగించారు. ఆయా భూముల్లో ప్రభుత్వం పైవంతెనలు, అండర్‌పాస్‌లను నిర్మించింది, రహదారులను విస్తరించింది. భూములు ఇచ్చినోళ్లు మాత్రం అవస్థలు పడుతూనే ఉన్నారు. ప్రభుత్వం టీడీఆర్(అభివృద్ధి బదలాయింపు హక్కు)ను అమ్ముకోలేక అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్, నగర ముఖ్య ప్రణాళికాధికారి సంతకాల కోసం నెలలపాటు వేచి చూస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించడంపై తాజాగా పురపాలకశాఖ దృష్టి పెట్టింది. టీడీఆర్‌ను యజమానులు స్వేచ్ఛగా అమ్ముకునే వెసులుబాటు కల్పించాలని ప్రాథమికంగా నిర్ణయించింది.

సర్టిఫికెట్ల జారీ జీహెచ్ఎంసీ 2017 నుంచి జరిగిన అభివృద్ధి పనులకు రూ.10వేల కోట్ల విలువైన టీడీఆర్ సర్టిఫికెట్లు జారీ చేసింది. నగదు రూపంలో నష్ట పరిహారం చెల్లించలేక, టీడీఆర్ సర్టిఫికెట్లను జారీచేసింది. కాంగ్రెస్ సర్కారు ఏర్పడ్డాక.. కొత్త టీడీఆర్ జారీ కాలేదు. క్రమంగా డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం 50శాతం ధర పలుకుతోంది. అయితే అధికారుల రూపంలో వారికి కొత్త సమస్య ఎదురైంది. కమిషనర్



ఆర్వీ కర్ణన్ చాలా రోజులపాటు సర్టిఫికెట్ల అమ్మకం దరఖాస్తులను పక్కనపెట్టారు. కొంత కాలంగా సంతకాలు చేస్తున్నా.. తమ ఆస్తిని అమ్ముకునేందుకు అధికారి సంతకం ఎందుకని బాధితులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సంతకాలు అవసరం లేదనే ఉత్తర్వు వచ్చాక.. టీడీఆర్ బ్యాంక్ పేరుతో సరికొత్త వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని ఓ అధికారితో చెప్పారు.

## ధాన్యం కొనుగోళ్లలో.. ఆధునిక యంత్ర దన్ను..!

పెనుబల్లి: అన్నదాతలు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ఆధునిక సాంకేతిక యంత్రాలు దన్నుగా నిలుస్తున్నాయి. వీటి వినియోగంతో అక్రమాలకు అడ్డుకట్ట పడుతోంది. ఖరీఫ్‌లో ఖమ్మం జిల్లాలో 3.02 లక్షల ఎకరాలు, భద్రాద్రి జిల్లాలో 1.74 లక్షల ఎకరాల్లో వరి సాగుచేయగా సుమారు 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో ఖమ్మం జిల్లాలో 3.69 లక్షల టన్నులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2.38లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని నిర్ణయించారు. గ్రామాల్లో ఐకేపీ, సొసైటీల ద్వారా సన్న, దొడ్డు రకాల వడ్ల కొనుగోలుకు ఖమ్మం జిల్లాలో 326 ధాన్యం కొనుగోలు కేంద్రాలు, భద్రాద్రి జిల్లాలో ఇప్పటివరకు 138 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుత నిబంధనలకు అదనంగా నూతన మార్గదర్శకాలనూ జారీ చేశారు. ఇందుకు అవసరమైన పరికరాలను కొనుగోలు కేంద్రాలకు అందించారు.

**తేమశాతాన్ని తగ్గించేందుకు..**

రైతులు కేంద్రాలకు తెచ్చిన ధాన్యంలో తేమశాతాన్ని తగ్గించేందుకు ఈసారి 'ప్యాడీ డ్రయర్'ను వినియోగించుకోవచ్చు. ఈయంత్రం రెండున్నర గంటల్లో 20 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆరబెడుతుంది. ఖమ్మం జిల్లాలోని కల్లూరు, మధిర, నేలకొండపల్లి, వైరా మార్కెట్ కమిటీల పరిధిలో నాలుగు, భద్రాద్రి జిల్లాలో ఒక డ్రయర్‌ను అందుబాటులో ఉంచారు.

**గ్రెయిన్ కాలిపర్‌తో గుర్తింపు..**

సన్నరకం ధాన్యం నాణ్యతను కొలిచేందుకు గ్రెయిన్ కాలిపర్ అనే పరికరాన్ని వినియోగిస్తున్నారు. గింజ నిడివి, వెడల్పును కొలుస్తారు. పొడవు 6 మి.మి. కంటే తక్కువ, వెడల్పు 2 మి.మి. కంటే తక్కువగా ఉంటేనే సన్నాలుగా నిర్ధారిస్తారు.



**ప్రతి బస్తాకు కోడ్..**

రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తోంది. గోనెసంచులను రివర్స్ తీసి అందులో ధాన్యం నింపుతారు. అనంతరం ఎరుపు రంగు దారంతో కుట్టడంతో పాటు ప్రతి బస్తాపై ఎరుపు రంగుతో 'ఎస్'అనే అక్షరంతో కోడ్ రాస్తారు. దొడ్డు రకానికి ఆకు పచ్చరంగు కోడ్ వేస్తారు.

**బినామీలకు చెల్లుచీటీ..**

ధాన్యం కొనుగోళ్లలో బినామీలకు చెక్ పెట్టేందుకు ఐరిస్ విధానాన్ని అమలుచేస్తున్నారు. కేంద్రాల నుంచి లారీల్లో ధాన్యాన్ని పంపే సమయంలో ఓటీపీ వినియోగించేవారు. ఈసారి క్రయవిక్రయాలన్నీ కనుపాపల ఆధారంగా సాగనున్నందున బినామీ దందాలకు అడ్డుకట్ట పడనుంది.

**పొట్టు తీసేందుకు.. ప్యాడీ హస్కల్..**

ప్రభుత్వం 33 రకాల సన్నాలను గుర్తించింది. వీటిని చేతులతో గట్టిగా నలిపి బియ్యం నాణ్యత పరిశీలించేవారు. తాజాగా ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక ప్యాడీ హస్కల్ పరికరాన్ని అందించారు. గుప్పెడు ధాన్యం అందులో పోసి తిప్పితే పొట్టు ఊడిపోయి బియ్యం బయటికొస్తాయి. అనంతరం నాణ్యతను నిర్ధారిస్తారు.

## కొబ్బరి.. ఇక్కడే ఊపిరి!

అశ్వారావుపేట : 'అశ్వారావుపేట కొబ్బరి విత్తనోత్పత్తి క్షేత్రంలో నూతన హైబ్రీడ్ గింజలను ఇటీవల నాటాం. అవి కాపు కాస్తే వాటి ద్వారా విత్తనోత్పత్తికి శ్రీకారం చుడతాం' అని డీహెచ్ఎస్ఓ జంగా కిశోర్‌కు తెలిపారు.కొబ్బరి తోటలు అనగానే ముందుగా ఏపీలోని కోనసీమ గుర్తుకొస్తుంది. కోనసీమకు ఏమాత్రం తీసిపోని విధంగా రూపుదిద్దుకుంటున్నాయి అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని కొబ్బరి క్షేత్రాలు. కొబ్బరిలో అంతరపంటలుగా కోకో, వక్క తోటలతో అలరారుతున్న అశ్వారావుపేట ప్రాంతాన్ని తెలంగాణ కోనసీమ అంటూ ముద్దుగా పిలుచుకుంటారు. అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో సుమారు 7వేలకు పైగా కొబ్బరి తోటలు విస్తరించాయి. ఆయిల్‌పాం హబ్‌గా పేరొందిన అశ్వారావుపేట ప్రాంతం.. కొబ్బరి క్షేత్రాలు, కొబ్బరి నర్సరీలతో పచ్చందం పరచుకున్నట్లు కనువిందు చేస్తుంది. ఇక్కడ అధికంగా ఈసీ టాల్(ఈస్ట్‌కోస్ట్ టాల్), గంగాబోండాం, మలయన్ ఎల్లో డ్వార్ఫ్, మలయన్ గ్రీన్ డ్వార్ఫ్, మలయన్ ఆరెంజ్ డ్వార్ఫ్, గంగా గోదావరి రకాలు ఉన్నాయి.

పదేళ్లలో కొబ్బరి విత్తనాల విక్రయం ద్వారా అశ్వారావుపేట కొబ్బరి విత్తనోత్పత్తి క్షేత్రం సుమారు రూ.3కోట్లు సముపార్జించింది.

ఏటా లక్షలాది మొక్కల ఎగుమతి..!

ఉద్యానశాఖ ఆధ్వర్యంలో అశ్వారావుపేట, అచ్యుతాపురం నర్సరీల్లో కొబ్బరి మొక్కలు పెంచుతున్నారు. అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో పదుల సంఖ్యలోని ప్రైవేటు నర్సరీల్లో లక్షలాది కొబ్బరి మొక్కలు పెంచుతుండటం గమనార్హం. ఒక్కో మొక్కను ప్రభుత్వ నర్సరీల్లో రూ.70కు విక్రయిస్తుండగా, ప్రైవేటు నర్సరీల్లో రూ.100-150కు అమ్ముతున్నారు. ఏటా ఈ ప్రాంత నర్సరీల నుంచి తెలంగాణలోని జిల్లాలకే కాకుండా ఏపీలో కడప, కర్నూలుతో పాటు ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, అస్సాం రాష్ట్రాలకు 5-6లక్షల కొబ్బరి మొక్కలను ఎగుమతి చేస్తున్నారు.

వందలాది మందికి ఉపాధి..!ఇంతగా విస్తరించిన కొబ్బరి నర్సరీల్లో పదుల సంఖ్యలో కూలీలకు ఉపాధి లభిస్తోంది. లక్ష మొక్కలు పెంచే నర్సరీలో ఏడాది పొడవునా ఆరు నుంచి ఎనిమిది మందికి పని దొరుకుతోంది. సీజన్ (విత్తనం నాటేటప్పుడు, లారీల్లో లోడు చేసేటప్పుడు)లో 25మందికి పని లభిస్తుంది. సగటున ప్రతి సంవత్సరం సుమారు రూ.5కోట్ల నుంచి రూ.7కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయి. తెలంగాణలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఏకైక కొబ్బరి నర్సరీ అశ్వారావుపేటలో కొనసాగుతోంది. 50 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఈ క్షేత్రంలో ఏటా 1-1.50 లక్షల మొక్కలను ఉత్పత్తి చేస్తుంటారు.

# నైపుణ్యం పెంచుకో.. భవితను మలుచుకో

కర్నూలు : నేటి ఆధునిక ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతోంది. రోజుకో నూతన ఆవిష్కరణ వెలువడుతోంది. ఈ పరిస్థితుల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాల్సి ఉంటుంది. ఈ దిశగా యువతను సన్నద్ధం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నైపుణ్య శిక్షణ అందిస్తున్నాయి.

కర్నూలు నగరంలోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 2016లో తెదేపా ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ తరగతులు ప్రారంభించింది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనే ఈ తరగతులు నిర్వహించేవారు. 2019 నుంచి ఐదేళ్ల పాటు వైకాపా ప్రభుత్వం దీనిని పట్టించుకోలేదు. ఆ సమయంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటరు నిర్వీరం కాకుండా జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యమే నిర్వహణ బాధ్యతలు తీసుకుంది. 2016 నుంచి ఇప్పటివరకు ఈ కేంద్రంలో సుమారు 6 వేల మంది యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడంతోపాటు ఉద్యోగావకాశాలు కల్పించారు.

9, 10వ తరగతి, ఇంటర్ జనరల్, ఒకేషనల్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు.దరఖాస్తుల స్వీకరణకు జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 'సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్' హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు.

పాఠశాలల హెచ్‌ఎంలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు తమ చిరునామాతో దరఖాస్తు చేయాలి. తమ పాఠశాల, కళాశాల నుంచి ఎంతమంది శిక్షణ తీసుకుంటారన్న వివరాలను స్పోక్‌లో అందజేయాల్సి ఉంటుంది. విద్యా సంస్థల ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏటా నవంబరు 7 నుంచి డిసెంబరు 6వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. వ్యక్తిగతంగా స్పోక్ సెంటరును సంప్రదించి దరఖాస్తు చేసుకున్నవారికి వేసవి సెలవుల్లో 40 రోజుల పాటు శిక్షణ ఇస్తారు.

వివరాలు ఇవీ..డిజైన్ కంప్యూటర్ బేస్ ట్రైనింగ్ (సీబీటీ), ఎలక్ట్రానిక్స్ హోమ్ అప్లయన్స్, మ్యానుఫ్యాక్చరింగ్ కంప్యూటర్ న్యూమరికల్ కంట్రోల్స్ (సీఎన్‌సీ), మ్యానుఫ్యాక్చరింగ్ వెల్డింగ్, ఎలక్ట్రానిక్స్ ఆఫీస్ అప్లయన్స్ తదితర కోర్సుల్లో శిక్షణ ఉంటుంది.

**తక్కువ ఖర్చు**

మొత్తం ఐదు కోర్సులను బయట నేర్చుకోవాలంటే ఎక్కువ డబ్బు ఖర్చవుతుంది. బయట కంప్యూటర్ సెంటరులో ఒక్క సీబీటీ కోర్సులో శిక్షణ తీసుకునేందుకే రూ.2,500 నుంచి రూ.3 వేల వరకు రుసుం వసూలు చేస్తారు. స్కిల్ డెవలప్‌మెంటు సెంటరులో మాత్రం ఒక్కో అభ్యర్థి రూ.300 మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం కోర్సు పూర్తైనట్లు ధ్రువపత్రాలు అందజేస్తారు.

**ఒకేషనల్ వారికి ప్రయోజనం**

ఇంటర్‌లో వృత్తి విద్య చదువుతున్న విద్యార్థులు ఈ కోర్సుల్లో శిక్షణ తీసుకుంటే ఎంతో ఉపయోగం ఉంటుంది. వృత్తి విద్య అనంతరం ఏడాది బ్రిడ్జి కోర్సు చదివితే బీటెక్‌లో చేరొచ్చు. స్కిల్ సెంటరులో నేర్చుకున్న అంశాలే బీటెక్‌లో ఉంటాయి. దీంతో ఇంజినీరింగ్ విద్యను సులువుగా పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుంది.

**ఎవరిని సంప్రదించాలి**

స్కిల్ సెంటరులో నేర్పిస్తున్న కోర్సు వివరాలతోపాటు దరఖాస్తు ఎలా చేసుకోవాలన్న సమాచారం కోసం స్పోక్ సెంటరును సంప్రదించాల్సి ఉంటుంది. ఈ కేంద్రం బాధ్యతను డాక్టర్ ఎస్.నాగరాజరావు చూస్తున్నారు. పని వేళల్లో 94403 28621 నంబరుకు ఫోన్ చేసి ఆయన ద్వారా సమాచారం తెలుసుకోవచ్చు.

# జీవితాలను మలుపు తిప్పుతున్నాయ్

ఎమ్మిగనూరు : జాతీయ రహదారిపై మలుపులు ప్రాణాలు తీస్తున్నాయి. ఆదోని డివిజన్ పరిధిలోని కోటేకల్, ఆరేకల్ సమీపం, ముగతి, ముగతి శివారు తదితర ప్రాంతాల్లో ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఎమ్మిగనూరు మండల పరిధిలో ఈ ఏడాదిలో జరిగిన రహదారి ప్రమాదాల్లో 33 మంది చనిపోయారు. కోటేకల్ వద్ద తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఐదుగురు మృత్యువాత పడ్డారు.

**వీధి దీపాలు వెలగక..**

జాతీయ రహదారిని ఏడేళ్ల కిందట నిర్మించారు. రాయచూరు నుంచి మంత్రాలయం మీదుగా ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, బళ్లారి వరకు ఏర్పాటు చేశారు. దీని నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఎమ్మిగనూరు, ముగతి వద్ద జాతీయ రహదారిపై మూడు కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసిన వీధి దీపాలు సగం వరకు వెలగడం లేదు. రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన కాలువలు శిథిలావస్థకు చేరాయి. దీనికితోడు కంప చెట్లు పెరగడంతో వాహనాల రాకపోకలకు సమస్యలు ఏర్పడుతున్నాయి.

**నిద్రమత్తుతో ప్రమాదాలు..**

రహదారులపై తెల్లవారుజామున ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఎక్కువసేపు వాహనాలు నడపడంతో డ్రైవర్లు అలసిపోతుంటారు. మరోవైపు నిద్ర మత్తులో ఉంటారు. ఈ నేపథ్యంలో ఏమాత్రం కునుకు



తీసినా పెను ప్రమాదం తప్పదు. జాతీయ రహదారిపై వాహనదారులు కొద్దిసేపు అలసట తీర్చుకునేందుకు రెస్ట్ రూమ్‌లు నిర్మించాల్సి ఉంది. కానీ 167 నంబరు జాతీయ రహదారిపై అక్కడక్కడా ఏర్పాటు చేసినా నిర్వహణ అధ్వానంగా ఉంది.

**కానరాని ట్రామా కేర్ సెంటరు**

రహదారి ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు గంటలోపు వైద్య సేవలు అందిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడతారు. జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. క్షతగాత్రులను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుంటారు. ట్రామా కేర్ సెంటరు లేకపోవడంతో వైద్యులు ప్రథమ చికిత్స చేసి 70 కి.మీ. దూరంలో ఉన్న కర్నూలు ఆసుపత్రికి పంపుతున్నారు. ఈ నేపథ్యంలో సకాలంలో వైద్యం అందక చాలామంది మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు.

జాతీయ రహదారి నంబరు : 167

ప్రతిరోజూ వెళ్లే వాహనాలు : 10 వేలు

ఆదోని–మాధవరం వరకు : 54 కి.మీ.

# వ్యాధుల శోధన.. ఆరోగ్య సాధన



తిరుపతి: ఆధునిక ఆరోగ్య పరిశోధనలు మారుమూల గ్రామాలనూ చేరుకుంటున్నాయి. అక్కడి వ్యాధులను గుర్తించి పరిష్కార మార్గాలూ చూపుతున్నాయి. ప్రజారోగ్యానికి భరోసా కల్పించే దిశగా చంద్రగిరిలోని 'మోడల్ రూరల్ హెల్త్ రీసెర్చ్ యూనిట్ (ఎంఆర్‌హెచ్‌యూ)' కృషి చేస్తోంది. ఆంధ్రాలో ఉన్న ఏకైక యూనిట్ ఇదే. ఆరోగ్య విధానాల రూపకల్పనలో వెన్నెముకగా నిలుస్తోంది.

**ఏడాదికి రెండుసార్లు..**

ఎంఆర్‌హెచ్‌యూ ద్వారా ఏడాదికి రెండుసార్లు హెల్త్, న్యూట్రిషన్‌కు సంబంధించిన పరిశోధనలు జరుగుతాయి. పదిమందితో కూడిన శాస్త్రవేత్తలు, పీజీ స్కాలర్స్‌తో బృందం నిత్యం పరిశోధనలు చేస్తుంటారు. ప్రాజెక్టు బట్టి రూ.2 లక్షల నుంచి రూ.5 కోట్ల వరకు నిధులు వెచ్చిస్తుంటారు.

**విద్యార్థులకు శిక్షణ:** మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ల కింద విద్యార్థులకు ఆన్–జాబ్ ట్రైనింగ్ కల్పిస్తారు. పోషణ అభియాన్, ఆంత్రోపోమెట్రీ (ఎత్తు, బరువు, నడుము చుట్టుకొలత) గురించి ప్రజలకు ఎలా వివరించాలో శిక్షణ ఇస్తారు.

**పరిష్కార మార్గాలిలా..**

ఫ్లోరైడ్ నియంత్రణ: వాటర్ ఫిల్టర్లు మార్చడం, ట్యాంకులు శుద్ధి చేయడం, నీటిలో ఆలం వంటివి కలపడం వంటి పాలసీ మార్పులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. ఫ్లోరైడ్ శాతం గుర్తించే కిట్లను అందజేసింది.

**పోషకాహారం మార్పు :** రాగి జావ.. పిల్లల ఆరోగ్యంపై చూపుతున్న సానుకూల ప్రభావాలపై అధ్యయనం. ఆరోగ్య పథకాలు ప్రవేశపెట్టేలా సిఫార్సు.

అంటువ్యాధులపై : శ్రీకాకుళంలో చర్మవ్యాధులపై అధ్యయనం ఫలితంగా.. వసతిగృహాల్లో మెడికేటెడ్ సోప్‌ల పంపిణీ.

క్యాన్సర్ స్క్రీనింగ్: పాఠశాల, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు. ఎస్వీ మెడికల్, స్విమ్స్‌తో కలిసి అవగాహన.. గ్రామాల్లో పరీక్షల నిర్వహణ.

త్వరలో సాల్ట్ ప్రాజెక్టు

త్వరలో యూఎస్ సంస్థ సహకారంతో 'ఫోర్టిఫైడ్ సాల్ట్ ప్రాజెక్టు'ను చేపట్టనున్నాం ఉప్పులో ఐరన్, అయోడిన్, బీ12, కాల్షియం వంటి పోషకాల ప్రక్రియపై అధ్యయనం చేయనున్నారు.

వెన్నెల సాహితి, శాస్త్రవేత్త

రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రాజెక్టులు : 22

సాల్ట్ ప్రాజెక్టు ఖర్చు : రూ.2 కోట్ల వరకు

# విచారణ పూర్తి.. చర్యలే తదుపరి



పుత్తూరు : రాష్ట్రంలో గత వైకాపా ప్రభుత్వంలో ప్రకృతి సంపదను యథేచ్ఛగా కొల్లగొట్టేశారు.. అధికారంలోకి వచ్చిందే తడువుగా ఇసుకను ప్రధాన ఆదాయవనరుగా మార్చుకున్నారు.. జాతీయ హరిత ట్రైబ్యునల్, చివరకు సుప్రీంకోర్టు రంగంలోకి దిగినా వైకాపా నాయకులకు చెవికెక్కలేదు.. ఇలా ఐదేళ్ల దోపిడీపై కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. సమగ్ర విచారణ చేసి ఎంతమేరకు దోచారనేది లెక్కలు తేల్చారు. వివరాలు వెల్లడించి చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సన్నద్ధమైందని సమాచారం.

**ఉమ్మడి జిల్లాలో ఇలా..** చిత్తూరు జిల్లాలోని గత ప్రభుత్వంలో పలమనేరు ప్రాంతంలోని కౌండిన్య పరివాహక ప్రాంత ఇసుకను యథేచ్ఛగా అక్కడి ప్రజాప్రతినిధి రాష్ట్ర సరిహద్దులు దాటించి కర్ణాటకలో విక్రయించారు.

కుప్పం పరిసర ప్రాంతాల్లోని వాగులు, వంకలనూ వదల్లేదు. చివరకు రైతుల పొలాల్లోనూ దౌర్జన్యంగా ఇసుక తవ్వి తరలించారు. అటవీ ప్రాంతంలో చెట్లు తొలగించి ఇసుక తవ్వకాలు చేపట్టడం గమనార్హం. చిత్తూరు, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లో నీవా నదిలో యంత్రాలతో తవ్వేసి రూ.వందల కోట్లు గడించారు. నగరి కుశస్థలి నదిలో ఎలాంటి అనుమతులు లేకుండానే నిత్యం వందల ట్రాక్టర్ల ఇసుక తరలించేశారు. నాగలాపురంలోని అరణియార్, చంద్రగిరి, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో అక్కడి ఎమ్మెల్యేలు ఇసుక వ్యాపారం చేసి రూ.కోట్లు గడించారు. సూళ్లూరుపేట, గూడూరు, నాయుడుపేట తదితర ప్రాంతాల్లో నూ అక్రమ రవాణాతో ప్రజాప్రతినిధులు రూ.కోట్లు వెనుకేసుకున్నారు.

# మత్తు ముంచుతోంది!



పలమనేరు : గంజాయి మత్తు చాపకింద నీరులా పాకుతోంది. పోలీసులు అడ్డుకట్ట వేసినా కఠిన చర్యలు తీసుకున్నా యువత చేతికి చేరుతోంది. దీంతో వారు బానిసలుగా మారుతున్నారు. మత్తులో అఘాయిత్యాలకు పాల్పడి భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారు. ఏజెన్సీ నుంచి తిరుపతి, చిత్తూరు వస్తున్న గంజాయి ఇప్పుడు మదనపల్లె నుంచి పలమనేరుకు చేరుతోంది. **ఇవీ ఘటనలు..** ఇటీవల పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు అదృశ్యమయ్యారు. కుటుంబ సభ్యుల సమాచారంతో పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టగా తమిళనాడులో గంజాయి అమ్ముతున్నట్లు తేలింది. 12 ఏళ్ల బాలుడు పలమనేరు నుంచి మదనపల్లెకు బస్సులో వెళ్లి గంజాయి తీసుకొస్తూ పోలీసులకు చిక్కాడు. విశాఖపట్నం నుంచి రైలుమార్గం, లారీల్లో గంజాయి తిరుపతికి చేరుతోంది. అక్కడి నుంచి జిల్లా వ్యాప్తంగా సరఫరా చేస్తున్నారు. వి.కోట, కుప్పం ప్రాంతాలకు ఈ వ్యాపారం విస్తరించింది. పోలీసులు ప్రస్తుతం దీన్ని పూర్తిగా రూపుమాపడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. **డ్రోన్ల సాయం తీసుకుంటాం**గంజాయి అమ్మకాలు లేకుండా చేస్తాం. వినియోగించే వారిని పట్టుకోవడానికి డ్రోన్ల సాయం తీసుకుంటాం. కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

మురళీమోహన్, సీఐ, పలమనేరు

# పేరుకే ఉచితం.. అమలులో కష్టం

గూడూరు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత పేదలకు ఉచిత ఇసుక పథకాన్ని ప్రవేశ పెట్టింది. పలుచోట్ల మాత్రం ఇసుక పేదలకు అందడం లేదు. దూరానికి అనుగుణంగా ట్రాక్టర్ ఇసుక రూ.2500–4,000 పలుకుతోంది. దీంతో పేదలు గృహాలు నిర్మించుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు.

ప్రధానంగా గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో కొందరు అక్రమార్కులు ఉచితం మాటున ఇసుకను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం స్వర్ణముఖి నది, చల్లకాలువ, రొయ్యలవాగుల్లో నీటి నిల్వలు ఉండటంతో తవ్వకాలు జరిపే వీలులేదు. ఇదే అదనుగా భావించిన అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారు నిర్ణయించిన ధరకే నిర్మాణదారులు ఇసుక కొనుగోలు చేయాల్సిన పరిస్థితి.

**కనిపించని నిల్వలు**

కోట మండలం గూడలిలోని స్వర్ణముఖి నదిలో ఇసుక డీసిల్టింగ్ కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తవ్విన ఇసుకను విద్యానగర్ వద్ద నిల్వ చేసేలా యార్డును నెలకొల్పారు. ఈ ఏడాది అక్టోబరు నాటికి డంపింగ్ యార్డులో 50 వేల టన్నుల ఇసుకను నిల్వ ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఇసుక కొరత తలెత్తకుండా వర్షాకాలంలో అమ్మకాలు జరపాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలను



బేఖాతరు చేస్తూ వ్యాపారులు కనీసం 25 వేల టన్నులు కూడా నిల్వ చేయకపోవడం గమనార్హం. స్థానిక అవసరాల నిమిత్తం నిల్వ చేసిన ఇసుకను భారీ యంత్రాలతో తరలించి సొమ్ము చేసుకున్నారు. ప్రస్తుతం ఇసుక దొరకడం కష్టతరంగా మారింది. కోట మండలం రుద్రవరం, దొరువుకట్ట, వాకాడు మండలంలోని బాలిరెడ్డిపాలెం, చిట్టమూరులోని మెట్టు వద్ద ఇసుకను దొడ్డిదారిన అమ్మేస్తున్నారు. ఇక్కడి నుంచి చెన్నై, బెంగళూరు పట్టణాలకు తరలుతోంది. నదిలో నీరున్నా యంత్రాలతో తవ్వి తరలించడం గమనార్హం.

ఈ విషయమై గనులశాఖ ఏడీ శ్రీనివాసరావు వివరణ కోరగా.. క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు చేపడతామని చెప్పారు.

# కలిసిరాని కాలం.. పరిశ్రమలకు తాళం

ఆదోని : ఆదోని పట్టణంలో 35 టీఎంసీ యూనిట్ల పత్తి పరిశ్రమలు ఉన్నాయి. ఇవి రోజూ నడవాలంటే సుమారు 60 వేల క్వింటాళ్ల పత్తి అవసరం. ప్రస్తుతం పరిశ్రమలకున్న డిమాండ్‌లో సగం సరఫరా కూడా ఉండటం లేదు. ఒక్కో పరిశ్రమకు రోజూ రెండు వేల క్వింటాళ్ల పత్తి అవసరం. వస్తున్న పత్తితో పరిశ్రమలు నడపడం కష్టసాధ్యంగా మారింది. పత్తి పరిశ్రమలు చిక్కుల్లో ఉన్నాయి. సరైన దిగుబడులు రాక తగినంత పనిలేకుండా పోయింది. ఈ ఏడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5.42 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అధిక వర్షాల కారణంగా వారి ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. 2025–26 సీజన్ త్వరగా ముగిసే అవకాశాలు కనిపిస్తున్నాయి. తేమ సమస్యతో రైతులు దిగుబడులు విక్రయిస్తున్నారు. ఫలితంగా కర్మాగారాలకు జనవరి వరకే పత్తి అందే అవకాశాలున్నాయి.

**అంచనాలు తారుమారు**

పత్తి బేళ్లు లెక్కకు మించి వస్తాయని భావించిన పరిశ్రమలకు నిరాశే ఎదురవుతోంది. అక్టోబరులో పత్తి సీజన్ ప్రారంభమై జూన్ వరకు అడపాదడపా నడుస్తుంది. ఈసారి పత్తి దిగుబడులు పడిపోవడంతో.. త్వరలో సీజన్ ముగిసేలా ఉంది. 2025–26 ఏడాదికి 8 లక్షల పత్తి బేళ్లు అమ్మకానికి వస్తాయని అంచనా. కానీ 5–6 లక్షల బేళ్లకు



పడిపోయిందని చెబుతున్నారు. ఈ ఏడాది ఆగస్టు వరకు పొలాల్లో పత్తి సాగు, కాపు అధికంగా ఉండేది. సెప్టెంబరు, అక్టోబరులో కురిసిన వర్షాలతో నష్టాలు తెచ్చిపెట్టాయి. జులైలో అత్యధికంగా క్వింటాకు గరిష్ఠంగా రూ.8,279 పలికింది. ఆ తర్వాత ధరలు తగ్గడం తప్ప పెరుగుదల లేదు.

**ఒక్కసారిగా పడిపోయి..**

గత నెల వరకు సీజన్ అంతంత మాత్రమే ఉండటంతో రోజుకు 20–25 వేల పత్తి బేళ్లు వచ్చేవి. ప్రస్తుతం దేశంలో అన్ని మార్కెట్లకు దిగుబడులు రావడం ఊపందుకుంది. రోజుకు 1.30 లక్షల బేళ్లు అమ్మకానికి వస్తున్నాయి. దిగుబడుల రాకతో పత్తి గింజలు, దూది ధరలు తగ్గాయని పలువురు పేర్కొంటున్నారు. గత నెలలో పత్తి గింజలు క్వింటా రూ.4,100 ఉండగా.. ప్రస్తుతం రూ.3,700, దూది బేల్ ధర రూ.52,500 ఉండగా.. ప్రస్తుతం రూ.50 వేలు–రూ.51 వేలకు పడిపోయిందని వ్యాపారులు చెబుతున్నారు.

**కుదేలవుతున్న పరిశ్రమలు**

ఒక్క టీఎంసీ యూనిట్ నెలకొల్పాలంటే రూ.10 కోట్ల పెట్టుబడి అవసరం. ప్రస్తుతం అందుకు తగ్గట్లు పత్తి సరకు లేక పరిశ్రమలు ఖాళీగా ఉంటున్నాయి. ఇప్పటికే ఏడెనిమిది పరిశ్రమలు మూత దిశగా అడుగులేస్తున్నాయి. పత్తి దిగుబడి బాగా వస్తేనే పరిశ్రమలు నడుస్తాయి. లేకుంటే పరిశ్రమలు గడ్డు పరిస్థితులను ఎదుర్కోవాల్సిన పరిస్థితి.

# కట్ట కరిగించి.. మట్టి ఆరగించి


నంద్యాల : కుందూ నది పూడిక మట్టిపై కన్నేసిన అక్రమార్కులు దానిని సొమ్ము చేసుకున్నారు. జాతీయ రహదారి నిర్మాణానికి పెద్దఎత్తున తరలించారు. ఎటువంటి అనుమతులు లేకుండానే కరిగించేశారు. కళ్ల ముందే అక్రమాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదు. కల్వకుర్తి–జమ్మలమడుగు 167కే జాతీయ రహదారి పనుల్లో భాగంగా నంద్యాల సమీపం నుంచి నొస్సం వరకు 62 కి.మీ. పొడవునా జరుగుతున్నాయి. రూ.691.81 కోట్లతో ఎస్‌ఆర్‌సీ సంస్థ ఈ పనులు చేస్తోంది. కోవెలకుంట్ల మండలంలోని రేవనూరు, గుండంపాడు, కలుగొట్ల, కోవెలకుంట్ల తదితర గ్రామాల పరిధిలో బైపాస్ రహదారి పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే భూసేకరణ పూర్తి చేశారు. మట్టి తరలించి గ్రావెల్ వేస్తున్నారు. పొలాలను చదును చేసేందుకు అక్రమంగా కుందూ మట్టిని కొల్లగొట్టారు.

**మీరే కాదు.. మేమూ చేస్తాం**

నాలుగేళ్ల కిందట కుందూలో పూడికతీత పనులు చేపట్టారు. పూడికతీతలో భాగంగా భారీగా వచ్చిన మట్టిని అప్పట్లో కొందరు వైకాపా నాయకులు విక్రయించారు. గత రెండేళ్లుగా ఈ మట్టిని మరికొందరు అమ్మడం ప్రారంభించారు. కాగా జాతీయ రహదారి ప్రాజెక్టు రావడం.. మట్టి అవసరం రావడంతో ఓ నేత సూచనతో కొందరు కుమ్మక్కై తరలించారు.

**అధికారులు దృష్టి సారించక..**

కోవెలకుంట్ల సమీపంలో కుందూ నుంచి మట్టి తరలుతున్నా జలవనరుల శాఖ అధికారులు పట్టించుకోలేదు. రెవెన్యూ సిబ్బంది



తమ పరిధి కాదన్నట్లు వ్యవహరించారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో జలవనరుల శాఖ అధికారులు ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విపణిలో ట్రాక్టరు మట్టి రూ.4 వేల నుంచి 5 వేలు ఉంది. వాహనాల్లో రోజుకు పదుల సంఖ్యలో తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం.

**నాడు తవ్వి.. నేడు తీసుకెళ్లి..**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో కుందూ నది ఆధునికీకరణ పేరుతో జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో పూడిక మట్టి తీశారు. భూసేకరణ చేయకుండానే ముందుగా ప్రభుత్వ భూముల్లో పూడిక తొలగించారు. కోవెలకుంట్ల సమీపంలోని కుందూ పరివాహక ప్రాంతంలో పూడిక తీసి నదికి కట్టలుగా వేశారు. వృథాగా ఉన్న ఈ మట్టిపై అక్రమార్కుల కన్ను పడింది. 167కే జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా గుత్తేదారు సంస్థకు మట్టి అవసరం వచ్చింది. స్థానిక నేతలు గుత్తేదారుడితో అవగాహన కుదుర్చుకుని కుందూ మట్టిని టిప్పర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకున్నారు.

# లక్షలు ఖర్చు చేసి.. నిర్లక్ష్యంగా వదిలేసి

కదిరి : రైతులు పండించిన పంటలకు సరైన ధరలు లేని సమయాల్లో, ప్రకృతి విపత్తుల్లో పంట ఉత్పత్తులు నిల్వ చేసుకోవడంతో పాటు వ్యవసాయ, ఉద్యాన శాఖల విత్తనాలు, ఎరువులు వంటి వాటిని పంపిణీ చేసేందుకు అనువుగా గత వైకాపా ప్రభుత్వం బహుళ ప్రయోజన సౌకర్య గోదాములు (ఎంపీఎఫ్‌సీ) నిర్మించింది. వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించిన రైతులకు ఉపయోగపడేలా, రైతు సేవా కేంద్రానికి అనుబంధంగా రూ.లక్షల వ్యయంతో ఈ గోదాముల నిర్మాణాలను చేపట్టింది. నాబార్డు నిధులతో ప్రాథమిక సహకార సంఘాలకు అనుబంధంగా ఈ నిర్మాణాలను చేపట్టారు. పంటలను నిల్వ చేయడంతోపాటు క్రయవిక్రయాలు చేయడానికి అనువుగా ఉండాలన్న లక్ష్యంతో నిర్మించిన గోదాములు శ్రీసత్యసాయి జిల్లావ్యాప్తంగా నిరుపయోగంగా ఉన్నాయి.

70 గోదాముల నిర్మాణాలు పూర్తి కాగా, 62 గోదాములను ప్రాథమిక సహకార సంఘాలకు అప్పగించారు. మిగిలిన 17 వివిధ నిర్మాణ



దశల్లో ఉన్నాయి. 500 మెట్రిక్ టన్నుల గోదాములను రూ.40 లక్షలు వ్యయంతో, 1000 మెట్రిక్ టన్నుల గోదాములను రూ.80 లక్షల వ్యయంతో నిర్మాణాలు చేపట్టారు.

**అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా..**

బహుళ ప్రయోజన సౌకర్య గోదాములు గ్రామాలకు దూరంగా నిర్మించారు. వీటిని వినియోగించు కోవడానికి రైతులు, వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. ఇవి అసాంఘిక కార్యక్రమాలకు, మందుబాబుల కు అడ్డాగా మారాయి. నిర్వహణ లేక గోడలు, ఇనుప షటర్లు, ఇతర సామగ్రి దెబ్బతింటున్నాయి.

**వినియోగంలోకి తీసుకొస్తాం**

డీసీవో, కృష్ణా నాయక్

నిర్మాణాలు పూర్తయిన 62 ఎంపీఎఫ్‌సీ గోదాముల్లో పాలసముద్రం వద్ద ఉన్న 2 గోదాములు వినియోగం ఉన్నాయి. మిగిలిన 60 గోదాములను కూడా ప్రాథమిక సహకార సంఘాల కమిటీలతో చర్చించి, వినియోగంలోకి తీసుకు వచ్చేలా చూస్తాం.

# 75 చీనీచెట్ల నరికివేత

తాడిమర్రి: మండలంలోని చిల్లకొండయ్యపల్లి గ్రామానికి చెందిన కొంకా చంద్రకళ అనే మహిళా రైతు తోటలో మూడేళ్ల వయసున్న 75 చీనీ చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. ఉదయం వ్యవసాయ పనుల కోసం తోటలోకి వెళ్లిన ఆమె చెట్లు నరికివేసినట్లు గుర్తించి బంధువులు, గ్రామస్థులకు తెలియజేసింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు స్టేషన్‌కు రమ్మని పిలవడంతో బాధితురాలు, గ్రామస్థులు కలిసి వెళ్లారు. ఎస్సై కృష్ణవేణి అందుబాటులో లేకపోవడంతో బాధితురాలి ఫిర్యాదుతో ఏఎస్సై రాజు కేసు నమోదు చేశారు. సంబంధిత ప్రతులను సీఐ శ్యామ్‌రావుకు పోలీసులు పంపించారు. వెంటనే సీఐ ఏఎస్సైకు ఫోన్ చేసి బాధితురాలికి ఎవరిమీదనైనా అనుమానం ఉందా అని ప్రశ్నించారు. గుర్తుతెలియని వ్యక్తులని ఫిర్యాదు చేసినట్లు ఏఎస్సై చెప్పడంతో, సీఐ బాధితురాలిని ఉద్దేశించి



అసభ్య పదజాలం వాడారు. కోపోద్రిక్తులైన బాధితురాలు, గ్రామస్థులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సీఐ క్షమాపణ చెప్పాలంటూ ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. ఈ విషయాన్ని పోలీసులు డీఎస్పీ హేమంత్ కుమార్‌కు తెలపడంతో ఆయన బాధితురాలితో చరవాణిలో మాట్లాడారు. ధర్మవరానికి రావాలని కోరడంతో అందరూ కలిసి అక్కడికి వెళ్లారు. బాధితులు ఫిర్యాదు చేసేందుకు వస్తే, సీఐ ఇలాగేనా ప్రవర్తించేదంటూ సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి.

# కొత్త పరిశ్రమలు.. ఉపాధి ఆశలు

కుప్పం : రాష్ట్ర సరిహద్దు ప్రాంతం. చదువుకోవాలన్నా.. ఉపాధి పొందాలన్నా ఇతర నగరాలకు వెళ్లాల్సిందే. అలాంటి కుప్పానికి నేడు పరిశ్రమలు వరుస కడుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపడంతో స్థానికంగానే యువతకు ఉపాధి లభించే అవకాశాలు ఎక్కువ అయ్యాయి.

**రోజంతా అక్కడే..** కుప్పం, పలమనేరు, పుంగనూరు తదితర ప్రాంతాల



నుంచి రోజూ వేలసంఖ్యలో బెంగళూరుకు వలస పోతారు. డిగ్రీ చదివిన ప్రతిఒక్కరూ ఏదో ఒకపని కోసం ఉదయాన్నే రైళ్లలో బయలుదేరి రాత్రివేళ ఇళ్లకు చేరుతారు. ప్రస్తుతం కుప్పంలో పరిశ్రమల ఏర్పాటుతో వీరికి సాంత్వన చేకూరనుంది. రూ.240 కోట్లతో 7 పరిశ్రమలు.. నియోజకవర్గంలోని 4 మండలాల్లో కడా ఆధ్వర్యంలో పరిశ్రమల స్థాపన జరుగుతోంది. 241.02 ఎకరాల్లో 7 పరిశ్రమలు స్థాపించేందుకు ముఖ్యమంత్రి ఇటీవల శంకుస్థాపన చేశారు.

**కుప్పం వదిలి వెళ్లలేకపోయా..**

నేను ఎంబీఏ పూర్తిచేశా. కుప్పం వదిలి వెళ్లే ఇష్టం లేదు. ఇక్కడే చిన్న వ్యాపారం ప్రారంభించా. ప్రస్తుతం పరిశ్రమల పనులు జోరుగా సాగుతున్నాయి. ఇక్కడే ఏదోఒక ఉద్యోగం చేసుకుంటా. పరిశ్రమల ఏర్పాటుతో చాలామందికి ఉపాధి దొరుకుతుంది.శ్రావణ్, కుప్పం

**బెంగళూరు నుంచి వచ్చేస్తా..**

నీరున్నచోట పరిశ్రమల స్థాపనకు వీలుంటుంది. హంద్రీనీవా జలాల రాకతో ఈ ప్రాంతం రూపే మారిపోతోంది. ఇంజినీరింగ్ చేసి బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నా. స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటైతే ఇక్కడికే వచ్చేస్తా. వలసలు తగ్గే అవకాశం ఉంది.జబివుల్లా, కుప్పం

# సమర్థ నిర్వహణ ఉంటేనే.. నిత్యం జలసిరులు



అనంతపురం : దశాబ్ద కాలం కిందట ఉమ్మడి అనంత జిల్లా కరవుకు నిలయం. ఇప్పుడు 'జల' సిరులతో రూపురేఖలే మారాయి. మొన్నటి దాకా తుంగభద్ర–ప్రధాన ఎగువ కాలువ(టీబీ హెచ్చెల్సీ) మాత్రమే ఏకైక దిక్కుగా నిలిచింది. ప్రజల దాహార్తి తీరితే చాలన్న భావన ఉండేది. తాజాగా.. హెచ్చెల్సీకి హంద్రీనీవా సుజల స్రవంతి(హెచ్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టు తోడవ్వడంతో 'జలకళ' సంతరించుకుంది. గతంతో పోల్చితే ఆయకట్టు సాగు విస్తీర్ణం రెట్టింపు స్థాయిలో పెరిగింది. హెచ్చెల్సీ, హంద్రీనీవా, చెరువుల కింద 6.19 లక్షల ఎకరాలకు నీటిని అందించే అవకాశం ఉంది. జలాశయాలు, చెరువుల్లో 62.373 టీఎంసీలు నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంది. ఇంతటి ప్రాధాన్యం.. కీలకమైన జలవనరుల శాఖకు అనుబంధంగా మెకానికల్ డివిజన్ లేకపోవడం గమనార్హం. తూతూమంత్రంగా చిన్న కార్యాలయం మాత్రమే ఉంది. హెచ్చెల్సీకి మాత్రమే అయితే డీఈ ఒకరే సరిపోతారు. ఇప్పుడు రెట్టింపు స్థాయిలో జలవనరుల శాఖ విస్తరించింది. మెకానికల్ డివిజన్ ఏర్పాటు అనివార్యంగా మారింది.

ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా హెచ్చెల్సీ, హంద్రీనీవా జలాశయాలు, కాలువల గేట్లు మొరాయిస్తున్నాయి. ఈ మధ్యనే ఎమ్పీఆర్ దక్షిణ కాలువ, పీఏబీఆర్ కుడి కాలువ, సుబ్బరాయసాగర్..వంటి గేట్లు మరమ్మతులకు గురయ్యాయి. పీఏబీఆర్ క్రస్ట్ గేట్లు, విద్యుదుత్పత్తి గేట్లు సైతం ఇబ్బంది పెడుతున్నాయి. యోగివేమన, పేరూరు వంటి డ్యాంల క్రస్ట్‌గేట్లు సైతం సతాయిస్తున్నాయి.

**మెకానికల్ ఇంజినీర్ల పాత్ర కీలకం**

జలవనరుల శాఖకు అనుబంధంగా కడపలో మెకానికల్ డివిజన్ ఉంది. అక్కడి ఈఈ సారథ్యంలోనే అనంతలోనూ ఒక డీఈ మాత్రమే ఉన్నారు. ప్రస్తుత కీలక ప్రాజెక్టుల దృష్ట్యా మెకానికల్ డివిజన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. మెకానికల్ ఇంజినీర్లతోపాటు నిర్దేశిత సంఖ్యలో ఎలక్ట్రికల్ ఇంజినీర్లు సైతం అవసరమే. వీరిద్దరూ ఉంటే జిల్లాలో ఏ మూలన గేట్లు మొరాయించినా సత్వరమే మరమ్మతులు చేసేందుకు వీలుంటుంది. ఏటా నిర్వహణ సులువుగా ఉంటుంది. గేట్ల నిర్వహణ, మరమ్మతులు సివిల్ ఇంజినీర్ల పరిధిలో లేదు. కేవలం మెకానికల్ ఇంజినీర్లే చూసుకోవాలి. ఎక్కడ మరమ్మతులకు గురైనా కడప నుంచి రావాల్సి ఉంటుంది. మెకానికల్ ఇంజినీర్ల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక డివిజన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

**హెచ్చెల్సీ ప్రాజెక్టు**

జలాశయాలు: కణేకల్లు, పీఏబీఆర్, ఎమ్పీఆర్, పెండేకల్లు, చాగల్లు, సుబ్బరాయసాగర్, ముచ్చుకోట, చిత్రావతి.

కాలువలు: హెచ్ఎల్ఎంసీ, జీబీసీ, ఆలూరు, గుత్తి ఉప కాలువ, ఎమ్పీఆర్ దక్షిణ, ఉత్తర, పులివెందుల (పీబీసీ), తాడిపత్రి (టీబీసీ), పీఏబీఆర్ కుడి కాలువ, లింకు కాలువ, ధర్మవరం (డీబీసీ), బి.పప్పూరు కాలువ.

హంద్రీనీవా ప్రాజెక్టు

జలాశయాలు : జీడిపల్లి, గొల్లపల్లి, మారాల, చెర్లోపల్లి

కాలువలు: తొలి దశ, రెండో దశ, మడకశిర (ఎంబీసీ), పుంగనూరు (పీబీసీ), రొళ్ల, అమరాపురం

చిన్న నీటి పారుదల (ఎంఐ)

జలాశయాలు: పేరూరు (అప్పర్ పెన్నార్), యోగివేమన, భైరవానితిప్ప (బీటీపీ) చెరువులు: 1,486

# కొండల్ని కొల్లగొడుతున్నారు



తాడిపత్రి : సహజ వనరులను కొంతమంది అక్రమార్కులు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. వన్యప్రాణులకు ఆసరాగా ఉన్న కొండలను సైతం ధ్వంసం చేస్తూ రూ.లక్షలు ఘడిస్తున్నారు. నిత్యం జేసీబీల సాయంతో కొండల్ని తవ్వి ఎర్రమట్టిని టిప్పర్ల సాయంతో తరలిస్తున్నారు. నానాటికీ కొండలు కనుమరుగు అవ్వడమే కాకుండా టిప్పర్లు, ట్రాక్టర్ల రాకపోకలతో ఆయా పల్లెల్లో దారులు కూడా ధ్వంసమవుతున్నాయి. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో భారీగా కొండలను తవ్వి ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. అందులో మహంతపురం, బెస్తరపల్లి, గ్రామాల పరిధిలో ఉన్న కొండలు నామరూపం లేకుండా పోతున్నాయి. రోజూ వందలాది ట్రాక్టర్లతో కళ్యాణదుర్గంలోని పలు వెంచర్లకు, ప్లాట్ల యజమానులకు అమ్ముకుంటూ రూ.లక్షలు గడిస్తున్నారు. సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకున్న పాపాన పోలేదని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

**క్షేత్రస్థాయిలో ఇదీ పరిస్థితి**

తాడిపత్రి మండలంలోని పలు గ్రామాల్లో రోజూ గ్రావెల్, ఎర్రమట్టిని అక్రమార్కులు తవ్వుకొని అమ్ముకుంటున్నారు. నిత్యం టిప్పర్లు రాకపోకలు సాగించడంతో రహదారులు ధ్వంసమవుతున్నాయి. ప్రధానంగా ఆలూరు, ఆవులతిప్పాయపల్లి, యర్రగుంటపల్లి, గదరగుట్టపల్లి, బుగ్గ వద్ద ఉన్న కొండలను భారీగా తవ్వుతున్నారు. నిత్యం జేసీబీ, ఇటాచీలతో వందలాది టిప్పర్లలో మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక్కో టిప్పర్ మట్టి, గ్రావెల్‌ను రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు అమ్ముకుంటున్నారు. మట్టిని తాడిపత్రి, యాడికి, బనగానపల్లి పలు ప్రాంతాల్లోని వెంచర్లకు తరలిస్తున్నారు. మరికొందరు జాతీయ రహదారి 544డీ నిర్మాణ పనుల ముసుగులో భారీగా ఇటు మట్టి, అటు గ్రావెల్ ఎర్రమట్టిని అక్రమంగా తీసుకెళ్తున్నారు.

**అక్రమార్కులను అడ్డుకుంటాం**

సోమశేఖర్, తహసీల్దార్ తాడిపత్రి

తాడిపత్రి మండలంలోని ఆయా గ్రామాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి అక్రమంగా కొండలను తవ్వుతున్న వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని, గ్రావెల్‌ను తరలించడం సరికాదు. అటువంటి వారిని గర్తించి శాఖాపరంగా తగు చర్యలు తీసుకుంటాం. భూగర్భ గనులశాఖ అధికారులతో సమస్యపై చర్చించి ఇలాంటివి జరగకుండా చూస్తాం.

# కలుషిత కోరల్లో పెన్నానది!

పామిడి : పామిడిలో ప్రధాన సమస్యగా మారిన మురుగుపారుదల వ్యవస్థ అధికారులకు సవాలుగా మారింది. పట్టణంలోని కాలువలు కనుమరుగవ్వడంతో ఇలాంటి దుస్థితి వచ్చిందని స్థానికులు వాపోతున్నారు. పట్టణంలో దాదాపు 14 వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. పెన్నానది నుంచి రోజుకు దాదాపు 2 కోట్ల లీటర్ల తాగునీరు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు సరఫరా అవుతోంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న పెన్నాలో వివిధ కాలనీల నుంచి మురుగు వదలడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జలాలు కలుషితమైతే ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశాలు ఉన్నాయి.కాలువల ద్వారా వచ్చే మురుగు నేరుగా పెన్నానదిలోకి చేరుతోంది. ఈవిధంగా కలుషితమైన నీటిని పెన్నా పరివాహక ప్రాంతంలోని వివిధ గ్రామాల ప్రజలు తాగునీటిగా వినియోగిస్తున్నారు. పెన్నానదిని ఆనుకుని అధికారుల అనుమతులు లేకుండా శ్మశానంలో నుంచి ఇష్టారాజ్యంగా మురుగును పెన్నానదిలోకి దారి మళ్లిస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు.



రియల్ దందాదారులు భూముల విలువను పెంచేందుకు ఎక్కడికక్కడ ప్రధాన కాలువలను దారి మళ్లిస్తున్నా అధికారులకు పట్టడం లేదు. పామిడికి వచ్చిన ప్రతి అధికారి కార్యకలాపలను ముగించుకుని జారుకుంటున్నారే తప్ప సమస్యలకు పరిష్కారం చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెన్నానదిలోకి కలుషిత జలాలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

రెవెన్యూ అధికారులను సంప్రదించి, ఆక్రమణకు గురైన కాలువలను గుర్తిస్తాం. క్షేత్రస్థాయిలో పెన్నానదిలోకి మురుగు వెళ్లకుండా వెంటనే తగు చర్యలు తీసుకుంటాం.

అశ్వర్థమ నాయుడు, ఎంపీడీవో

# బియ్యానికి బదులు.. రాగులొచ్చాయ్

చిత్తూరు : ప్రజాపంపిణీ వ్యవస్థలో భాగంగా చౌకధరల దుకాణాల ద్వారా ఈ నెలలో బియ్యానికి బదులు రాగులు అందజేయనున్నారు.. జిల్లాకు 300 టన్నుల రాగులను ప్రభుత్వం సరఫరా చేసింది.. ప్రభుత్వ ఆదేశాలతో ఒక్కో కార్డుదారుకు మూడు కిలోల చొప్పున వీటిని పంపిణీ చేయనున్నారు.. రాగులు తీసుకున్న వారికి మూడు కిలోల మేర బియ్యాన్ని తగ్గించనున్నారు.

**కందిపప్పు వచ్చేదెన్నడో..?** కార్డుదారులకు ఈ నెలలోనూ కందిపప్పు ఇవ్వకపోవడతో పేదింట పప్పన్నం కరవైంది. ఏడునెలల నుంచి.. రానున్న నెలలో అందజేస్తామని ఉన్నతాధికారులు ప్రకటిస్తున్నా అడుగు ముందుకు పడలేదు. టెండర్ల ప్రక్రియలో జాప్యం కారణంగా వచ్చే ఏడాది జనవరి నుంచి అందజేస్తామని ఉన్నతాధికారులు చెబుతున్నా



రు. మరోవైపు దిత్వా తుపాను వర్షాల కారణంగా చక్కెర సరఫరాలో ఆలస్యం జరగనుంది.

జిల్లాలోని బియ్యం కార్డులు : 5.34 లక్షలు

ప్రతినెలా అవసరం (టన్నుల్లో): బియ్యం 8,250

చక్కెర 250

కందిపప్పు 540

నేటినుంచి పంపిణీ

డిసెంబరు కోటా నుంచి లబ్ధిదారులకు అందజేయనున్నాం. ఈమేరకు చౌక దుకాణాలకు సరఫరా పూర్తిచేశాం.

శంకరన్, డీఎస్వో

# విచారణ పూర్తి.. చర్యలే తరువాయి

పుత్తూరు : రాష్ట్రంలో గత వైకాపా ప్రభుత్వంలో ప్రకృతి సంపదను యథేచ్ఛగా కొల్లగొట్టేశారు.. అధికారంలోకి వచ్చిందే తడువుగా ఇసుకను ప్రధాన ఆదాయవనరుగా మార్చుకున్నారు.. జాతీయ హరిత ట్రైబ్యునల్, చివరకు సుప్రీంకోర్టు రంగంలోకి దిగినా వైకాపా నాయకులకు చెవికెక్కలేదు.. ఇలా ఐదేళ్ల దోపిడీపై కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. సమగ్ర విచారణ చేసి ఎంతమేరకు దోచారనేది లెక్కలు తేల్చారు. వివరాలు వెల్లడించి చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సన్నద్ధమైందని సమాచారం.

ఉమ్మడి జిల్లాలో ఇలా.. చిత్తూరు జిల్లాలోని గత ప్రభుత్వంలో పలమనేరు ప్రాంతంలోని కౌండిన్య పరివాహక ప్రాంత ఇసుకను యథేచ్ఛగా అక్కడి ప్రజాప్రతినిధి రాష్ట్ర సరిహద్దులు దాటించి కర్ణాటకలో



విక్రయించారు. కుప్పం పరిసర ప్రాంతాల్లోని వాగులు, వంకలనూ వదల్లేదు. చివరకు రైతుల పొలాల్లోనూ దౌర్జన్యంగా ఇసుక తవ్వి తరలించారు. అటవీ ప్రాంతంలో చెట్లు తొలగించి ఇసుక తవ్వకాలు చేపట్టడం గమనార్హం. చిత్తూరు, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లో నీవా నదిలో యంత్రాలతో తవ్వేసి రూ.వందల కోట్లు గడించారు.

నగరి కుశస్థలి నదిలో ఎలాంటి అనుమతులు లేకుండానే నిత్యం వందల ట్రాక్టర్ల ఇసుక తరలించేశారు. నాగలాపురంలోని అరణియార్, చంద్రగిరి, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో అక్కడి ఎమ్మెల్యేలు ఇసుక వ్యాపారం చేసి రూ.కోట్లు గడించారు.

సూళ్లూరుపేట, గూడూరు, నాయుడుపేట తదితర ప్రాంతాల్లో నూ అక్రమ రవాణాతో ప్రజాప్రతినిధులు రూ.కోట్లు వెనుకేసుకున్నారు.

# ఇంటికే వస్తారు.. వసూలు చేస్తారు

పలమనేరు : విద్యుత్తు బిల్లులు చెల్లించే వినియోగదారులు ఇకపై కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. గతంలోలాగా నిర్ణీత పాయింట్ల వద్ద ఎదురుచూడాల్సిన అవసరం లేదు. బిల్లుల వసూళ్లలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కొత్త విధానాలు అమలు చేస్తోంది. ఏపీ ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో అధికారులు మారుమూల గ్రామాల్లోని ఇళ్లకు వెళ్లి నేరుగా వసూలు చేయనున్నారు. గతంలో బిల్లుల చెల్లింపునకు ప్రైవేటు ఏజెన్సీలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా గతంలో ప్రైవేటు ఆధ్వర్యంలో 50 సేవా కేంద్రాలుండేవి. బ్యాంకు గ్యారెంటీలు చెల్లించిక బిల్లుల వసూలు సక్రమంగా లేక ప్రభుత్వం ఏజెన్సీలను రద్దు చేసింది. ప్రస్తుతం పుంగనూరు, రొంపిచెర్ల రెండుచోట్ల మాత్రమే ఏజెన్సీలు ఉంచారు.

జిల్లాలో కనెక్షన్ల వివరాలు..

ఎల్‌టీ లైన్లు: 9 లక్షలు, హెచ్‌టీ లైన్లు: 250

బిల్లు వసూలు (నెలకు): రూ.120 కోట్లు

స్కాన్ చేస్తే చాలు..

ఎస్పీడీసీఎల్ యాప్‌లో బిల్లు చెల్లింపునకు నానాతంటాలు పడేవారు. ఇప్పుడు బిల్లులోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు. గ్రామంలో ఈఆర్‌వో కార్యాలయం సిబ్బంది, ఎనర్జీ సహాయకుడు, లైన్‌మైన్ సైతం వెళ్లి వసూలు చేస్తున్నారు.

సమస్యలు లేకుండా.. : వినియోగదారుల నుంచి సమస్యలు లేకుండా బిల్లులు వసూలు చేస్తున్నాం. అవసరం ఉంటే సిబ్బంది ఇళ్లకు వెళ్తారు.

శ్రీనివాసమూర్తి, డీఈఈ, పుంగనూరు

## ఉండు.. నేనూ నీ వెనుకే వస్తా!!

విశాఖపట్నం : సమయ పాలన పాటించని ఆర్టీసీ బస్సులతో ప్రయాణికులు విసిగిపోతున్నారు. ద్వారకా బస్‌స్టాండ్ నుంచి నాలుగైదు బస్సులు ఒకేసారి బయలుదేరడం, ఒకేసారి చేరుకోవడం ఇటీవల తరచూ జరుగుతోంది. విశాఖ నుంచి చోడవరం, అనకాపల్లి, సబ్బవరం, కూర్మన్నపాలెం, గాజువాక, కొత్తవలస, తగరపువలస వెళ్లే మార్గాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఒక్కోసారి అరగంట, గంట ఆలస్యమవుతుండగా.. కొన్నిసార్లు కనీసం రెండు నుంచి మూడు గంటలు ఆలస్యమవుతున్నాయి. ఎప్పుడు వస్తున్నాయి... ఎప్పుడు వెళ్తున్నాయి, ఆలస్యం ఎందుకు అనే అంశాలపై అధికారుల పర్యవేక్షణ కనిపించడం లేదు. ట్రాఫిక్ రద్దీని సాకుగా చూపించి చాలాసార్లు ఆలస్యమంటున్నారు.పరిశీలిస్తాం: 'పర్యవేక్షణ బృందాలు ఏర్పాటు చేసి బస్సుల సమయపాలనపై దృష్టిసారిస్తాం. ఈ అంశంపై తరచూ ఫిర్యాదులూ అందుతున్నాయి. వాస్తవాలేమిటో తెలుసుకొని ఆలస్యం కాకుండా డ్రైవర్లను అప్రమత్తం చేస్తాం' అని ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు పేర్కొన్నారు.



రోడ్లపైకి ఒకేసారి సమయపాలన కరవైన ఆర్టీసీ బస్సులు

ఈ నెల 6న: సాయంత్రం 5.30 గంటలకు ఒకే సమయంలో విశాఖ-అనకాపల్లి- ఎలమంచిలి బస్సులు రెండు విశాఖ చేరుకున్నాయి. వీటిలో ఒకటి గంట ముందు రావాలి.ఈ నెల 5న: 0187, 0426 నంబరు బస్సులతో పాటు మరో రెండు.. ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఒకేసారి చోడవరానికి బయలు దేరాయి. ముందు వెళ్లినవి రద్దీగా.. ఆ తర్వాతవి ఖాళీగా వెళ్లాయి.ఈ నెల 5న: విశాఖ నుంచి చోడవరానికి 1427, 0075, 4359, 4086 నంబరు బస్సులతో పాటు మరో రెండు రాత్రి 7.30 గంటలకు ఒకే సమయంలో చోడవరం బస్‌స్టాండ్‌కు చేరుకున్నాయి. తిరిగి అక్కడి నుంచి 7.45 గంటలకు అవన్నీ నగరానికి బయలుదేరాయి. సాయంత్రం ఆరు గంటల నుంచి విశాఖకు వచ్చేందుకు చోడవరంలో నిరీక్షణ తప్పలేదు.

## చేయి చాచితే ఇవ్వం.. చేయి తడిపితే ఆగం



నంద్యాల: పొలాలు, స్థల క్రయవిక్రయాలు, మార్టిగేజ్, ఈసీ నకళ్లు, పెళ్లి పత్రం.. ఇలా ప్రతి పనికి ఓ ధర నిర్ణయించారు. మధ్యవర్తిత్వం లేనిదే పని కాదు. ప్రతి దస్తావేజుకు ప్రభుత్వానికి చెల్లించే రుసుముకు సమానంగా చెల్లించాల్సిందే. బయటి వ్యక్తులతో కుమ్మక్కైన అధికారులు, సిబ్బంది నేరుగా కాకుండా వారితోనే తమకు కావాల్సినంత తీసుకుంటారు. అడిగినంత ఇచ్చుకోకుంటే పనులు జరగవు. ఇటీవల ఆళ్లగడ్డలో అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు చేయడంతో పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి.

**అనధికార వ్యక్తుల హవా**

పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అనధికార వ్యక్తుల హవా నడుస్తోంది. సిబ్బంది కొరత నేపథ్యంలో వీరిని నియమించుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా ఎక్కువమంది పనిచేస్తున్న విషయం.. అవినీతి నిరోధకశాఖ అధికారుల తనిఖీల్లో బయటపడింది. కల్లూరు, నంద్యాల, ఆదోని, శిరివెళ్ల, ఆళ్లగడ్డ, కర్నూలు, బేతంచెర్ల, బనగానపల్లి తదితర కార్యాలయాల్లో వీరు ఉన్నట్లు సమాచారం. కార్యాలయాల్లో నిజంగా అవసరం ఉందా? వసూళ్ల కోసమే నియమించుకున్నారా? అన్న విషయాలపై ఆరా తీస్తున్నారు.

**కాసుక్కూర్చున్నారు**

ఫిర్యాదులు వెల్లువెత్తడంతో డాక్యుమెంట్ రైటర్ల వివరాలను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు సేకరిస్తున్నారు. నంద్యాల జిల్లాలో 250, కర్నూలు జిల్లా పరిధిలో 350 మంది వరకు దస్తావేజులేఖర్లు ఉన్నారు. వీరిలో ఎక్కువగా కల్లూరు, కర్నూలు, నంద్యాల, ఆదోని కార్యాలయాల పరిధిలో ఉన్నారు.

వినియోగదారుల నుంచి మామూళ్లు వసూలు చేసేది వీరే. నగదు రూపంలోకాక ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా లావాదేవీలు చేస్తున్నారు. వీరి వివరాలు, ఫోన్ నంబర్లను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ, అవినీతి నిరోధక శాఖ అధికారులు సేకరిస్తున్నట్లు సమాచారం. ఏ ఫోన్ నంబరు నుంచి ఏఏ అధికారి, సిబ్బందికి ఏఏ తేదీల్లో ఎంత మొత్తం వెళ్లింది? నేరుగా వారికే వెళ్లిందా? బినామీలకు చేరిందా? తదితర విషయాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం.

**ఫిర్యాదుల వెల్లువ**

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై కొన్ని ప్రాంతాల్లో నాయకులే ఫిర్యాదు చేశారు. ఆదోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజులేఖర్ల వ్యవహారంపై ఓ నాయకుడు నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బనగానపల్లి, కల్లూరు, నంద్యాల, ఆళ్లగడ్డ, ఓర్వకల్లు, బేతంచెర్ల, డోన్, ఆత్మకూరు, గూడూరు, పత్తికొండ కార్యాలయాలపై ఆరోపణలు వచ్చాయి. నంద్యాల కార్యాలయంలో అడిగినంత ఇవ్వకపోతే డాక్యుమెంటేషన్ పూర్తి కాదన్న ఆరోపణలపైనా అధికారులు దృష్టి సారించారు.

**ప్రతి పనికి ఒక రేటు**

ఈసీ కావాలంటే రూ.300 నుంచి రూ.800, వివాహ రిజిస్ట్రేషన్‌కు రుసుం రూ.500తోపాటు మరో రూ.1,000, వీలునామాకు రూ.10 వేలు, జనరల్ పవర్ ఆఫ్ అటార్నీకి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు.. ఇలా ప్రతి పనికి ఒక ధర నిర్ణయించి వసూలు చేస్తున్నారు. సాధారణంగా వ్యవసాయ భూమిని వాణిజ్య భూమిగా మారిస్తే దానికి చదరపు గజం ధర నిర్ణయించాలి. నంద్యాల, కల్లూరు, పాణ్యం, బనగానపల్లి, ఆదోని, ఆళ్లగడ్డ, ఎమ్మిగనూరు తదితర ప్రాంతాల్లో ఎకరం ధర మీదుగానే రిజిస్ట్రేషన్లు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. స్టాంపు పేపర్లు కూడా నచ్చిన వెండర్లకు ఇచ్చి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. నంద్యాలలో కంప్యూటర్ ఈసీ గంటలో ఇచ్చే వెసులుబాటు ఉన్నప్పటికీ నాలుగైదు రోజులకు కానీ ఇవ్వడం లేదు.

## 22,126 ఎకరాల్లో పంట నష్టం

ఉండి : అధిక వర్షాలు, మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలో నష్టపోయిన పంట విస్తీర్ణాన్ని అధికారికంగా తేల్చారు. పంట సాగు చేసిన విస్తీర్ణంలో 33 శాతానికి మించి దెబ్బతిన్న ప్రాంతాలు, రైతుల వివరాలతో క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత ఆన్‌లైన్‌లో ఆ జాబితాలు ఉంచారు. వాటిపై సామాజిక తనిఖీలు నిర్వహించి రైతులు ఇచ్చిన అభ్యంతరాలు స్వీకరించారు. మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత నష్టంపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి జిల్లా యంత్రాంగం అందజేసింది.జిల్లాలో 2,15,068 ఎకరాల్లో ఖరీఫ్ వరి పంట సాగైంది. ఎంటీయూ 1318 వంగడాన్ని అత్యధికంగా వేశారు. తర్వాత స్థానాల్లో ఎంటీయూ 7029 (స్వర్ణ), సంపద స్వర్ణ, పీఎల్ 1100, ఎంటీయూ 1121 తదితర రకాలున్నాయి. వీటిలో స్వర్ణ,




సంపద స్వర్ణ రకాలు ఈదురుగాలులకు నేలకొరిగాయి. కొన్ని చోట్ల వర్షాలకు మునిగాయి. వర్షాలకు పడని మిగిలిన రకాలు ఈనిక, గింజ తయారీ, గట్టి పడటం దశల్లో పంటకు ఎంతో కొంత నష్టం ఉంటోందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

**బాధిత రైతులు 20,087..** తుపాను గండం నుంచి గట్టెక్కిన వెంటనే 26,381 ఎకరాల్లో పంట దెబ్బతిందని అప్పట్లో ప్రభుత్వానికి ప్రాథమిక అంచనాలు పంపించారు. ఆ తర్వాత వ్యవసాయ క్షేత్రాల్లో అధికారుల పరిశీలన, సామాజిక తనిఖీల అనంతరం జిల్లాలో 20 మండలాల్లోని 259 రైతు సేవా కేంద్రాల్లో 22,126 ఎకరాల్లో పంట దెబ్బతిందని తేల్చారు. బాధిత రైతుల సంఖ్య 20,087గా గుర్తించి కలెక్టర్ నాగరాణి ఆధ్వర్యంలో ప్రభుత్వానికి నివేదిక పంపించామని జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వరరావు తెలిపారు. గత సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో అధిక వర్షాలకు పాలకొల్లు, భీమవరం, వీరవాసరం, ఆచంట, అత్తిలి, నరసాపురం, యలమంచిలి మండలాల్లో 1,198 ఎకరాల్లో 922 మంది రైతులు పంట నష్టపోయారు.

## సేవల 'పల్లె'కీలో..

వీరవాసరం : పల్లె పాలనలో పారదర్శకతకు కూటమి ప్రభుత్వం నడుం బిగించింది. పంచాయతీలకు పన్నులు, పన్నేతర మార్గాల ద్వారా వచ్చే ఆదాయం.. ఆర్థిక లావాదేవీలన్నీ పక్కాగా ఉండేలా 'స్వర్ణ పంచాయతీ' పోర్టల్, యాప్‌లు అందుబాటులోకి తెచ్చింది. కొన్ని నెలలుగా కార్యదర్శులు, అధికారులు పంచాయతీ దస్త్రాలను ఈ పోర్టల్‌లో నమోదు చేశారు. ప్రస్తుతం ఇది పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.ముందుగా పోర్టల్‌లోకి వెళ్లాలి. తర్వాత ఆన్‌లైన్ పేమెంట్ ఆప్షన్ వస్తుంది. అందులోకి వెళ్లి జిల్లా, మండలం, పంచాయతీ అసెస్మెంట్ నంబరు లేదా ఇంటి యజమాని పేరు నమోదు చేయాలి. తర్వాత ఇంటి పన్ను వివరాలు కనిపిస్తాయి. దానిపై క్లిక్ చేస్తే ప్రొసీడ్ ఫర్ పేమెంట్ ఆప్షన్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతా ద్వారా ఆన్‌లైన్‌లో పన్నులు చెల్లించవచ్చు. పంచాయతీలు ఇచ్చే డిమాండ్ నోటీసును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అక్కడే ఇంటి




స్వభావం, విస్తీర్ణం కూడా నమోదు చేసి ఉంటాయి.

**పౌర సేవలు..**పంచాయతీ అందజేసే పౌర సేవలకు ఇక్కడ నుంచే దరఖాస్తు చేసుకునే వీలుంది. పోర్టల్‌లోకి వెళ్లి కొత్తగా ఇళ్లు నిర్మించుకున్న వారు ఇంటి పన్నులు, కొత్త కుళాయి కనెక్షన్లు, కుళాయి పన్నుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

ట్రేడ్ లైసెన్సులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆస్తి విలువ ధ్రువపత్రాలు పొందవచ్చు.

**సమగ్ర సమాచారం..**పంచాయతీల సమస్త సమాచారం పీడీఎఫ్ రూపంలో పోర్టల్‌లో అందుబాటులో ఉంచారు. అందులో గ్రామం పేరు, ఆవాస ప్రాంతాలు, జనాభా, సర్పంచి, వార్డు సభ్యులు, కార్యదర్శి, గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, తాగునీటి వనరులు, తాగునీటి పథకాలు, విద్యుత్తు స్తంభాలు, వీధి దీపాలు, సీసీ రోడ్లు, బీటీ రోడ్ల వివరాలు ఉంటాయి.

## 'అల'సత్వమే ముంచేస్తోంది..!



విశాఖపట్నం : సువిశాల సముద్ర తీరం విశాఖ సొంతం. దేశవిదేశాల నుంచి పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. అందాల తీరంలో హాయిగా విహరిస్తూ సేద తీరుతుంటారు.

కొందరు అత్యుత్సాహంతో సముద్రంలో ఈత కొడుతుంటారు. రాకాసి అలలు పొంచి ఉంటాయని గ్రహించరు.. వాటిల్లో చిక్కుకుని.. ఊపిరాడక.. విగతజీవుల్లా మారుతున్నారు. విశాఖ పరిసరాల్లో బీచ్‌ల్లో తరచూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

విశాఖ పరిధిలోని తీరంలో 30 చోట్ల పర్యాటకులు స్నానాలు ఆచరిస్తుంటారు. కొన్ని ప్రదేశాల్లో అలలు తీరాన్ని వేగంగా ఢీకొని అంతే వేగంగా వెనక్కి వెళతాయి. ఇలాంటి రెండు అలల మధ్య ఉండే నీటినే 'రిప్ కరెంట్' అంటారు. ఈ జలాలు చూడటానికి నిశ్చలంగా అనిపిస్తాయి. అందుకే వీటి బారిన పడి ఏటా పదుల సంఖ్యలో ప్రాణాలు విడుస్తున్నారు. ఆరిలోవ, భీమిలి, దువ్వాడ, త్రీటౌన్, వన్‌టౌన్, మల్కాపురం, న్యూపోర్టు, పీఎంపాలెం, ఎంవీపీ కాలనీ స్టేషన్ల పరిధిలో ఐదేళ్లలో 165 మంది సముద్ర స్నానాలకు వెళ్లి చని పోయారు.

**'రిప్' కరెంట్‌లో చిక్కుకుంటే ...**

రిప్‌కరెంట్ ఉన్న చోట అలలు పెద్దగా కనిపించవు. సముద్రం నుంచి నేరుగా బయటకు పొడవైన సన్నటి నీటి గీతలా కనిపిస్తుంది.

ఎవరైనా రిప్ కరెంట్‌లో చిక్కుకుంటే అది 30-100 మీటర్ల మేర సముద్రంలోకి బలంగా లాక్కెళుతుంది. ఆ సమయంలో భయాందోళనకు గురికావొద్దు.నేరుగా తీరానికి ఈత కొట్టకూడదు. అలా చేస్తే బలహీనం అవుతారు.

అలలకి సమాంతరంగా కుడి, ఎడమ.. ఏదో ఒక వైపునకు ఈదడం ద్వారా బయట పడొచ్చు.

నీరు బలంగా లాగుతున్న (రిప్ కరెంట్) ప్రదేశం నుంచి బయటకి వచ్చాక, తిరిగి అలల సాయంతో డయాగ్నల్‌గా తీరం వైపు ఈదాలి.

మెరైన్ పోలీసుల సూచనలు ఇవే..

ఎక్కువ దూరం సముద్రంలోకి వెళ్లకుండా, అలలకు ఎదురు పోకుండా జాగ్రత్త వహించాలి.

బీచ్‌ల వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డుల్లోని సూచనలను తప్పక పాటించాలి.

వృద్ధులు, గర్భిణులు, చిన్న పిల్లలు సముద్రంలో లోతుకు దిగకూడదు.

ఏదైనా అనుమానాస్పద వస్తువును తీరంలో గుర్తిస్తే మెరైన్ కంట్రోల్ రూం 1093కు సమాచారమివ్వాలి.

మద్యం తాగి స్నానం చేయడం పూర్తిగా నిషేధం

ఇటీవలి ఘటనలు ఇలా..

అక్టోబరు 5న యారాడ బీచ్‌లో సముద్రంలోకి దిగిన నలుగురు విదేశీయులు కొట్టుకు పోయారు. లైఫ్ గార్డ్స్ ముగ్గుర్ని రక్షించగా, ఒకరు మృతి చెందారు.

అక్టోబరు నెలలోనే యారాడ బీచ్‌లో ఇద్దరు యువకులు గల్లంతవ్వగా నేటికీ ఆచూకీ తెలియరాలేదు.

ఆగస్టులో ఆర్కేబీచ్ పరిధిలో రాకాసి అలలకు ఓ కుటుంబంలో ముగ్గురు చిక్కుకోగా ఒకరు చనిపోయారు. వీరిని కాపాడటానికి వెళ్లిన ఒడిశాకు చెందిన యువకుడు సైతం మృతి చెందారు.

## అరకొర తనిఖీలు.. అధ్వాన సేవలు

బేస్తవారపేట: జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో వాహనదారులకు చట్టబద్ధంగా అందిచాల్సిన సేవలను నిర్వాహకులు గాలికి వదిలేస్తున్నారు. నిబంధనల ప్రకారం కల్పించాల్సిన మౌలిక సదుపాయాలకు తిలోదకాలు ఇస్తున్నారు. ఇంధనాన్ని విక్రయించడమే కాదు, వినియోగదారులకు వాటిల్లో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. కానీ అవి ఎక్కడా అమలు కావడం లేదు. తనిఖీ చేయాల్సిన అధికారులూ పట్టించుకోవడం లేదు.

**ఉండాల్సిన కనీస సౌకర్యాలివీ..**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి పెట్రోల్ బంకులో వాహనదారుల కోసం తాగునీటి వసతి, మరుగుదొడ్ల ఏర్పాటు, వాహనాలకు ఉచితంగా గాలిపట్టడం, పెట్రోల్, డీజిల్ కొలిచే పరికరాలు, ఇంధనం నాణ్యతను తెలుసుకునేందుకు పరీక్షా పత్రాలు, అత్యవసర వివరాలతో కూడిన సూచికలు ఉండాలి. ఫిర్యాదుల పెట్టె లేదా రిజిస్టర్‌ను అందుబాటులో ఉంచాలి. ఫస్ట్ ఎయిడ్ బాక్స్ కిట్లు, రాత్రి వేళల్లో ప్రయాణాలు చేసే వారు విశ్రాంతి తీసుకునేందుకు, వాహనాల నిలుపుదలకు పార్కింగ్ ప్రదేశం లాంటివి తప్పనిసరి. సగానికిపైగా పెట్రోల్ బంకుల్లో ఇవేమీ కనిపించడంలేదు.

తూతూమంత్రంగానే తనిఖీలు..పెట్రోల్ బంకుల్లో నిరంతరం పౌర సరఫరాలు, తూనికలు, కొలతలు, విజిలెన్స్, అగ్నిమాపక శాఖలతో పాటు ఇతర అధికారులు సంయుక్తంగా కలిసి నెలవారీ తనిఖీలు చేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా ఎవరూ కార్యాచరణ చేపట్టడంలేదు. ఒకవేళ అప్పుడప్పుడు నిర్వహించినా అవి తూతూమంత్రంగానే ఉంటున్నాయి. బంకుల వద్ద వినియోగదారులు తమకు జరిగిన నష్టంపై ఆందోళన చేసినప్పుడు మాత్రమే అధికారులు హడావుడి చేస్తున్నారు. ఇటీవలి వర్షాలకు ఒంగోలు నగరంలోని ఓ బంకులో నీటితో కలిసిన పెట్రోలు రావడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. కనీసం ఇకనైనా అధికారులు తనిఖీలు నిర్వహించి సేవలు అందించే విధంగా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

జిల్లాలో వివరాలిలా కంపెనీలు: హెచ్‌పీ, ఐవోసీ, బీపీసీఎల్

పెట్రోల్ బంకులు: 283

ప్రైవేటు బంకులు : 15

కనీస వసతులున్నవి: 86

## కిన్నెరసాని.. అక్రమాల గని

కుక్కునూరు : నది మధ్యలో కనిపిస్తున్న దారి, స్తంభంపై ఎర్ర జెండా ఆంధ్ర- తెలంగాణ సరిహద్దు. ఎడమ వైపు ఆంధ్ర, కుడి వైపు తెలంగాణ భూభాగాలు ఉన్నాయి. ఇప్పుడా సరిహద్దే.. ఆంధ్రా అధికారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ప్రస్తుతం గోదావరి నిండుగా ప్రవహిస్తుండటంతో తవ్వకాలు జరిపేందుకు వీలు లేకుండా పోయింది. దీంతో అక్రమార్కుల కన్ను కిన్నెరసాని నదిపై పడింది. నదిలో ఇసుక ఆంధ్రా ప్రాంతం వైపు ఎక్కువగా ఉండటంతో తెలంగాణ వైపు నుంచి వచ్చి తవ్వుకుపోతున్నారు. తవ్వకాల తర్వాత నాలుగు అడుగులు వేస్తే తెలంగాణ. దీంతో అధికారులు వాహనాలు సీజ్ చేయలేని పరిస్థితి.

రాత్రి..రాత్రి కుక్కునూరు ఎస్సై రాజారెడ్డి అక్రమ రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్ పట్టుకున్నారు. బూర్గంపాడుకు చెందిన దేగల తిరుమలరావు, నిరుడు సతీశ్‌లపై కేసు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేశారు.

**హెచ్చరికలు జారీ చేసినా..**

ఇసుక బూర్గంపాడు, సారపాక, భద్రాచలం చేరవేసి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమార్కులు కిన్నెరసాని నదికి సమీపంలోని బూర్గంపాడు నుంచి నదిలో ప్రవేశిస్తున్నారు. అధికారులు బూర్గంపాడు వెళ్లి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి హెచ్చరికలు కూడా జారీ చేశారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు పోలీసు, రెవెన్యూ సిబ్బంది రాత్రి సమయాల్లో నిఘా పెట్టారు. అయినా అక్రమ రవాణాకు బ్రేకు పడలేదు.

**వైకాపా హయాంలో ఏకంగా..**

గతంలో వైకాపా హయాంలో ఏకంగా నదిలో రహదారి నిర్మించి పెద్ద టిప్పర్లతో తవ్వకాలు జరిపారు. అయినా అధికారులు పట్టించుకొనేవారు కాదు. సీతారామనగరం గ్రామస్థులు గ్రామం నుంచి వాహనాలు వెళుతుండటంతో దుమ్ముతో ఇళ్లన్నీ మట్టి కొట్టుకుపోతున్నాయని గ్రామం నుంచి టిప్పర్లు వెళ్లొద్దని ఆందోళన చేయడంతో నిలిపి వేశారు. మార్గం మార్చి ఇప్పుడు బూర్గంపాడు నుంచి ప్రవేశిస్తున్నారు.

## అక్రమ లేఅవుట్లు.. అడ్డగోలు విక్రయాలు

అనకాపల్లి: జిల్లాలో అనధికారిక లేఅవుట్లు ఎక్కడికక్కడ వెలుస్తున్నాయి. అనుమతులు లేకుండా, భూమార్పిడి పన్ను చెల్లించకుండా దర్జాగా వెంచర్లు వేసేస్తున్నారు. నిబంధనలు మాకేం పట్టవన్నట్లు అక్రమార్కులు వ్యవహరిస్తున్నారు. నేతల అండదండలు ఉండటంతో అనధికారిక వెంచర్లకు అడ్డుకట్ట పడటం లేదు.జిల్లాలో 496 లేఅవుట్లకు అనుమతులు లేవని అధికారులు గుర్తించారు. వాటికి నోటీసులు సైతం అందించారు. కానీ.. ఇప్పటివరకు ఒక్కరు కూడా అనుమతికి రుసుం చెల్లించలేదు. అధికారులు ఆయా వెంచర్లలో క్రయవిక్రయాలు చెల్లవంటూ బోర్డులు పెట్టారు. రియల్టర్లు ఆ బోర్డులను పీకి పక్కన పడేసి అమ్మకాలు చేస్తున్నారు.

**ఈ అనుమతులు తప్పనిసరి:** జిల్లాలో లేఅవుట్ వేయాలంటే వీఎంఆర్‌డీఏ అనుమతి తప్పనిసరి. లేఅవుట్ వేస్తున్న భూమి విలువ ప్రకారం నాలా పన్ను చెల్లించాలి. లేఅవుట్‌లో ఎకరాలో పదిశాతం స్థలాన్ని సామాజిక అవసరాల కోసం వదిలిపెట్టాలి. కానీ.. వ్యాపారులు మొత్తం స్థలాన్ని ప్లాట్లుగా మార్చేసి అమ్మేస్తున్నారు. రెండు, మూడు ఎకరాల్లో లేఅవుట్ వేసి.. చిన్నచిన్న రాళ్లు హద్దులుగా నిర్ణయించి విక్రయించేసి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై కొనుగోలుదారులు ఫిర్యాదు చేస్తే లేఅవుట్లలో బోర్డు పెట్టి చేతులు దులుపుకొంటున్నారు.

**వ్యవసాయ భూముల్లోనూ..**

అనకాపల్లి ప్రత్యేక జిల్లాగా ఏర్పడటంతో భూములు విలువ భారీగా పెరిగింది. దీంతో రియల్టర్ల కన్ను ఆవఖండం భూములపై పడింది. ఇవన్నీ వర్షం కురిస్తే నిండిపోయే చిత్తడి నేలలు (వాటర్‌బెల్ట్). గృహనిర్మాణాలకు అంత అనుకూలం కాదు. కానీ వీటినీ వెంచర్లుగా మార్చేస్తున్నారు. గత ప్రభుత్వంలో జిల్లా కేంద్రానికి సమీపంలోని జాతీయరహదారికి ఆనుకుని భారీ లేఅవుట్ వేశారు. తర్వాత దీనిపై భారీగా ఫిర్యాదులు రావడంతో కొంతకాలం నిలిపేశారు. మళ్లీ ఇప్పుడు అదే వెంచర్‌లో డ్రెయిన్లు, రోడ్ల పనులు చేస్తున్నారు.

మునగపాక విద్యుత్తు ఉపకేంద్రం ఎదురుగా ఆవఖండంలో భారీ లేఅవుట్లు వేస్తున్నారు. వీటికి ఎటువంటి అనుమతి లేకపోయినా.. ప్రపోజ్డ్ టు వీఎంఆర్‌డీఏ అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుని లేఅవుట్లు వేస్తున్నారు. దీనికి వెళ్లేందుకు పంట కాలువ పైనుంచి కల్వర్టు నిర్మించి మరీ రోడ్డు వేసుకుని పనులు చేస్తున్నారు.

సబ్బవరం నుంచి పాయకరావుపేట వరకు జాతీయ రహదారి వెంట భారీ వెంచర్లు వెలుస్తున్నాయి. నక్కపల్లిలో భారీ పరిశ్రమలు ఏర్పాటు అవుతుండటంతో.. రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో వ్యవసాయ భూములను కొనుగోలు చేసి వెంచర్లు వేస్తున్నారు.

**నోటీసులు ఇచ్చాం**జిల్లాలోని అన్ని మండలాల నుంచి అనధికారికంగా వేసిన లేఅవుట్ల వివరాలు సేకరించి వాటికి నోటీసులు ఇచ్చాం. అయినా స్పందించనిచోట్ల బోర్డులు పెట్టి.. పన్నుకట్టి అనుమతులు తీసుకోవాలని సూచించాం. త్వరలో ప్రత్యేక శిబిరం పెట్టి అపరాధ రుసుంతోపాటు పన్నులు కట్టించుకుని అనుమతులు ఇస్తాం. అప్పటికీ స్పందించని వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. సందీప్, జిల్లా పంచాయతీరాజ్ అధికారి

## పరిహారమే అసలు సమస్య!

ఒంగోలు : పశ్చిమ ప్రకాశం వాసుల దాహార్తిని తీర్చే వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం వచ్చే ఏడాది ఆగస్టు నాటికి పూర్తిచేసి నీళ్లు పారించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పనులు చురుగ్గా సాగుతున్నా జలాశయంలో నీళ్లు నిల్వ చేసే విషయమై సమస్య నెలకొంది. జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇటీవల ప్రాజెక్టును సందర్శించిన నేపథ్యంలో ముంపు బాధితుల సమస్యకు పరిష్కారం చూపాల్సి ఉంది.

వెలిగొండ మొదటి సొరంగం తవ్వకం పనులు పూర్తికాగా, రెండో సొరంగం నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. నాలుగైదు కిలోమీటర్ల మేర పనులు చేపట్టాల్సి ఉంది. పనులన్నీ నియమిత సమయానికి పూర్తయ్యే అవకాశం ఉంది. మరోవైపు సొరంగం నుంచి జలాశయానికి నీటిని తరలించే ఫీడరు కాలువ పనులు మొదలుకానున్నాయి. ఇందుకోసం ప్రభుత్వం రూ.430 కోట్లు కేటాయించడంతో టెండరు ప్రక్రియ సైతం పూర్తయింది. త్వరలో గుత్తేదారు సంస్థ కాలువ లైనింగ్, కాంక్రీట్ నిర్మాణ పనులు చేపట్టనుంది. నీటిని నిల్వ చేసే ప్రాజెక్టు పరిధిలోని ముంపు గ్రామాలైన సుంకేసుల, కలనూతల, గుండంచర్ల, గొట్టిపడియ, అక్కచెరువు, సాయినగర్, కృష్ణనగర్, లక్ష్మీపురం, మెట్టుగొంది, చింతలపూడి, కాటంరాజుతాండలలోని ముంపు బాధిత కుటుంబాలను ఇప్పటికే గుర్తించారు. ఆయా గ్రామాల్లోని ముంపు బాధిత కుటుంబాలను ప్రత్యామ్నాయంగా ఏడుచోట్ల పునరావాస కేంద్రాలు నిర్మించారు. బాధితులకు పరిహారం పంపిణీ చేయడమే అసలు సమస్య. ఇప్పటికే పరిహారానికి సంబంధించి కొంత మొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించి అధికారులు ముంపు బాధితుల వివరాలు ఇప్పటికే నమోదు చేసినందున జాప్యం ఉండదు. మంత్రి రామానాయుడు బాధిత కుటుంబాలకు పరిహారం సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించాల్సి ఉంది.

# ఫార్మా వ్యర్థాలపై చిత్త'శుద్ధి' ఉందా?!

విశాఖపట్నం : అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా కంపెనీల వ్యర్థాలను శుద్ధి చేసే ప్లాంటు నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. అక్కడి పరిశ్రమలే కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సీఈటీపీ)ని నిర్వహించుకుంటామని చేసిన ప్రతిపాదన పక్కనబెట్టారు. గుజరాత్‌లోని గజియాబాద్‌కు చెందిన హైపర్ ఫిల్టరేషన్ అనే కంపెనీకి ఆపరేషనల్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) ఇచ్చేందుకు ఏపీఐఐసీ సిద్ధమైంది. రసాయనాల శుద్ధి చేయడంలో ఆ కంపెనీకి అనుభవం, సామర్థ్యం ఉందా? ఏపీఐఐసీ సజావుగా నిర్వహిస్తూ ఒక్కసారిగా థర్డ్ పార్టీని ఎందుకు తెరపైకి తెచ్చింది? అచ్యుతాపురం ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ లిమిటెడ్ (ఏఈటీఎల్) బోర్డులోని పరిశ్రమలే నిర్వహణ చూస్తామంటే ఎందుకివ్వడం లేదు? ప్రైవేటు కంపెనీకి కట్టబెట్టడంలో ఎవరైనా చక్రం తిప్పుతున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పర్యావరణ నిబంధనల ప్రకారం శుద్ధి చేయకుండా సముద్రంలోకి ఈ వ్యర్థాలను వదిలితే మత్స్యకారుల ఉపాధికి తీవ్ర ఇబ్బంది కలగకతప్పదు.

**రూ.75కోట్లతో సీఈటీపీ ఏర్పాటు:** ఫార్మా వ్యర్థాలను శుద్ధి చేయడానికి సెజ్‌లో రూ.75 కోట్లతో 1.5 మిలియన్ లీటర్ల (ఎంఎల్‌డీ) సామర్థ్యంతో ప్లాంటు అందుబాటులోకి తెచ్చారు. ఏపీఐఐసీ మెజార్టీ వాటా కలిగి, సెజ్‌లోని పరిశ్రమలతో కలిసి పీపీపీ మోడ్‌లో సీఈటీపీ ఏర్పాటు, నిర్వహణ చేసేలా 2016 డిసెంబరులో ఒప్పందం చేసుకున్నాయి. అచ్యుతాపురం ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ లిమిటెడ్ (ఏఈటీఎల్) పేరుతో బోర్డును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అచ్యుతాపురం సెజ్‌లో 58 వరకు ఫార్మా పరిశ్రమలున్నాయి. వాటి నుంచి నిత్యం ప్రమాదకరమైన రసాయన వ్యర్థాలు ఉత్పన్నమవుతుండగా, ప్రతిరోజూ ఒక ఎంఎల్‌డీ మాత్రమే శుద్ధి చేయగల్గుతున్నారు.

**రాంకీకి అప్పగించినా..:** ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటు నిర్వహణ బాధ్యతలు తొలుత ఏఈటీఎల్ బోర్డే చూసింది. కొన్ని కారణాలతో ఏఈటీఎల్ తప్పుకోగా, ఏపీఐఐసీ తీసుకుంది. గత ప్రభుత్వంలో ప్రైవేటుగా రాంకీ కంపెనీకి ఓఅండ్ఎం కింద అప్పగించగా, ఆరు నెలలకే వెళ్లిపోయింది. మళ్లీ ఏపీఐఐసీ బాధ్యతలు తీసుకుని చూస్తోంది. తాజాగా మళ్లీ ప్రైవేటుకి ఇచ్చేందుకు అడుగులు వేశారు. ప్లాంటు పూర్తిస్థాయిలో పనిచేసేలా రూ.3 కోట్లు మాత్రమే తొలి విడతలో గుజరాత్ కంపెనీ ఖర్చు చేస్తానని తెలిపింది. తరువాత సముద్రంలో శుద్ధి చేసిన వ్యర్థాలను కలిపే ప్రక్రియకు బ్రేక్ వేసి ఏకంగా జీఎల్‌డీ (జీరో లిక్విడ్ డిశ్చార్జ్) సిస్టం తెస్తామని చెప్పి కంపెనీ ముందుకొచ్చిందంటున్నారు అధికారులు. రాంకీ లాంటి అనుభవం ఉన్న కంపెనీనే నిర్వహణ చేయలేకపోతే గుజరాత్ కంపెనీ ఎలా చేస్తుందనేది అంతుచిక్కని ప్రశ్నగా మారింది.

**ఆగమేఘాలపై నిర్ణయం:** నిర్వహణ ప్రైవేటుకు ఇచ్చే అంశంపై ఏఈటీఎల్ బోర్డులోని పరిశ్రమలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. తమ ప్రతిపాదనను పరిశీలించాలని మంత్రి టీజీ భరత్, ఏపీఐఐసీ ఎండీకి లేఖలు రాశాయి. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు సీఈటీపీ నిర్వహణ జరగడం వల్ల వ్యర్థాలు పర్యావరణ నిబంధనల ప్రకారం శుద్ధిచేసి సముద్రంలోకి పంపుతున్నారు. దీని వల్ల ఇబ్బందులు ఏమీ తలెత్తలేదు. ఈ బాధ్యతలను ఒక్కసారిగా గుజరాత్‌కు చెందిన కంపెనీకి ఇస్తూ బోర్డులో నిర్ణయం తీసుకున్నారు. ఆరు నెలలు మొదట నిర్వహణ చేసేందుకు కంపెనీ ఒప్పందం చేసుకోవడం చూస్తే ఏఈటీఎల్ బోర్డు నిధులను సామగ్రి పేరుతో ఖర్చు చేసేసి, ఆపై నిర్వహణ చేయలేనని వెళ్లిపోతే పరిశ్రమల పరిస్థితి ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**కథ నడుపుతుంది ఎవరు?**

ఏఈటీఎల్ బోర్డు, ఇతర మరో కంపెనీ ఒకటి ఈ ప్లాంటు నిర్వహణ చేస్తామని ముందుకొచ్చినా, ఎక్కడో ఉన్న గుజరాత్ కంపెనీ వైపే మొగ్గు చూపడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత వైకాపా హయాంలో ఓ అధికారి ఈ ప్లాంటు విషయంలో కీలకంగా వ్యవహరించి చక్రం తిప్పారు. శుద్ధి చేయకుండానే రసాయన వ్యర్థాలను సముద్రంలో కలిపి ప్రతి నెలా రూ.లక్షల్లో జేబుల్లో వేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. రసాయన వ్యర్థాలు సముద్రంలో కలవడం వల్ల ఉపాధి లేకుండా పోతుందంటూ మత్స్యకారులు ఆందోళన సైతం చేశారు. ప్రస్తుతం ఆ అధికారి హెడ్‌క్వార్టర్‌లో ఉన్నప్పటికీ ఈ ప్లాంటును గుజరాత్‌కు చెందిన కంపెనీకి అప్పగించడంలో చక్రం తిప్పారన్న చర్చ సాగుతోంది.'సామర్థ్యం పెంచి బాగా పని చేయించేందుకు ఓ అండ్ ఎం బాధ్యతలు ఇచ్చాం. ఇలా ఇవ్వడం సాధారణ అంశమే' అని కొందరు ఏపీఐఐసీ అధికారులు చెప్పుకొస్తున్నారు.

# ఇళ్ల దరఖాస్తుకు ఇంకాస్త గడువు

నక్కపల్లి : ప్రజల సొంతింటి కల నెరవేర్చేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోంది. అర్హత కలిగిన వారికి ఇళ్లు మంజూరు చేయడానికి వీలుగా దరఖాస్తు గడువును మరింత పొడిగించింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అసంపూర్తి ఇళ్లను పూర్తి చేయించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. దీనిలో భాగంగా వీటికి అదనపు సాయం ప్రకటించింది. మరోవైపు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద ఆసక్తి, అర్హత కలిగిన వారికి ఇళ్లను మంజూరు చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. దీనికి తొలుత కేంద్రం ఈనెల 5 వరకు మాత్రమే గడువు ఇచ్చింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వ కోరిక మేరకు నెలాఖరు వరకు పొడిగించింది. తద్వారా మరో మూడు వారాలపాటు దరఖాస్తుకు అవకాశం ఉంది. దీనివల్ల మరింత మందికి మేలు జరగనుంది. ఈ పథకంలో పట్టణ, పురపాలిక ప్రాంతాల్లో ఉన్న వారికి కేంద్రంతోపాటు, రాష్ట్రం కలిపి రూ. 2.89 లక్షలవరకు ఇస్తున్నాయి. ఇందులో ఉపాధి హామీ, స్వచ్ఛభారత్ నిధులు కలిపి ఉన్నాయి. నర్సీపట్నం, ఎలమంచిలి, అనకాపల్లి పురపాలికల పరిధిలో 253 మందికి ఇంతవరకు అనుమతులు వచ్చాయి.

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారికి కేవలం రూ. 1.59 లక్షలు మాత్రమే వస్తుంది. జిల్లాలో కోటవురట్ల మండలంలో మూడు, చోడవరంలో అయిదు కలిసి మొత్తం ఎనిమిది పంచాయతీలకు ఇది వర్తిస్తుంది. ఇక మిగిలిన అన్ని గ్రామాలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (యూడీఏ) కింద ఉన్నాయి. వీటి పరిధిలో ఇళ్లకు సైతం పట్టణ, నగర ప్రాంతాల్లో మాదిరిగానే రూ. 2.89 లక్షలు చెల్లించాల్సి ఉండగా, దీనికి అనుమతులు రాలేదు. దీనిపై ఆశతో ఇప్పటికే జిల్లాలో 16 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. గ్రామీణంలో ఉన్న వారికి తక్కువ నగదు వస్తుండటంతో వీరికి అదనపు సాయం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందని సంబంధితశాఖ అధికారి ఒకరు 'న్యూస్‌టుడే'కి తెలిపారు.

**అవకాశం సద్వినియోగం చేసుకోవాలి:**

పీఎంఏవై ద్వారా గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం చేసుకోడానికి సిద్ధంగా ఉన్నవారి వివరాలను యాప్‌లో నమోదు చేయిస్తున్నాం. ప్రభుత్వం గడువు పెంచడంతో అర్హులైన వారందరికీ మేలు జరుగుతుంది.

# తెల్లబంగారంపై ఆశలు



అనంతపురం : అనంతపురం జిల్లాలో 65 వేలకు పైగా ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అందులో అత్యధికంగా పెద్దవడుగూరు మండలంలోనే సాగవుతుండటం గమనార్హం. ఆ ప్రాంతంలో 35 వేల నుంచి 40 వేల ఎకరాల్లో రైతులు పంట వేశారు. హెచ్చెల్సీ ప్రధాన కాలువ కింద ఆయకట్టు భూములు ఉండటంతో పండిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉత్పత్తిని అమ్ముకునేందుకు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. ఈ ఏడాది దిగుబడి ఆశాజనకంగా ఉన్నప్పటికీ గిట్టుబాటు ధర దక్కుతుందా అనే సంశయం రైతుల్లో నెలకొంది. ఏటా ఇదే పరిస్థితి. పంట చేతికొచ్చే సమయానికి గిట్టుబాటు ధరలు దక్కక పలువురు ఇళ్లలో నిల్వ చేసుకుంటున్నారు. మంచి ధర వస్తే విక్రయించడానికి ఎదురుచూస్తుంటారు. ప్రస్తుతం కొట్టాలపల్లి, దిమ్మగుడి, గంజిగుంటపల్లి, కండ్లగూడూరు, చిట్టూరు గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. చాలా మంది రెండేళ్లుగా ఇళ్లలోనే పెట్టుకున్నారు. తాడిపత్రి, గుత్తి ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఇటీవల అధికారులు ప్రకటించడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. కేంద్రాల ద్వారా క్వింటాలు రూ.8 వేలకు పైగా కొనుగోలు చేయనున్నట్లు తెలపడంతో గిట్టుబాటు అవుతుందని అన్నదాతల్లో వ్యక్తమవుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాలు ధర రూ.6,700 వరకు పలుకుతోంది.

**కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి**

శ్రీధర్, కడదరగుట్టపల్లి

ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుంది. దళారులను ఆశ్రయించకుండా నేరుగా కేంద్రాలకు తరలించి విక్రయిస్తే.. నగదు వస్తుందని భరోసా ఉంటుంది. దళారులకు విక్రయిస్తే నష్టపోవడంతోపాటు డబ్బును పొందలేక ఎన్నో అవస్థలు పడాల్సి వస్తుంది.

# అరటి గెల.. వెలవిల



ధర్మవరం : అరటికి గిట్టుబాటు ధర దక్కక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గెలలను కోయలేక చెట్లపైనే వదిలేశారు. కాయలు మాగుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. లక్షలు ఖర్చు చేసి పంట పండిస్తే అప్పులు మూటగట్టుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. పూజలు, శుభకార్యాలయాలకు సరైన సమయం ఇది. టన్ను రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు అమ్ముడుపోవాలి. కానీ బయట ప్రాంతాలకు ఎగుమతి లేక రూ.3 వేలు కూడా పలకడం లేదని రైతులు చెబుతున్నారు.శ్రీసత్యసాయి జిల్లాలో లక్ష టన్నులకు పైగా దిగుబడి పొలాల్లో ఉండిపోయింది. ఒక్క ధర్మవరం నియోజకవర్గంలోని తాడిమర్రి మండలం దాడితోట గ్రామంలో సుమారు 600–750 ఎకరాల్లో అరటి కోతకు సిద్ధంగా ఉంది.

జిల్లా: శ్రీసత్యసాయి

సాగు విస్తీర్ణం: 1,220 హెక్టార్లు

ఎకరా సాగుకు ఖర్చు: రూ.1.20 లక్షలు

పంట కాలం: 11 నుంచి 12 నెలలు

హెక్టారుకు దిగుబడి సగటున : 60–62 టన్నులు

**మూడు టన్నులకు రూ.5వేలు వచ్చాయి**

రాంపుల్లారెడ్డి, దాడితోట

మూడెకరాలు కౌలుకు తీసుకుని అరటి సాగు చేశా. పెట్టుబడి రూ.3.50 లక్షలు అయింది. నాణ్యమైన మందులు, సకాలంలో నీటితడులు అందించడంతో గెల బాగా వృద్ధిలోకి వచ్చింది. కోత సమయంలో ధరలు పడిపోయాయి. వారం కిందట మూడు టన్నుల అమ్మితే రూ.5 వేలు వచ్చింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

**ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయి**

చంద్రశేఖర్, జిల్లా ఉద్యానశాఖాధికారి

మహారాష్ట్రలో అరటి ఉండటం, రవాణా సౌకర్యాం దగ్గర కావడంతో వ్యాపారులు అక్కడే కొనుగోలు చేసి దిల్లీకి పంపిస్తున్నారు. కొన్ని రోజులపాటు ఇదే పరిస్థితి ఉంటుంది. నాణ్యమైన కాయలకు కాస్త ఎక్కువ ధరలున్నాయి. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ధరలు పెరుగుతాయి.

# కు.ని.కి పాట్లు వీడరు



ఆదోని : ఉమ్మడి కర్నూలు జిల్లాలో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల నిర్వహణ అంతంతమాత్రంగానే సాగుతోంది. ఒకప్పుడు ఏటా లక్ష్యాలు విధించేవారు. వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సమీక్షలు జరిపేవారు. వైద్య శిబిరాలు ఏర్పాటుచేసేవారు. ప్రస్తుతం అధికారులు పట్టించుకోకపోవడంతో బాధితులకు సేవలు అందడం లేదు.

**అవసరమైన నిపుణులేరీ..**

కు.ని. చికిత్స చేసే మహిళకు ముందుగా హెచ్‌బీ, ఆర్‌బీఎస్, మధుమేహం, హెచ్‌ఐవీ తదితర పరీక్షలు చేయాల్సి ఉంటుంది. చాలా కేంద్రాల్లో ల్యాబ్ నిపుణుల కొరత ఉంటోంది. ఈ నేపథ్యంలో సేవల కోసం వచ్చేవారు.. తమ పరిధిలోని పీహెచ్‌సీల్లో రక్తపరీక్షలు చేయించుకొస్తేనే పరిగణనలోకి తీసుకుంటున్నారు.

ప్రసవించిన రోజు నుంచి రెండు నెలల లోపు కు.ని. చికిత్సలు చేయించుకోవాలి. చికిత్స అనంతరం 24 గంటలపాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచి ఇంటికి పంపుతారు. బాలింతలు దూర ప్రయాణం చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

**బాధితులకు సేవలందక**

ఉమ్మడి జిల్లాలో ఏటా 65 వేలకుపైగా ప్రసవాలు జరుగుతుంటాయి. వీరిలో 25 శాతం మంది కు.ని. శస్త్రచికిత్సలు చేయించుకొంటుంటారు. 2024లో పది వేల మందికి కు.ని.శస్త్రచికిత్సలు జరిగాయి. వైద్యానికి పలువురు ఆసక్తి చూపుతున్నప్పటికీ సేవలు అందడం లేదు. కర్నూలు జిల్లాలో సర్వజన ఆస్పత్రితోపాటు 5 సీహెచ్‌సీలు ఉన్నాయి. ఆదోని, ఎమ్మిగనూరు సీహెచ్‌సీల్లో మాత్రమే సేవలు అందుబాటులో ఉన్నాయి. పత్తికొండ, ఆలూరు, కోడుమూరు సీహెచ్‌సీల్లో సేవలు శూన్యం. నంద్యాల జిల్లాలో 13 సీహెచ్‌సీలతోపాటు జిల్లా కేంద్రంలో సర్వజన ఆస్పత్రి ఉంది. గతేడాది సున్నిపెంటలో 0, వెలుగోడు 4 కు.ని. చికిత్సలు జరిగాయి. ఈ ఏడాది వీటి పరిధిలో ఒక్కటి కూడా నమోదు కాలేదు.

**కానరాని శిక్షణ**

గతంలో కు.ని. చికిత్సల కోసం ఆస్పత్రులవారీగా వైద్యులను ఎంపిక చేసి నెల రోజులపాటు శిక్షణ ఇచ్చి నిపుణుల పర్యవేక్షణలో చికిత్సలు చేయించేవారు. తర్వాత క్షేత్రస్థాయి సేవలకు అనుమతిచ్చేవారు. కరోనా తర్వాత ఇలాంటి శిక్షణలు కరవయ్యాయి. వీటిపై జిల్లా అధికారులు సైతం దృష్టి సారించడం లేదు.

# ఊరికో బ్యాంకు.. ప్రతి ఒక్కరికి ఖాతా ఉండేలా..

నంద్యాల తపాలా శాఖ ఊరికో బ్యాంకు ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు(ఐపీపీబీ)లు స్థాపించింది. తద్వారా పట్టణ, గ్రామీణ ప్రజలకు తపాలా బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. పట్టణాల్లోని ప్రధాన తపాలా కార్యాలయాలు, గ్రామాల్లోని సబ్, బ్రాంచి పోస్టాఫీసుల్లో బ్యాంకు తరహా సేవలు అందిస్తున్నాయి.

**ప్రతి ఒక్కరికి ఖాతా ఉండేలా..**

సమీపంలోని తపాలా కార్యాలయానికి ఆధార్ కార్డు, చరవాణి తీసుకెళ్లి రూ.250 చెల్లిస్తే ఖాతా తెరిచి క్యూఆర్ కార్డు ఇస్తారు. అవసరమైనప్పుడు తపాలా కార్యాలయాల్లో క్యూఆర్ కార్డును వినియోగించి నగదు లావాదేవీలు చేసుకోవచ్చు. చరవాణిలో ఖాతా నంబరు, కస్టమర్ ఐడీ, ఫోన్ నంబరు, 4 అంకెల పిన్‌ను ఎంటర్ చేసి మొబైల్ బ్యాంకింగ్ సేవలు పొందొచ్చు.అందిస్తున్న సేవలు

ఐపీపీబీ అనేది తపాలా శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వ యాజమాన్య పేమెంట్ బ్యాంకు. దీని ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలను ఖాతాదారులు పొందొచ్చు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, వాహన మిత్ర వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, డిజిటల్ ఆర్థిక సేవలను సులభంగా ఉపయోగించుకోవచ్చు. డబ్బును జమ లేదా ఉపసంహరించుకోవచ్చు.

హెడ్ పోస్టాఫీసులు, సబ్ పోస్టాఫీసుల్లో రోజుకు రూ. 2లక్షలు, తపాలా కార్యాలయాల్లో రూ.25 వేలు వరకు లావాదేవీలు చేసుకోవచ్చు.

ఐపీపీబీ అకౌంట్‌ను పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్‌కు అనుసంధానం చేసుకుంటే అన్నిసేవలు ఇంటి వద్ద నుంచే పొందవచ్చు. విత్ డ్రాకు సమీపంలోని తపాలా కార్యాలయానికి వెళ్లాలి.విద్యుత్తు, నీరు, గ్యాస్, మొబైల్ రీఛార్జి, ఇన్సూరెన్స్ ప్రీమియంలు, డీటీహెచ్ వంటి బిల్లులు చెల్లించవచ్చు.

# హరిత వేదిక.. ఆహ్లాద వేడుక!

పాలకొల్లు: వివాహాలు.. గృహ ప్రవేశాలు.. వాణిజ్య సముదాయాల ప్రారంభోత్సవాల సందర్భంగా అలంకరణ మొక్కలకు ప్రాధాన్యం పెరుగుతోంది. మొక్కలు, చిన్నపాటి చెట్లఅలంకరణతో వేదిక అందం రెట్టింపవుతోంది. దీనికి అవసరయ్యే మొక్కలన్నీ కొనుగోలు చేసి తేవాలంటే సాధ్యమయ్యే పనికాదు. ఈ క్రమంలో మొక్కలను అద్దెకు ఇచ్చే పద్ధతి మొదలైంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు అన్ని నర్సరీల నిర్వాహకులు రోజుల లెక్కన, గుత్త ఒప్పందాలు, ఇతర పద్ధతుల్లో అలంకరణ మొక్కలను అద్దెకు ఇస్తున్నారు.

పచ్చని పొదరిల్లులాంటి వేదికలో వివాహ వేడుక నిర్వహించాలని ఏలూరుకు చెందిన ఓ కుటుంబం నిర్ణయించింది. వేదిక అలంకరణ బృందానికి ఈ పని అప్పగించారు. సదరు నిర్వాహకుడు నగరంలో ఓ నర్సరీకి వెళ్లి అక్కడ ఆకర్షణీయంగా ఉన్న పలు రకాల మొక్కలను ఎంపిక చేసి అద్దె ప్రాతిపదికన లారీపై కల్యాణ వేదికకు తరలించారు. వేదిక ప్రాంగణమంతా అలంకరణ మొక్కలు ఉంచి, మండపం పైభాగాన్ని వివిధ రకాల పొదులతో ముచ్చటగా తీర్చిదిద్దారు.

వస్త్ర, నగల దుకాణాల ప్రారంభోత్సవాలకు వీటిని విరివిగా వినియోగిస్తున్నారని ఏలూరులోని అశోక్ నర్సరీ యజమాని శ్రీను చెప్పారు. మొక్క రకం, సైజును బట్టి ఒక్కోదానికి రోజుకు రూ.30 నుంచి



రూ.50 వరకు అద్దె ఉంటుందని తెలిపారు. పచ్చని మొక్కలు అతిథులకు ఆహ్లాదం పంచడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

**పెరుగుతున్న డిమాండ్..**

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు వద్ద ఉన్న నర్సరీ నిర్వాహకులు ఆటోలో పట్టినన్ని మొక్కలు ఇచ్చి రోజుకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు అద్దె తీసుకుంటున్నారు. ప్రముఖ నాయకుల పర్యటనలు, సభల్లోనూ అలంకరణ మొక్కలకు చోటు దక్కుతుంది.

కుండీలు ఇచ్చి.. ఆలయాల్లో నిర్వహించే వేడుకలకు అలంకరణ నిమిత్తం ఆయా కమిటీలు ఆన్‌లైన్‌లో కుండీలను కొనుగోలు చేస్తున్నాయి. వాటిని 2 నెలల ముందే నర్సరీ నిర్వాహకులకు అప్పగించి వివిధ రకాల మొక్కలు పెంచుతున్నారు. మొక్కలతో ఉన్న కుండీలను తీసుకొచ్చి కార్యక్రమాలు ముగిసే వరకు వినియోగిస్తున్నారు. అనంతరం కుండీలతో సహా మొక్కలను నర్సరీలకు ఇచ్చేస్తున్నారు. ఈ విధానం ఉభయులకూ గిట్టుబాటు అవుతుందని యలమంచిలి శివాలయం కమిటీ సభ్యులు తెలిపారు.

# తీగలే.. కాల నాగులై!

మొగల్తూరు : నరసాపురం మండలం పీఎం లంక గ్రామానికి చెందిన ఓ రైతు మంచి ఆదాయం వస్తుందనే ఆశతో రొయ్యల సాగు చేపట్టారు. కొద్ది నెలల కిందట ఆయన చెరువు గట్టుపై ఉండగా విద్యుత్తు తీగ తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. దీంతో ఆ కుటుంబం జీవనాధారం కోల్పోయింది. పెనుమంట్ర మండలానికి చెందిన యువకుడు గతంలో ఆక్వా చెరువు గట్టుపై గడ్డి కోస్తుండగా విద్యుత్తు తీగను తాకి అక్కడికక్కడే మృతి చెందారు. 8 గంటల తర్వాత స్థానికులు అతడు మృతి చెందినట్లు గుర్తించారు. అత్తిలి మండలంలో ఆక్వా చెరువు వద్ద జరిగిన ప్రమాదంలో కూలీ తీవ్రంగా గాయపడ్డారు. కొన్ని నెలల చికిత్స అనంతరం ఆయన కోలుకోగా ఒక చేయి కోల్పోయారు. చెరువు యాజమాని బాధితుడి కుటుంబానికి కొంత ఆర్థిక సాయం అందించి కేసు లేకుండా రాజీ చేసుకున్నారు. రొయ్యల చెరువుల్లో ప్రాణవాయువు స్థిరీకరణకు విద్యుత్తుతో నడిచే ఏరియేటర్లను వినియోగిస్తారు. వీటి కోసం చెరువు చుట్టూ గట్ల మీదుగా విద్యుత్తు తీగలను ఏర్పాటు చేస్తారు. వీటి విషయంలో తగిన భద్రతా చర్యలు పాటించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరిగి రైతులతో పాటు కూలీలు ప్రాణాలు కోల్పోతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏటా పదుల సంఖ్యలో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నా భద్రతా చర్యలపై యంత్రాంగం దృష్టి సారించడం లేదు. వెలుగులోకి వచ్చేవి కొన్నే.. చెరువుల వద్ద విద్యుత్తు తీగలు, ఇతర పరికరాల ఏర్పాటులో భద్రతా ప్రమాణాలు పాటించడం లేదు. దీంతో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయి. చెరువుల యాజమానులు బాధిత కుటుంబాలకు ఎంతో కొంత పరిహారం ముట్టజెప్పి రాజీ చేసుకుంటున్నారు. మృతుల్లో ఎక్కువ శాతం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వలస కూలీలే ఉంటున్నారు. ఆక్వా చెరువుల వద్ద విద్యుత్తు కనెక్షన్లు, పరికరాల వినియోగంలో పాటించాల్సిన జాగ్రత్తలపై రైతులకు



తరచూ అవగాహన కల్పిస్తున్నట్లు ఈఈ కేఎం కుమార్ తెలిపారు.

**ఇవి పాటిస్తే నష్ట నివారణ..**

ఏరియేటర్లు, బోర్ల మోటార్ల సామర్థ్యానికి అనుగుణంగా అవసరమైన తీగలను మాత్రమే వినియోగించాలి.

తీగలు నేలపై లేకుండా చర్యలు తీసుకోవాలి. తప్పనిసరి పరిస్థితుల్లో వైరింగ్ పైపులను వినియోగించాలి. అవి పైకి కనిపించేలా గడ్డి, పిచ్చిమొక్కలను లేకుండా గట్లను శుభ్రం చేసుకోవాలి.

తీగలు, ఇతర పరికరాలు పాడైతే తాత్కాలిక పనులతో వదిలేయకుండా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాలి.

జిల్లాలో ఆక్వా చెరువుల విస్తీర్ణం : 1.32 లక్షల ఎకరాలు

రైతుల సంఖ్య : 42,552

చెరువుల వద్ద పనిచేసే కూలీలు : సుమారు 20వేలు

విద్యుత్తు కనెక్షన్లు : 17,754

## దేవతా సుందరికి మరో రూపం


ఇటీవలి కాలంలో ఫ్యాషనిస్టాలకు సైతం మతులు చెడగొడుతోంది ఫాతిమా సనా షేక్. ఈ బ్యూటీ నటించిన గుస్తాక్ ఇష్క్ ఇటీవలే విడుదలై విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఈ చిత్రంలో ఫాతిమా సరసన విజయ్ వర్మ కథానాయకుడిగా నటించాడు. విజయ్- ఫాతిమ జంట కెమిస్ట్రీ అద్భుతంగా వర్కవుటైంది! అంటూ ప్రశంసలు కురుస్తున్నాయి. మరోవైపు ఫాతిమ గుస్తాక్ ఇష్క్ ప్రమోషన్స్ కోసం ఎంపిక చేసుకున్న చీరలు, డిజైనర్ దుస్తుల గురించి ఆసక్తికర చర్చ సాగుతోంది. కొద్ది రోజులుగా కోఆర్డ్ సెట్ లకు బదులుగా



ఫాతిమ చీరల్లో తళుకుబెళుకులు ప్రదర్శిస్తోంది. శాటిన్ శారీ, సీక్విన్ శారీ, వెల్వెట్ శారీ అంటూ రకరకాల డిజైనర్ లుక్స్ తో మైండ్ బ్లాంక్ అయ్యే ట్రీటిస్తోంది ఫాతిమా. తాజాగా వైట్ అండ్ వైట్ డిజైనర్ శారీలో ఫాతిమ ఇచ్చిన ఫోజులు ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతున్నాయి. ఈ లుక్ ని మనీష్ మల్హోత్రా డిజైన్ చేసారు. ఫాతిమ సిగ్గులొలకబోస్తూ, అలా తెలుపు రంగు చీర – బ్లౌజ్ లో అందంగా దేవతాసుందరిని తలపిస్తోంది. ఈ ఫోటోషూట్ తో పాటు ఫాతిమా ఒక అందమైన క్యాప్షన్ ని కూడా ఇచ్చింది. మనీష్ మల్హోత్రా హీరోయిన్ కావడం వల్ల కలిగే ప్రయోజనాలు.. బహుశా నేను ఇంతకు ముందు కంటే అందంగా ఉన్నట్లు అనిపిస్తుంది... ధన్యవాదాలు మనీష్ అంటూ లవ్ ఈమోజీలను షేర్ చేసింది. దంగల్ చిత్రంలో రఫ్ గా మగరాయుడు తరహాలో కనిపించిన ఫాతిమ ఇప్పుడు చీరకట్టులో భర్తను ప్రేమించే ఒక అందమైన గృహిణిలా అందంగా కనిపిస్తోంది! అంటూ యూత్ కితాబిచ్చేస్తున్నారు.

## సల్మాన్ ఓటమి ఈ సౌత్ స్టార్ చేతిలో ఖాయం?

ఖాన్‌లను రేసులో వెనక్కి నెట్టే సత్తా ఇప్పుడు సౌత్ బిగ్గెస్ట్ స్టార్లకు ఉందా? అంటే.. ఈ ప్రశ్నకు సమాధానం స్పష్టంగా అవును అనే వినిపిస్తోంది. సౌతిండియా నుంచి ప్రభాస్, యష్, ఎన్టీఆర్, చరణ్ లాంటి స్టార్లు పాన్ ఇండియా స్టార్లుగా నిరూపించుకున్నారు. ఇప్పుడు గ్లోబల్ మార్కెట్లలో నిరూపించుకునేందుకు ఒకరితో ఒకరు పోటీపడుతున్నారు. అదే సమయంలో 60 ప్లస్ ఖాన్ ల త్రయం రేసులో వెనకబడటం ప్రధానంగా చర్చకు వస్తోంది. ఖాన్‌ల త్రయం అంటే ఒకప్పుడు అనే భావన ప్రజల్లో పాదుకుంది. ముఖ్యంగా ఖాన్ లు ఉత్తరాదిన హవా చాటగలిగినా, ఇప్పటికీ సౌత్ లో ఒక ముద్ర వేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. అందువల్ల భవిష్యత్ లో వారికి సౌత్ వసూళ్లు అందని మావి లాంటివి. సరిగ్గా అదే సమయంలో సౌత్ స్టార్లు సౌత్ వసూళ్లను మించి, ఉత్తరాది మార్కెట్లో బాక్సాఫీస్ వద్ద హవా సాగిస్తున్నారు. సౌతిండియా వసూళ్లకు మూడు నాలుగు రెట్లు అదనంగా ఉత్తరాది మార్కెట్ నుంచి కొల్లగొడుతూ ఆశ్చర్యపరుస్తున్నా రు. అందువల్ల త్వరలో విడుదలకు వస్తున్న యష్ – టాక్సిక్, సల్మాన్ – ది బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్ చిత్రాలలో హైప్ దేనికి ఎక్కువ? అనేది చర్చగా మారింది. ఈసారి కూడా రాకింగ్ స్టార్ యష్ హవా సాగేందుకు ఆస్కారం ఉంది. అతడికి ఉత్తరాదిన మాస్ లో మ్యాసివ్ ఫాలోయింగ్ ఉంది గనుక టాక్సిక్ ఓపెనింగులు అసాధారణంగా ఉంటాయని అంచనా వేస్తున్నారు. కేజీఎఫ్, కేజీఎఫ్ 2 తర్వాత యష్ చాలా గ్యాప్ తీసుకుని మహిళా దర్శకురాలు గీతూ మోహన్ దర్శకత్వంలో టాక్సిక్ అనే ప్రయోగాత్మక చిత్రంలో నటిస్తున్నాడు. ఈ సినిమాకి రాజీ అన్నదే లేకుండా బడ్జెట్ ని ఖర్చు



చేస్తున్నారు. ఇది యష్ స్థాయిని మరో లెవల్ కి తీసుకెళుతుందని అభిమానులు భావిస్తున్నారు. అదే సమయంలో సల్మాన్ ఖాన్ రెండు వరుస పరాజయాల తర్వాత యుద్ధభూమిలో దిగుతున్నాడు. అతడు నటించిన టైగర్ 3, సికందర్ భారీ డిజాస్టర్లుగా మారాయి. ఆ తర్వాత అతడు నటిస్తున్న ది బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్ పై అతడి ఆశలన్నీ ఉన్నాయి. ఇది దేశ భక్తి నేపథ్యంలో రూపొందుతున్న సినిమా. ఇండో చైనా బార్డర్ నేపథ్యంలో కథాంశం సాగనుంది. ఈ చిత్రానికి అత్యంత భారీ బడ్జెట్ ని ఖర్చు చేస్తున్నా రు. అయితే సల్మాన్ ఖాన్ ఎంపిక సరైనదే అయినా టీజర్లు, ట్రైలర్ తో ఈ చిత్రం అందరినీ ఆకట్టుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే యష్ నటించిన టాక్సిక్ టీజర్ ఆకట్టుకుంది. దానిని మించేలా ఖాన్ తన ప్రచార వీడియోలను బరిలోకి దించాలి. 2026 వేసవిలో మాస్ జాతరకు తెర తీయాలంటే ఆ ఇద్దరూ భారీగా ప్రమోషన్స్ చేయాల్సి ఉంటుంది. అయితే ఈ రేసులో ఎవరు విజేతగా నిలుస్తారు? ఎవరు వెనకబడతారు? అన్నది ప్రస్తుతానికి సస్పెన్స్. ఈ రెండు సినిమాలు ఒకదానితో ఒకటి సంబంధం లేని కథలతో వస్తున్నాయి గనుక ప్రజల ప్రాధాన్యత దేనికి ఎక్కువ? అన్నది కూడా వేచి చూడాలి. అంతిమంగా ప్రేక్షకులను కుర్చీ అంచుపైకి లాగే, ఎమోషన్ కి గురి చేసే కథాంశం, గ్రిప్పింగ్ స్టోరి టెల్లింగ్ బాక్సాఫీస్ వద్ద గెలిపిస్తాయనడం లో సందేహం లేదు. ఈ రెండు సినిమాలు అత్యంత భారీ బడ్జెట్లతో రూపొం దుతున్నందున కనీసం 500 కోట్ల నికర వసూళ్లను సాధిస్తేనే ఇవి విజయం సాధించినట్టు. మారిన ట్రెండ్ లో పాన్ ఇండియాలో ఎవరు ఆధిపత్యం చెలాయిస్తారో అలాంటి హీరోలకు మాత్రమే విజయం దక్కినట్టు భావించాలి.




## 'రాజా సాబ్' రన్ టైమ్.. ఇది కొంచెం రిస్క్ అనిపించట్లేదా?



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సినిమా అంటేనే భారీతనానికి కేరాఫ్ అడ్రస్. ప్రస్తుతం మారుతి దర్శకత్వంలో వస్తున్న 'రాజా సాబ్' సినిమాపై అంచనాలు గట్టిగానే ఉన్నాయి. హార్రర్ కామెడీ జానర్ లో ప్రభాస్ ను చూడబోతున్నామనే ఆసక్తి ఫ్యాన్స్ లో ఉంది. అయితే సినిమా రిలీజ్ కు ఇంకా నెల రోజులకు పైగా సమయం ఉండగానే, ఇప్పుడు దీని రన్ టైమ్ గురించి ఒక ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఆ నెంబర్ చూసి కొందరు ఆశ్చర్యపోతుంటే, మరికొందరు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా హార్రర్ కామెడీ సినిమాలు ఎంత క్రిస్ప్ గా ఉంటే అంత మంచిది. రెండు నుంచి రెండున్నర గంటల లోపు ఉంటేనే ఆ కిక్ ఉంటుంది. కానీ ఇప్పుడు వినిపిస్తున్న టాక్ ప్రకారం 'రాజా సాబ్' రన్ టైమ్ ఏకంగా 3 గంటల 15 నిమిషాలు ఉంటుందని బజ్ నడుస్తోంది. ఒక ఎంటర్టైన్మెంట్ సినిమాకు ఇంత నిడివి అవసరమా అనే చర్చ మొదలైంది. ఇది నిజంగానే కొంచెం రిస్క్ అనిపించట్లేదా అని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గతంలో 'అర్జున్ రెడ్డి', 'ఆర్ఆర్ఆర్', రీసెంట్ గా 'యానిమల్' వంటి సినిమాలు మూడు గంటలకు పైగా ఉన్నా ఆడియెన్స్ ఆదరించారు. కానీ అవన్నీ ఎమోషనల్ ఉన్న డ్రామాలు లేదా భారీ యాక్షన్ సినిమాలు. కామెడీ ప్లస్ హారర్ జానర్ లో మూడుంబావు గంటల పాటు ప్రేక్షకుడిని కుర్చీలో కూర్చోబెట్టడం అంటే కత్తి మీద సాము లాంటిదే. ఎక్కడ ఏ మాత్రం ల్యాగ్ వచ్చినా ఫలితం తారుమారయ్యే ప్రమాదం ఉంది. దర్శకుడు మారుతి ఈ ఛాలెంజ్ ను ఎలా స్వీకరిస్తారో చూడాలి. అయితే ఈ నిడివి వెనుక మరో కారణం కూడా ఉండొచ్చు. ఇందులో ప్రభాస్ వింటేజ్ లుక్స్, ఫ్యాన్స్ కోరుకునే అంశాలు ఎక్కువగా ఉండటం వల్ల లెంగ్త్ పెరిగి ఉండవచ్చు. లేదా సినిమాలో వచ్చే ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్, పాటలు రన్ టైమ్ ను పెంచి ఉండొచ్చు. కథ డిమాండ్ మేరకే ఇంత సమయం తీసుకున్నారని, ఎడిటింగ్ టేబుల్ దగ్గర ఇంకా మార్పులు జరిగే అవకాశం ఉందని ఇన్ సైడ్ టాక్. మరోవైపు అమెరికాలో ఈ సినిమా బుకింగ్స్ అప్పుడే మొదలయ్యాయి. సాధారణంగా రన్ టైమ్ ఎక్కువ ఉంటే రోజుకు పడే షోల సంఖ్య తగ్గుతుంది. ఇది ఓపెనింగ్స్ మీద ప్రభావం చూపిస్తుంది. అయినప్పటికీ డిస్ట్రిబ్యూటర్లు ఇంత ముందుగానే బుకింగ్స్ ఓపెన్ చేశారంటే, సినిమా అవుట్ పుట్ మీద వారికి గట్టి నమ్మకమే ఉండి ఉంటుంది. ప్రస్తుతానికి ఇది కేవలం అనుకుంటున్న రన్ టైమ్ మాత్రమే. సెన్సార్ పూర్తి అయ్యేసరికి ఫైనల్ కట్ లో చాలా మార్పులు ఉండొచ్చు. మూడు గంటల సినిమానా లేక ట్రిమ్ చేస్తారా అనేది తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే. ఏది ఏమైనా 'రాజా సాబ్' నిడివి విషయం మాత్రం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

## 'అఖండ' సెన్సార్.. బోయపాటి సేఫ్ గేమ్




నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కలయికలో వస్తున్న 'అఖండ 2: తాండవం' విడుదలకు సర్వం సిద్ధమైంది. డిసెంబర్ 5న థియేటర్లలోకి రాబోతున్న ఈ సినిమాకు సంబంధించి చివరి అడ్డంకి కూడా తొలగిపోయింది. సినిమాపై ఉన్న అంచనాల నడుమ, తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని రిలీజ్ కు రెడీ అయ్యింది. చిత్ర యూనిట్ అధికారికంగా ఈ విషయాన్ని పోస్టర్ ద్వారా వెల్లడించింది. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. అంటే ఇందులో యాక్షన్ మోతాదు గట్టిగానే ఉన్నా, ఫ్యామిలీ ఆడియన్స్ కూడా చూసేలా ఎమోషన్స్ బ్యాలెన్స్ చేశారని అర్థమవుతోంది. సాధారణంగా బోయపాటి సినిమాల్లో వైలెన్స్ కాస్త ఎక్కువగానే ఉంటుంది. అయినా సరే U/A వచ్చిందంటే, డివోషనల్ టచ్ సినిమాను సేఫ్ జోన్ లో ఉంచిందని భావించవచ్చు. ఈమధ్య కాలంలో వైలన్స్ కొంచెం ఎక్కువైనా కూడా U/A సెన్సార్ రావడం చూస్తున్నాం. కానీ బోయపాటి వైలెన్స్ డోస్ మించకుండా చాలా జాగ్రత్తలు తీసుకున్నట్లు అర్థమవుతుంది. అఘోరా గెటప్ లో బాలయ్య విలన్స్ ని ఊచకోత కోసే సీన్స్ ఉన్నా కూడా ఈ తరహాలో సెన్సార్ రావడం ఊహించని ట్విస్ట్. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ లో బాలయ్య లుక్ చాలా సీరియస్ గా ఉంది. చేతిలో గద పట్టుకుని, అఘోరా గెటప్ లో నడుచుకుంటూ వస్తున్న తీరు సినిమాలో ఉండబోయే ఇంటెన్సిటీని సూచిస్తోంది. వెనుక ఆంజనేయ స్వామి విగ్రహం, దేవాలయాల బ్యాక్ డ్రాప్ చూస్తుంటే.. కథలో దైవశక్తికి, దుష్టశక్తికి మధ్య జరిగే పోరాటం బలంగానే ఉండబోతోందని స్పష్టమవుతోంది. మొదటి భాగం 'అఖండ'లో శివుడి రిఫరెన్స్ ఉంటే, ఈసారి హనుమంతుడి ప్రస్తావన కూడా ఉంటుందని పోస్టర్ ద్వారా హింట్ ఇచ్చారు. తమన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్, బోయపాటి మార్క్ ఎలివేషన్స్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. అయితే రన్ టైమ్, కథనం విషయంలో మేకర్స్ ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారనేది సినిమా చూస్తేనే తెలుస్తుంది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్ పై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించిన ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ అవుతుండటంతో, ఇతర భాషల్లోనూ సెన్సార్ ఫార్మాలిటీస్ పూర్తయినట్లు తెలుస్తోంది. ప్రీ రిలీజ్ బిజినెస్ భారీగా జరిగింది కాబట్టి, ఓపెనింగ్స్ ఈ సినిమాకు చాలా కీలకం కానున్నాయి. సాంకేతిక పరమైన, చట్టపరమైన పనులన్నీ పూర్తయ్యాయి. ఇక మిగిలింది బాక్సాఫీస్ తీర్పు మాత్రమే. మాస్ యాక్షన్ కు, భక్తి రసాన్ని జోడించి బోయపాటి చేసిన ఈ ప్రయత్నం సీక్వెల్ సెంటిమెంట్ ను నిలబెడుతుందా? లేదా అనేది మరికొన్ని రోజుల్లో తేలిపోతుంది. ఫ్యాన్స్ మాత్రం బాలయ్య 'తాండవం' కోసం వెయిటింగ్.

## బాలయ్య 111లో కేరళ కుట్టీ?

నటసింహ బాలకృష్ణ 111వ చిత్రం గోపీచంద్ మలినేని దర్శకత్వంలోప్రారంభమైన సంగతి తెలిసిందే. ఇందులోనూ బాలయ్య ద్విపాత్రాభినయం చేస్తున్నారు. పీరియాడిక్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా రూపొందుతుంది. ఇందులో బాలయ్య కు హీరోయిన్ గా లేడీ సూపర్ స్టార్ నయనతారను తీసుకున్నారు. బాలయ్య తో నయన్ నటించడం నాల్గవసారి. మెయిన్ లీడ్ కి నయన్ హీరోయిన్గా కనిపించనుంది. మరి సెకెండ్ లీడ్ సంగతేంటి? అంటే ఆపాత్ర కోసం కేరళ కుట్టి ఆషికా రంగనాథ్ ని దించే ప్రయత్నాల్లో ఉన్నట్లు సన్నిహిత వర్గాల నుంచి తెలిసింది.

**ప్రతిభావంతురాలే కానీ:** మేకర్స్ ఆమెతో సంప్రదింపులు జరుపుతున్నారుట. ఆషికా గురించి కొత్తగా పరిచయం అవసరం లేదు. అమిగోస్ తో తెలుగు తెరకు పరిచయమైన అమ్మడు అటుపై నాగార్జున




హీరోగా నటించిన నా సామిరంగలో నటించింది. ఈ సినిమా విజయం సాధించడంతో మంచి గుర్తింపు దక్కింది. అందం, అభినయం గల నాయిక కావడంతో స్టార్ హీరోయిన్ అవుతుందని అంతా భావించారు. కానీ అనుకున్న విధంగా కెరీర్ సాగలేదు. నా సామీరంగ తర్వాత మరో తెలుగు సినిమా సైన్ చేయడానికి రెండేళ్లు సమయం పట్టింది. ప్రస్తుతం చిరంజీవి నటిస్తోన్న విశ్వంభర లో నటిస్తోంది.

**సీనియర్లలో ఆయనొక్కడే బ్యాలెన్స్..** అదీ హీరోయిన్ పాత్ర కాదు. సినిమాలో ఓ కీలకమైన పాత్ర మాత్రమే. అయినా అది సైడ్ క్యారెక్టర్ గానే భావించాలి. ఈ నేపథ్యంలో బాలయ్య సినిమాలో ఛాన్స్ ను అషీకా రంగనాద్ ఎంత మాత్రం మిస్ చేసుకునే అవకాశం లేదు. అమ్మడి వయసు కూడా మూడు పదులకు చేరుకుంది. దీంతో వయసు పరంగా సీనియర్లకు అడ్డంకిగా మారదు. సీనియర్ స్టార్లకు సరితూగుతుంది. బాలయ్య సినిమాలో ఛాన్స్ ఒకే అయితే? సీనియర్ హీరోల్లో పెండింగ్ లో ఉండేది విక్టరీ వెంకటేష్ మాత్రమే. ఆయనతోనూ ఓ సినిమా చేస్తే? సీనియర్లను పూర్తి చేసినట్లే.

**సొంత పరిశ్రమకు దూరం కాకుండా:** ప్రస్తుతం తమిళ్ లో కార్తీ కి జోడీగా స్పై థ్రిల్లర్ సర్దార్ 2లో నటిస్తోంది. మిత్రన్ దర్శకత్వం వహిస్తోన్న చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఈ సినిమా వచ్చే ఏడాది రిలీజ్ కానుంది. విశ్వంభర కూడా సమ్మర్ రిలీజ్ రేసులో కనిపిస్తుంది. అదే జరిగితే వరుస రిలీజ్ లతో ప్రేక్షకుల మధ్యలో ఉన్నట్లే. బాలయ్య సినిమా కూడా దసరా కు రిలీజ్ అయ్యే అవకాశం ఉంది. అలాగే ఆషికా సొంత పరిశ్రమ శాండిల్ వుడ్ కు దూరం కాలేదు. వచ్చిన అవకాశాలను అక్కడా సద్వినియోగం చేసుకుంటుంది. ఆమె నటించిన గత వైభవ అనే చిత్రం నవంబర్ లోనే రిలీజ్ అయింది.

## నిజ జీవిత పాత్రలో తమన్నా ట్రబుల్స్

నిజ జీవిత పాత్రల్లో నటించాలంటే చాలా సవాళ్లను ఎదుర్కోవాలి. నిజ కథలు, నిజ జీవిత పాత్రలకు ప్రత్యేకించి అభిమానులు ఉంటారు. వారిని సంతృప్తి పరిచేలా తారలు నటించి మెప్పించాల్సి ఉంటుంది. దానికోసం చాలా కసరత్తు చేయాలి. అయితే ఇప్పుడు నిజ జీవిత పాత్రలో నటించేందుకు సిద్ధమవుతున్న తమన్నా తాను ఎలాంటి సవాల్ కి అయినా సిద్ధమేనని పేర్కొంది. గల్లీబోయ్ ఫేం సిద్ధాంత్ చతుర్వేది ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు అభిజీత్ దేశ్ పాండే దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ సినీ నటుడు వి శాంతారామ్ జీవతకథతో ఇది తెరకెక్కుతోంది. ఈ చిత్రానికి చిత్రపతి వి శాంతారామ్ అని పేరు పెట్టారు. ఇందులో ప్రతి ఫ్రేమ్ లో తమన్నా తనను తాను నిరూపించుకోవడానికి ఆస్కారం ఉంది. సిద్ధాంత్-తమన్నా ఇద్దరూ నిజ జీవిత పాత్రలలో కనిపిస్తారు. తమన్నా పాత్ర కథనాన్ని నడిపించే కీలకమైన పాత్ర. ఇది నిజంగా సవాలుతో కూడుకున్న పాత్ర. ప్రేక్షకులు ఆమెను కొత్త కోణంలో చూడగలుగుతారు కాబట్టి తమన్నా కూడా ఉత్సాహంగా ఉన్నారని తెలుస్తోంది. ఈ చిత్రం



మరాఠా, హిందీలోను రూపొందనుంది. అభిజీత్ గతంలో డాక్టర్ కాశీనాథ్ ఘనేకర్ (2018) అనే బయోపిక్ ని రూపొందించారు. చిరస్మరణీయమైన మరాఠీ చిత్రం నటసామ్రాట్ (2016)కి అతడు దర్శకుడు. టేబుల్ నెం 21 (2013), వజీర్ (2016), బ్రీత్ (2018) వంటి హిందీ సినిమాలకు అతడు రచయితగా పని చేసారు.

**శాంతారామ్ సేవలు అనన్య సామాన్యం:** భారతీయ చిత్ర పరిశ్రమకు వి. శాంతారామ్ అందించిన సేవలు అపారమైనవి. ఈ చిత్రంతో యువతరం దాని గురించి నేర్చుకుంటుందని దర్శకనిర్మాతలు భావిస్తున్నారు. కొల్హాపూర్‌లో కడు పేదరికంలో జన్మించిన ఈ వ్యక్తి, పూణేలోని బాబూరావు పెయింటర్ వద్ద పని చేస్తూ, ఫిలింమేకింగ్ లో మెళకువలు నేర్చుకున్నాడు. అటుపై జనక్ జనక్ జనక్ పాల్ బాజ్ (1955), దో ఆంఖేన్ బరా హాత్ (1957) వంటి చిత్రాలతో హిందీ చిత్ర పరిశ్రమలో మరపురాని ముద్రను వేసాడు. ఈ చిత్రం ప్రేక్షకులకు ఆయన ఒక ట్రెండ్‌సెట్టర్ ఎలా అయ్యాడో చెబుతుంది. ఈ బయోపిక్ జ్ఞానోదయం కలగజేయడంలోనే కాదు.. ఎంతో వినోదాత్మకంగా, నాటకీయంగాను ఉంటుందని చెబుతున్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536